# కథామంజరి

## పది కథల సమాహారం



ఏప్రిల్ 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**ఏప్రిల్ 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 4



ఈ నెల కథామంజరి సంచికకు

**స్వర్గీయ చొప్పల్లి శ్రీనివాసరావు,**

**లలిత గార్ల**

పేరిట చేయూతనిచ్చిన వారి

**కుటుంబసభ్యులకు**

మా ధన్యవాదాలు.



## కథామంజరి
## నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా
## నిర్వహిస్తున్న కథల పోటీ

# పల్లెకు పోదాం,,!

కథ

కథామంజరి కథాప్రయాణంలో నాలుగు సంవత్సరాలు పూర్తిచేసుకుని, ఐదవ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కథల పోటీ నిర్వహిస్తున్నాం. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని అందరం నమ్ముతాం. ఆ పల్లెల్నే కథావస్తువుగా చేసుకొని అల్లిన కథలను పోటీకి ఆహ్వానిస్తున్నాం! ఆకట్టుకునే ఏ రసమైనా, ఏ అంశమైనా... మనసును కుదిపి రసవంతంగా సాగి పాఠకుడ్ని కట్టిపడేసే కథలను పోటీకి ఆహ్వానిస్తూ, క్రింద పొందుపరిచిన నిబంధనలను పాటించవలసిందిగా కోరుతున్నాం!

- 1200 పదాలు మించకుండా, కథను వర్డ్‌లో టైపు చేసి పంపవలెను.
- కథతో పాటుగా, కథ మీ స్వీయరచన అని, ఏ పత్రిక పరిశీలనలోను లేదని, సాంఘిక మాధ్యమాల్లో ప్రచురణ జరగలేదని.. సూచిస్తూ హామీపత్రం జత చేయాలి.
- కథలను "జన్మదిన కథల పోటీకి" అని వ్రాసి submit@kathamanjari.in కి మెయిల్ ద్వారా మాత్రమే పంపాలి.
- కథలు మాకు చేరడానికి ఆఖరు తేది 10.05.2024 రాత్రి 10.00 గంటల లోపు.
- ఈ కథల పోటీ విషయంలో కథామంజరి నిర్వాహకులదే తుది నిర్ణయం అని గమనించ ప్రార్థన!

| | | |
|---|---|---|
| ప్రథమ బహుమతి | : | ₹ 5000/- |
| ద్వితీయ బహుమతి | : | ₹ 3000/- |
| తృతీయ బహుమతి | : | ₹ 2000/- |
| 10 ప్రోత్సాహక బహుమతులు | : | ₹ 1000/- చొప్పున |

*బహుమతులు పొందిన కథలతో పాటు, కొన్ని కథలను సాధారణ ప్రచురణకు కూడా ఎంపిక చేయడం జరుగుతుంది. అలా ఎంపికైన కథలను తిప్పిపంపమనే అభ్యర్థనలు పరిగణింపబడవు.*

కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కలం పదునుబెట్టే మన తెలుగు రచయితలూ .. వాటిని ఆదరించే పాఠకులూ ఉన్నంత కాలం, తెలుగుకథ వెలుగులు పంచగలదనే నమ్మకంతో .. కథామంజరి నిర్వహించే ఈ పోటీని విజయవంతం చేయగలరని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# మా జట్టు


సంపాదకుడు
జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త
అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం
ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం
ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం
Harbinger Publishing

బొమ్మలు
కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన.. | viii |
| కథాపుస్తక పరిచయం | ix |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| ఆకాశానికి అక్షరం | శింగరాజు శ్రీనివాసరావు | 1 |
| దాంపత్యరహస్యం | వి. రాజారామ్మోహన రావు | 6 |
| హాఫ్ బౌ | ఎస్వీకె. సంహితానాయుడు | 9 |
| స్వారోచిష విలంబిత | భాగవతుల భారతి | 15 |
| జ్ఞానప్రదాత | ఎం.ఏ. పద్మనాభరావు | 21 |
| వెలుతురు దారి | శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు | 25 |
| ఆకర్షణల వలలో... | డా. మజ్జి భారతి | 32 |
| స్వగృహం | వల్లూరి విజయకుమార్ | 37 |
| గోవుమాలచ్చిమి | శీలా సుభద్రాదేవి | 42 |
| కుటుంబం | శ్రీపతి | 50 |


Cover Page Credit : Jonathan Schmer, Rehau (Ger)

అనగనగా... అనే మాట తెలుగువారికి మాత్రమే సొంతం! ఆ మాటకి పర్యాయపదాలు లేవు గాని, 'ఒకప్పుడు', 'వెనకటి కాలం' .. వంటి అర్థాలు స్ఫురిస్తాయి. పిల్లలకి కథలు చెప్పాలంటే, ఆ మాటతో మొదలెట్టాలనే నియమ నిబంధనలు లేవు గాని, 'చెప్పేది వినాలనే' ఓ అతీంద్రియ శ్రద్ధ పిల్లల్లో కలుగుతుంది. మంత్రం వేసినట్టు వచ్చి కూర్చుంటారు. గడిచిన రెండు, మూడు తరాల వారిని గమనిస్తే... ఇతిహాసాలు, చారిత్రాత్మక విషయాలు, సాంఘిక విషయాలు, ఆచార వ్యవహారాలు... మొదలైన వాటి మీద పరిజ్ఞానాన్ని, చిన్నప్పుడు కథలు వినో, చదివో తెలుసుకున్నవే. పిల్లల కథల కోసం ప్రత్యేకంగా పత్రికలు ఆ కోవలోనే రంగంలో అడుగు పెట్టాయి! నిజానికి పిల్లల కథల పుస్తకాలు పెద్దల్ని కూడా ఆకర్షించాయి. హరికథల నుంచి, ఉపన్యాసాల వరకు... మధ్య మధ్యలో పిట్ట కథలు లేకపోతే రక్తి కట్టవు. అలాగే.. చదువు, నడవడిక, బంధాలు, మంచి, చెడు.. అన్నిటికీ పిల్లల కథలే పునాదులు! నేటి విద్యావ్యవస్థలోనూ, సాంకేతిక పరిజ్ఞానంలోనూ మార్పులు వచ్చిన తర్వాత, ఆ కథలను దృశ్య రూపంలో వస్తున్నాయి గాని.. పిల్లల్లో సృజనాత్మకతను అవి కలిగించడం లేదు. అంతే కాదు ఇతరత్రా సమస్యలు తలెత్తుతున్నాయి! అయినా సరే. మారిన పరిస్థితులలో కూడా బాలసాహిత్యం మీద కృషి చేస్తున్నవారు ఉన్నారు. కథలు వ్రాస్తూ, పిల్లలలో చైతన్యం కలుగజేస్తున్నారు. లాభనష్టాలతో నిమిత్తం లేకుండా, తెలుగులో పిల్లల కథల పుస్తకాలు ఒకటో రెండో వస్తున్నాయి.

ఈ నేపథ్యంలో కథామంజరి కూడా బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాలని ఆశిస్తూ.. త్వరలో ప్రతి కథామంజరి సంచికలోనూ ఓ రెండు పిల్లల కథలు కూడా ప్రచురించాలనే నిర్ణయం తీసుకున్నాం!! పెద్దవారు పిల్లల కథలు వ్రాసి పంపవచ్చు.. అయితే పిల్లలే వ్రాయగలిగేట్టు ఇంట్లో పెద్దలు వారిని ప్రోత్సహిస్తే, తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయి. ఈ రోజు పిల్లలచేత కథలు వ్రాయించగలిగితే, రేపటి తరానికి మంచి రచయితలను అందించే అవకాశం రావడమే కాకుండా, నిర్జీవంగా ఉన్న వారి సృజనాత్మకతను వెలికితీసి, వెలుగులోకి రావడానికి ఉపకరిస్తుంది.

వర్తమాన కాలంలో... పెద్దలు దగ్గరుండి పిల్లలకి చదువులతో పాటు సంగీతం నేర్పిస్తున్నారు, ఆటలు నేర్పిస్తున్నారు. పోటీ ప్రపంచంలో నిలబెట్టడానికి ఖర్చులకు వెనుకాడకుండా, వారిని నిష్ణాతులుగా చేయడానికి అవసరమయ్యే అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే సాహితీ రంగంలో కూడా పిల్లలను ప్రోత్సహిస్తే, మేధాసంపత్తితో రేపటితరం మంచి పౌరులు ఉద్భవిస్తారు. ఆ ఆలోచనతోనే చేస్తున్న, ఈ మా ప్రయత్నాలలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు, పెద్దలు, కథకులు.. ఇలా అందరిని సహకరించవలసిందిగా కోరుతున్నాం! అందరం చేయవలసింది ఒక్కటే.. పిల్లలను ప్రోత్సహించడమే!

ఈ 'బాలకథ' వివరాలు చివరి పేజీలో పొందుపరుస్తూ... స్వస్తి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీమతి శీలా సుభద్రా దేవి**

ఏ వృత్తిలో ఉన్నవారైనా కథకులయితే.. వారికి కొన్ని కథావస్తువులు ఆ వృత్తిలో ఎదురవుతాయి. వృత్తిపరమైన నడతలో రకరకాల సంఘటనలు, సమస్యలు, అనుభవాలు, అనుభూతులు కనబడినప్పుడు వారిలో రచయిత కలం కదులుతుంది. అయితే.. ఇంకొంచెం ఎక్కువ మోతాదులో ఈ అవకాశం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారికి ఉంటుంది. ఈరోజుల్లో ఈ సంగతి ఎలా వున్నా, రెండు తరాల వెనుక రచనలు చేసేవారిలో ఎక్కువమంది ఉపాధ్యాయ వృత్తిలో ఉండేవారే తారసపడేవారు. భాష మీద, రచనా విధానాల మీద, సాహిత్య విషయాల మీద పూర్తి అవగాహన, పట్టు ఉండేవి. అలా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, శ్రీపాద, చలం, కొడవటిగంటి.. మొదలైన వారి రచనలు చదివి కలం పట్టుకున్న మొన్నటి తరం రచయిత్రి శ్రీమతి శీలా సుభద్రాదేవి గారు. ఈ పేరు వినగానే గుర్తుకు వచ్చేది కీ.శే. శీలా వీర్రాజు గారు. సుభద్రాదేవి గారి భర్త! భార్యాభర్తలిద్దరూ పేరు పొందిన కవులు, రచయితలు, చిత్రకారులు! వీరిద్దరే కాదు.. సుభద్రాదేవిగారి సోదరి సరళాదేవిగారు మంచి కవయిత్రి, సోదరులు కొడవటిగంటి లీలామోహనరావు, కాశీపతిరావు గార్లు కూడా ప్రఖ్యాత కథకులు! అలా పుట్టినిల్లు, మెట్టినిల్లు.. సాహిత్య కళాసౌధాలే!

1949 లో విజయనగరంలో జన్మించిన సుభద్రాదేవి గారు.. చిన్నతనంలోనే తండ్రి మరణం.. తీవ్ర ఆర్థిక సంక్షోభాల మధ్య బ్రతుకు పోరాటం ప్రారంభించారు. చదువు సాగేదికాదు. ఎన్నో ఇబ్బందుల మధ్య విజయనగరంలో చదువు సాగించి, బి.యస్సి. అవగానే, శ్రీ వీర్రాజు గార్ని వివాహం చేసుకున్నారు. తర్వాత హైదరాబాదులో అడుగుపెట్టి, ఇంకా ఉన్నత చదువులు చదవాలనే కోరికతో ఎమ్మే(తెలుగు), ఎమ్మెస్సీ (గణితం), బి.యిడి. చదివి, ఆర్టీసీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరి, ప్రధానోపాధ్యాయినిగా పదవీ విరమణ చేసి, అక్కడే స్థిరపడ్డారు.

సునిశితంగా తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తూ, ఓ సామాజిక స్పృహతో కవిత్వ రచనతో సాహిత్యరంగంలో 1970 లో అడుగుపెట్టిన సుభద్రాదేవిగారు, నేటి వరకు అదే నిబద్ధతతో తనదైన బాణీలో, రాజీపడకుండా రచనలు చేస్తున్నారు.. సామాజిక సాహిత్య నేపథ్యంలో వ్యాసాలు, కవితలు, కథలు.. ఇలా ఏది వ్రాసినా, అవి పాఠకుడ్ని ఆలోచింపచేసి, కొంత కాలమైనా వారిని వెంటాడేవి! పదకొండు కవితా సంపుటాలు, నాలుగు కథాసంపుటాలు వెలువరించిన సుభద్రాదేవి గారి

కవితలలో.. ఆకలి నృత్యం, మోళీ, తెగిన పేగు, ఏకాంతసమూహాలు, బతుకుబాటలో అస్తిత్వరాగం, ఆవిష్కారం, ఒప్పులకుప్ప... వంటివి చాలా ప్రజాదరణ పొందాయి. స్పష్టమైన రాజకీయ దృక్పథం, బడుగు బలహీనవర్గాల పట్ల సానుభూతితో రచనలు చేసే సుభద్రాదేవి గారి.. కంచె, జాలి ఖరీదు, పచ్చని గడ్డిలో పల్లేరుకాయ, మళ్ళీ చిగిర్చిన బాల్యం, రంగుల వల, రెక్కల చూపు, ఈ దారి ముందుకు.. కథలు కూడా ఎంతో ప్రాచుర్యం పొందాయి. వీరి సంపాదకత్వంలో కవితలు, కథలు కూడా సంకలనాలుగా వెలువడ్డాయి. విశ్వవిద్యాలయాలు, సాంస్కృతికసంస్థల నుంచి ఎన్నో పురస్కారాలు అందుకున్న సుభద్రాదేవిగారి రచనల మీద నాలుగు యూనివర్సిటీల నుంచి పి.హెచ్.డిలు, ఎం.ఫిల్. పరిశోధనలు జరిగాయి.

"కథ అన్నది.. ఆ అంశం వలన సమాజం మారినా, మారకపోయినా సరే, ఆ అంశం పట్ల అవగాహన కల్పించగలగాలి. ఎప్పుడైనా అటువంటి దృశ్యమో, సంఘటనో ఎదురైనప్పుడు.. ఆ కథ గుర్తుకు రావాలి! అలా కొంతమందినైనా ఆలోచింప చేయగలిగేదే మంచి రచన అవుతుంది".. అని రచనల మీద అభిప్రాయం చెప్పే సుభద్రాదేవిగారు, "బాధలు, కన్నీళ్ళు, సమస్యలు కథల్లో ఉంటేనే మంచి కథ అనేది అపోహ! నిత్యం ఎన్నో సమస్యలు.. అంటే ప్రేమ, పెళ్ళి, కుటుంబం, జీవితంలో ఎదురయే ఏ విషయమైనా సరే, కథాంశాలుగా తీసుకుని కథలు వ్రాయాలి. ఆ విషయం పాఠకుడ్ని మంచిమార్గంలో పయనించేలా ఆలోచింపచేయాలి. పక్కదారి పట్టించకూడదు!" అంటూ సూటిగా తన అభిప్రాయం చెప్తారు.

అమెరికాలో జంట టవర్లు కూలిపోయిన అనంతరం జరిగిన అమెరికా, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధ నేపథ్యంలో "యుద్ధం ఒక గుండె కోత" అనే దీర్ఘకావ్యాన్ని సుభద్రాదేవిగారు వ్రాసారు. కవయిత్రులలో దీర్ఘకావ్యం వ్రాసిన మొట్టమొదటి కవయిత్రి సుభద్రాదేవి గారే. యుద్ధం.. సంక్షోభం, విపత్కర పరిస్థితులను సృష్టించడమే కాకుండా, స్త్రీలను తల్లులను ఎంత క్షోభకు గురిచేస్తాయో.. వ్రాసిన ఆ కావ్యం హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువదింపబడింది. కృష్ణశాస్త్రి పురస్కారం కూడా ఆ కావ్యానికి లభించింది.

సమకాలీన సమాజంలో ఉన్న కొన్ని రుగ్మతలు సాహిత్యరంగంలో కూడా చోటుచేసుకుని, కలత కలిగిస్తున్నాయని, ఆందోళన వ్యక్తపరిచే సుభద్రాదేవిగారు, ఈ సంచిక విశిష్టఅతిథిగా విచ్చేసినందులకు మా కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, సమాజాన్ని జాగృతపరిచే మరిన్ని రచనలతో తెలుగు సాహితీజగతిలో నిండు నూరేళ్ళు అలరించగలరని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**శ్రీ శ్రీపతి**

1969 లో హైదరాబాదు పాతబస్తీలో, ఓ పాఠశాలలో ఆంగ్లభాషా ఉపాధ్యాయుడుగా చేరినాయన, మొదటిరోజు తరగతి గదిలోకి వస్తూనే, శ్రీశ్రీ గారి మహాప్రస్థానంలోని ఓ కవిత చదివి వినిపించారు. ఆ రోజు దినపత్రికలో హెడ్‌లైన్స్ చదివారు. ఆ తర్వాతే పాఠం చెప్పారు. ఆ రోజు నుంచి, పాఠ్యపుస్తకాలతో పాటు, మాక్సిం గోర్కీ వ్రాసిన 'అమ్మ' నవల నుంచి, శ్రీశ్రీ గారి మహాప్రస్థానం వరకూ అనేక పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చి చదివించేవారు. అలా.. విద్యార్థులను చైతన్యపరచి, వారి ఆలోచనాసరళిని మార్చగలిగే ఉపాధ్యాయుడు రచనలు చేస్తే అవి ఎలా వుంటాయో వేరేగా చెప్పనవసరం లేదు. అప్పటికే మారుతున్న కాలమాన పరిస్థితులలో.. ఒకవైపు ఆధునీకత మానవ సంబంధాలను, ఆలోచనలను మార్చేస్తుంటే.. మరోవైపు మూఢవిశ్వాసాలు, కులం మతం కట్టుబాట్లు అంటూ ఇంకా మారని సమాజ పరిస్థితులను చూస్తూ ఊరుకోలేక, అక్షరంతో ఆ పరిస్థితులను ఎదుర్కోడానికి అడుగులు ముందుకు వేసిన యోధులలో ప్రముఖంగా చెప్పుకోవలసిన ఆ ఉపాధ్యాయుడే, ప్రముఖ కథా రచయిత, విప్లవ రచయిత శ్రీ శ్రీపతిగారు!

ప్రతి మనిషిలోనూ ఉండే మనిషితనాన్ని ప్రేమించే శ్రీపతిగారు, సహజసిద్ధమైన వాడుకభాషలో రచనలు చేసారు. విశిష్టమైన రచనాశైలి, కథను అందంగా శిల్పంలా చెక్కగలిగే నైపుణ్యత, గాఢమైన భావుకత, అనుభూతి చెందుతూ వ్రాసే కథనం.. ఆ కథని చదివే ఏ పాఠకుడినైనా కట్టిపడేస్తుంది. ఆయన కథలన్నీ నిదానంగా వ్రాసినట్లు ఉంటాయి కాని, కథల్లో వేగం ఉంటుంది, కథతో పాటు మనల్ని తీసుకుపోయే శైలి ఉంటుంది, ప్రతీ పదం ఎంచుకుని పొదిగినట్టు ఉంటుంది! కథారచనలోకి అడుగుపెట్టేవారికి.. శ్రీపతి గారి కథలు చదివితే మెలకువలు తెలుస్తాయి.

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో భైరిపురంలో జన్మించిన శ్రీపతిగారు, అరవైలలో శ్రీకాకుళం జిల్లాలో సాయుధపోరాటం ఆరంభం అయిన రోజుల్లో, ఆ ఉద్యమానికి స్పందించిన మొదటితరం రచయితలలో ఒకరు! అప్పటి నక్సలైటు నాయకులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగుండి, నలుమూలలా ఆ పోరాట సందేశాన్ని ప్రచారంలోకి తీసుకెళ్ళారు. శ్రీపతి గారి రచనలలో ఆ భావజాలం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. 1970లో విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ ప్రకటన మీద సంతకం చేసినవారిలో శ్రీపతి గారు ఒకరు! విరసానికి రాజకీయ దృక్పథాన్ని, స్వభావాన్ని అందించడంలో ఆయన

కృషి చాలా విలువైనది. కారా మాష్టారు, రావిశాస్త్రి.. వంటి మేటి రచయితల సాహచర్యంతో కథలు వ్రాస్తూ, విప్లవ కథకు ఉండవలసిన దృక్పథం, శైలి, శిల్పం వంటి విషయాలను సమకూర్చే ప్రయత్నాలు చేసారు. ఆయన కథల్లో శ్రీకాకుళ నేపథ్యం, పోరాట ప్రభావం.. కొంత కనబడినా, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబ జీవితాలు కనబడతాయి. ఆ రోజుల్లో ఎక్స్‌రే పేరుతో కథలు వ్రాసి, దరిమిలా శ్రీపతిగా పేరు మార్చుకున్నారు. ఆయన అసలు పేరు పుల్లట్ల చలపతిరావు. ఆయన కలం పట్టిన తొలిరోజుల్లో వ్రాసిన "నర్తోడు" కథ ఆ రోజుల్లో చాలా ప్రాచుర్యం పొందడమే కాకుండా, విరసం ఏర్పాటుకు భూమికగా నిలిచిందని అంటారు. పదహారేళ్ళ ప్రాయంలో "సహృదయ" అనే కథతో రచనారంగేట్రం చేసిన శ్రీపతిగారు అరవై పైచిలుకు కథలు వ్రాసారు. హద్దులు, రోజూ ఉదయిస్తాడు సూర్యుడు, వరమీయని వేలువు, శత్రువు, సమాధిలోంచి లేచిన జ్ఞానం, సరిహద్దులు, మంచు పల్లకి, నెమళ్ళ అడవి, తీర్పు చెప్పిన రోజు, డాలర్ల కథ, చెట్టు కూలుతున్న దృశ్యం... వంటి కథలు పాఠకుల మదిలో ఎప్పటికీ పదిలంగా ఉండిపోతాయి! ఐదు కథాసంపుటాలు ఆయనవి విడుదలయ్యాయి!

తన ప్రాంత మాండలికంతో పాటు ఆ ప్రాంతంలో కనబడే సముద్రం, అడవులు, తోటలు, పల్లెలు, స్వార్థం, కుతంత్రాలూ, విశ్వాసాలు, కలలు, కన్నీళ్ళు.. ఇవన్నీ కనబడేలా కథలు వ్రాసిన శ్రీపతిగారు, ఉపాధ్యాయుడుగా కొద్దికాలం పనిచేసి, తర్వాత ఆకాశవాణి, ఢిల్లీలో న్యూస్‌రీడర్‌గా పని చేసారు. దరిమిలా హైదరాబాదు వచ్చి, అక్కడే స్థిరపడ్డారు. ఎనభై సంవత్సరాలు నింపుకున్న శ్రీపతిగారు, ఈ మధ్యకాలంలోనే.. అంటే 08.02.2024 తేదిన మరణించారు. ఆరు దశాబ్దాలుగా తెలుగు సాహితీ ఉద్యమానికి ఎనలేని కృషి చేసిన శ్రీపతిగారి మరణం తెలుగువారికి తీరని లోటని భావిస్తూ, వారికి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

## శ్రీశ్రీ గారి కథ : చావూ పుట్టుకా

శ్రీశ్రీ అనగానే మనకు గుర్తుకొచ్చేవి మహాప్రస్థానం, ఖడ్గసృష్టి లాంటి కావ్యాలే గాని, ఆయన రాసిన కథల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఆయన రాసిన 35 కథలు, 27 అనువాద కథలూ కలిపి 'కథలు, అనువాద కథలు' అన్న పేరు మీద చలసాని ప్రసాద్ కూర్పులో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు 2008లోనూ, 2011లోనూ (రెండవ ముద్రణ) ప్రచురించారు. శ్రీశ్రీ రాసిన తొలి కథ 1926, మరి చివరి కథ 1978లోనూ వచ్చాయి. వ్యధలతో నిండిన ఈ కథలను చదివితే 'అవి కథలేనా?' అన్న అనుమానం రావచ్చు. అందుకే వీటిని వ్యాసకథ లేక కథావ్యాసం అని పిలవవచ్చునంటారు చలసాని ప్రసాద్ గారు పుస్తకానికి ముందుమాట రాస్తూ. మహాప్రస్థానం లాంటి గీతాలను గురించి శ్రీశ్రీ తన మాటలలో,

"ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను 'సామాజిక వాస్తవికత' అంటారనీ, దీని వెనుక దన్నుగా మార్క్సిజం అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే, మహాప్రస్థాన గీతాలలోని మార్క్సిస్టు స్ఫూర్తి, సామాజిక స్పృహా యాదృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తోంది."

ప్రస్తుతానికి నేనెన్నుకున్న కథ 'చావూ పుట్టుకా'. శ్రీశ్రీ రాసిన ఈ కథ నిడివి ఒక పేజీ (గట్టిగా చూస్తే బహుశా అర పేజీయే!) మాత్రమే. అందుకే కథను టూకీగా చెప్పవలసిన అవసరం లేదుగా! పాఠకుల సౌకర్యార్థం, ఈ క్రింద చదవవచ్చు.

అదో వూరు. ఆ వూళ్ళో ఒక ఆసుపత్రి.

ఇదో వూరు. ఈ వూళ్ళో ఒక పోలీసు స్టేషన్.

ఆ వూళ్ళో, ఈ వూళ్ళో ఆంధ్రదేశం అంతటా అది అర్ధరాత్రి!

ఆసుపత్రికి నొప్పులు పడుతున్న ఒక గర్భవతిని తీసుకువచ్చారు. ఆమె వయస్సు నలభై.

పోలీసు స్టేషన్‌కు బేడీలు వేసిన ఒక కుర్రవాణ్ని తీసుకువచ్చారు. అతని వయసు ఇరవై.

గర్భిణి బాధపడుతోంది. ఏడుస్తోంది.

కుర్రాడు బాధపడుతున్నాడు. కాని, నవ్వుతున్నాడు.

ఆసుపత్రిలో వైద్యులు ఆశాజనకంగా మాట్లాడుతున్నారు.

స్టేషన్లో పోలీసులు కారుకూతలు కూస్తున్నారు.

"నీకేం భయం లేదమ్మా! కేసు కొంచెం కఠినమైనదే, కాని ప్రమాదం ఏమీ లేదు."

"లంజకొడకా! మావో పుస్తకాలు చదువుతావూ? లోకాన్ని మరామత్తు చేస్తావూ? ముందు నిన్ను హజామత్తు చేస్తాం జాగ్రత్త!"

వైద్యులు శస్త్రచికిత్సకు ఉపక్రమించారు.

పోలీసులు కత్తులూ, కటార్లూ నూరుతున్నారు.

రెండుచోట్లా హింసా ప్రయోగమే జరిగింది.

కాని సూర్యోదయంలో

అక్కడ ఆసుపత్రిలో ఒక జననం!

ఇక్కడ తెల్లవారగానే

పోలీసు స్టేషన్లో ఒక మరణం!

ఇదే కథ.

ఒక ఊళ్లో ఆస్పత్రిలో జననం, అదే రోజు ఒక పోలీస్ స్టేషన్‌లో మరణం. ఒకటి ఆశాజనకం. రెండోది పోలీసు జులుం.

ఇది 'అరుణతార' త్రైమాసిక పత్రిక, అక్టోబరు 1978 – జనవరి 1979 లో ప్రచురింపబడింది.

కథ ఎప్పుడు రాసిందో తెలీదు. కాని శ్రీశ్రీ తను చెప్పిన మార్క్సిస్టు స్ఫూర్తి, సామాజిక స్పృహతోనే రాసిన కథ ఇది. రచయితకి, రచయిత కలం నుండి వచ్చిన ఈ కథకి పరిచయాలూ, వివరణలూ అక్కరలేదు.

*పరిచయకర్త : శాయి రాచకొండ*

బహుశా నా 74 యేళ్ల వయసులో, మంచి రచనలను, రచయితను ప్రోత్సహిస్తున్న మీ పత్రిక తీరు... ఇతరులకు ఆదర్శనీయం. అలాగే శ్రవణ సంచికలో పప్పు భోగారావు గారూ, వెంపటి వారూ.. వారి శైలి అనన్యం అనిపిస్తున్నారు. నాకు అనిపించింది... ఏమిటంటే... ఇదొక తపస్సు! మీరు నామకః కాకుండా... మనసా వాచా ఈ పత్రికని కని, పెంచి, పోషిస్తున్నారు. సంపాదకవర్గానికి, పత్రిక శ్రేయోభిలాషులకు మరొక్కసారి అభినందనలు

మాలాంటి వాళ్ళకి పాతరోజులు జ్ఞాపకం వస్తున్నాయి.

యీ పత్రిక "పుస్తకం హస్తభూషణం" యెప్పుడవుతుందో!

**వల్లూరి విజయకుమార్, హైదరాబాద్**




## మరో మాయాబజార్

రాధిక మంగిపూడిగారి 24 కథలతో సెప్టెంబర్ 2022 లో విడుదలైన ఈ కథాసంపుటిలో చాలా కథలు హాస్యభరితమైనవే! కొద్దిగా సెంటిమెంట్ కథలు, సీరియస్ కథలు కూడా ఉన్న ఈ కథల సంపుటి వెల రూ.150/-.

ప్రతులకు


- జె. వి. పబ్లికేషన్స్ ఫోన్ :8096310140
- నవోదయా బుక్ హౌస్,
  ఆర్య సమాజ్ మందిరం ఎదురుగా, బడే చౌడి,
  హైదరాబాద్
- వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా,
  (హైదరాబాద్) ఫోన్ 9849023852
- ఇ-బుక్ www.kinige.com


## విశాలాక్షి కథానికలు

మధ్యతరగతి కుటుంబాల చుట్టూ నడిచే ఎన్నో సంఘటనలను చక్కటి కథనంతో 27 కథలుగా శ్రీమతి దామరాజు విశాలాక్షి అందించిన ఈ కథల సంపుటి వెల రూ.200/-.

ప్రతులకు

శ్రీమతి దామరాజు విశాలాక్షి,
c/o ఎమ్. కిరణ్ కుమార్,
ఫ్లాట్ నెం. 402, అభిలాష,
రోడ్డు నెం. 2, డాక్టర్స్ కాలనీ, నల్లగండ్ల,
హైదరాబాద్ – 500019.
✆ 9010902794, 7702561119






## సాధన

ఊహాలోకం, వర్ణాలు, ఉపోద్ఘాతాలు లేకుండా, వర్తమాన సమస్యలను సూటిగా చెప్పే డా. లక్ష్మీ రాఘవ 27 కథల సమాహారం నవంబర్ 2022 లో విడుదలయింది. వెల రూ.150/-.

ప్రతులకు

- డా. లక్ష్మీ రాఘవ
  ✆ 9440124700
- జ్యోతి వల్లబోజు
  ✆ 8096310140,
- అచ్చంగా తెలుగు
  ✆ 8558899478
- నవోదయా బుక్ హౌస్
  ✆ 9000413413




## నా కథలు – నా భావాలు

సహజం వాతావరణంలో వాస్తవానికి దగ్గర విరిసిన 37 కథలన్నీ శ్రీమతి విష్ణుభట్ల సుగుణ ఏక బిగిని వ్రాసినవే.. చదవించగలిగేవే! డిసెంబర్ 2023 లో విడుదలైన ఈ సంపుటి వెల రూ.300/-.

ప్రతులకు

https://books.acchamgatelugu.com
✆ 858899478



# ఆకాశానికి అక్షరం

శింగరాజు శ్రీనివాసరావు
✆ 9052048706

***"నా మనసు అందుకు అంగీకరించడం లేదు. పవిత్రమైన అక్షరాలను, వారి కాళ్ళకింద బానిసలను చెయ్యలేను. అది నావల్ల కానిపని!" గోడకు జారిగిలబడి అన్నాడు తిరువేది.***
***"నువ్వేమన్నా పోతనామాత్యుడివి అనుకున్నావా!" చురక వేసింది తిరువేది భార్య శకుంతల.***
***"కాకపోవచ్చు. కానీ నేను సరస్వతిని నమ్ముకున్నవాడిని, అమ్ముకునేవాడిని కాదు!"***

అక్కడ పదిమంది చేతులు ఒకదానితో ఒకటి కుస్తీ పడుతున్నాయి. ఒకరిని తోసేస్తూ మరొకరు ఆధిపత్యం కోసం పోరాడుతున్నారు. బాల్యం దాటని బక్కచిక్కిన దేహాలు పిడికెడు ముద్దకోసం ఎంగిలి మెతుకుల విస్తరాకులను చించి, నేలమీద మట్టిముద్దలతో కలిసిన మెతుకులను ఆబగా తింటున్నాయి. దరిద్రాన్ని కోరుకుని ధరణికి వచ్చినవారు కారు వారు. కామం కళ్ళకు కప్పి కన్నెతనాన్ని కాటువేస్తే, ఎదిగిన పిండాన్ని ఎదకు హత్తుకునే ధైర్యంలేక, ఏ కుప్పతొట్టిలోనో పారవేసి చేతులు దులుపుకున్న పాతివ్రత్యం చేసిన పసరుపిందెలు వీళ్ళు. చేయని నేరానికి శిక్షను అనుభవిస్తున్న అభాగ్యులు వీళ్ళు. ఆ స్థితిలో వాళ్ళను చూసిన తిరువేది కళ్ళు చెమర్చాయి. వాళ్ళను దగ్గరికి పిలిచాడు. అతను వ్రాసిన కవితకు అందిన బహుమతి అయిదు వందలను చేతిలో పెట్టుకుని వాళ్ళను టీ బంకు దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆ పదిమందికి రొట్టె కొనిచ్చి, టీ ఇప్పించాడు. వాటిని ఆబగా తిన్న వాళ్ళు తిరువేది వైపు కృతజ్ఞతగా చూసి వెళ్ళిపోయారు. నిజానికి బహుమతి వచ్చిన కవిత కథాంశం 'అనాథ బాలలు'! అందుకని ఈ బహుమతికి అర్హులు వాళ్ళే కదా అనుకున్నాడు.

ఇప్పుడు అతని చేతిలో మిగిలిన వంద రూపాయలను తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

★★★

"ఒరేయ్ సూరిగా... ఈసారి కూడ ఎన్నికలలో మనమే గెలవాల. ప్రతిపక్షం అనే మాట ఇనపడకుండా పోవాల. పోయినసారి రెండంకెల సీట్లు వచ్చిన ఆ పార్టీకి ఈసారి పదిలోపే సీట్లు రావాలి. ఏంచేస్తావో... ఎట్టా చేస్తావో... నువ్వే పథకం వెయ్యాల. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా అనేది కనపడకుండా పోవాల. ఇది మన నాయకుడి అంతరంగం. మనకు అప్పగించిన బాధ్యత. అదే పట్టుమీద ఉండు!" చెప్పాడు హోంమంత్రి శంభునాథుడు.

"మరీ అత్యాశ బావా నీది. అది అయ్యేపనేనా! అధికారంలో ఉన్న పార్టీ మీద ప్రజలకు వ్యతిరేకత ఉంటుంది. అందుకని మనం ఎంత ప్రయత్నించినా బొటాబొటీగా గెలవగలమేమో తప్ప, నువ్వనుకున్నట్టు జరగదు బావా!" మందుగ్లాసు చేత్తో పట్టుకుని చెప్పాడు రామలింగం.

"జరుగుతాదిరా లింగా... మన నాయకుడు అంత తెలివితక్కువోడు అనుకున్నావా! ఆయన స్కెచ్‌లు ఆయనకు ఉన్నాయి. మనం చేయాల్సింది ఒకటే... ప్రతిపక్షాల మీద లేనిపోనివి కల్పించి, అబద్ధాలను నిజాలని నమ్మించేలా రాయాలి. ఆ పని చేయడానికి మనకో కవి కావాలి. కాస్త కవిత్వం కలిపి జనం మనసుకు హత్తుకునేలా రాసేటోళ్ళు కావాలి. మన పేటియమ్



బ్యాచులు రాసేవి అంత గొప్పగా ఉండట్లేదు. అందుకని ఓ మంచి కవిని పట్టు. పాటలు కూడ రాయించుకుందాం. అది విన్న ప్రతోడు కళ్ళు మూసుకుని మనకే గుద్దాల. వచ్చే కవిగారు కూటికి మొహమాచేటోడయితే మనకు మరీ మంచిది. మనం చెప్పినట్టు వింటాడు!"

"ఎందుకు బావా..గిరాకీలేని సినిమా వాళ్ళను చూసి పట్టుకుంటే పోలా!"

"కాదురా..కొత్తోడైతేనే మేలు. మనకు తగ్గట్టు రాయించుకోవచ్చు"

"మన జిల్లా రచయితల సంఘం వాళ్ళని కదిలిస్తే చెబుతారులే ఓ పదిమంది పేర్లు. వాళ్ళను పిలిచి మాట్లాడి, అందులో మనం ఒకరిని ఎంపిక చేసుకుందాం!"

"వద్దురా... ఎదవ ప్రాపగాండ అయిపోతది. ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా జరగాల. మన ఎగస్పార్టీ వాడికి తెలవకూడదు. అందుకని సంఘం ప్రెసిడెంటుతో మాట్లాడి గట్టోడ్ని ఒకడిని పట్టుకురా. వాడితో నేను మాట్లాడతా!"

"మందు ముందు పెట్టుకుని ఈ మాటలేంటి బావా...తాగింది ఎక్కేలాలేదు ఈ మాటలకి! అవన్నీ నేను చూసుకుంటాగా... ముందు మందు లాగించు బావా!" అంటూ గ్లాసు పైకెత్తాడు రామలింగం.

★★★

ఉన్నవాటిలో మంచి దుస్తులు తీసి వేసుకుని రామలింగం చెప్పిన ఇంటి అడ్రసుకు వెళ్ళాడు తిరువేది. రాజకీయమన్నా, వాళ్ళ ప్రసంగాలన్నా ఏ మాత్రం గిట్టనివాడతను. పేదరికాన్ని పారద్రోలలేని రాజకీయం మీద అతను వ్రాసిన కవితలు ప్రజల చేత మరో శ్రీశ్రీగా అతణ్ణి కీర్తించేలా చేశాయి. అలా సమాజంలోని సమస్యల మీద అప్రకటిత యుద్ధం చేస్తూనే ఉన్నాడు తిరువేది. ఇంటిముందు నిలుచుని తనకు ఫోనుచేసిన వ్యక్తికి కాల్ చేశాడు.

"హలో... రామలింగం గారేనా?"

"అవును నేనే... మీరు?"

"సర్... నేను కవి తిరువేదిని!"

"ఓహ్... మీరా... వచ్చారా?"

"వచ్చాను సర్"

"సరే... రెండవ అంతస్తుకు రండి!"

"అలాగే సర్!"

ఫోను పెట్టేసి, రెండవ అంతస్తుకు వెళ్ళాడు తిరువేది. రామలింగం అతడిని తీసుకువెళ్ళి శంభునాథుడికి పరిచయం చేశాడు. తిరువేదిని ఎందుకు పిలిచింది, అతను చేయవలసినది ఏమిటో వివరించాడు శంభునాథుడు. పది పాటలు, ఓ వెయ్యి స్లోగన్లు... అది అజెండా!

శంభునాథుడిని కలిశాక విషయం అర్థమయింది తిరువేదికి. 'వెన్నెముకను విరిచి పక్కనబెట్టి, వారికి వంగి వంగి సలాములు చెయ్యాలి'. తిరువేదికి అది కష్టంగా తోచింది. తనవల్ల కాదని తేల్చి చెప్పాలనుకున్నాడు.

ఇంటి దగ్గర భార్య చేసిన హితబోధ గుర్తుకు వచ్చింది. "అవకాశం వచ్చినపుడు వినియోగించుకునే వాడే మేధావి. మహామహా ఘనాపాఠీలే మహారాజులను పొగిడి అగ్రహారాలను బహుమానాలుగా పొంది సుఖపడ్డారు. రాజు దుర్మార్గుడైనా మన కడుపుకోసం మనం కాసింత రాజీపడితే తప్పేమీ కాదు. మడికట్టుకు కూర్చుంటే, కాలేది మన పీఠమే. భేషజాలకు పోకుండా వాళ్ళు చెప్పిన దానికి ఒప్పుకుని రండి. అక్షరాన్ని అమ్ముకుంటే తప్ప తీరని ఆకలి మనది. నిజాయితీ నిప్పుల మీద నడిచేవాడికి పెళ్ళి, పెళ్ళాం అనేవి అనవసరం!" నిష్ఠూరంగా, స్పష్టంగా చెప్పింది ఆమె.

ఇంతకాలం రాసిన రాతలకు, ఇప్పుడు చేయబోతున్న పనికి పొంతన లేదని అర్థమయింది తిరువేదికి. నాలుగు రోజుల క్రితం తను చూసిన దృశ్యం గుర్తుకు వచ్చింది. ఆకలికి తాళలేక ఎంగిలి మెతుకుల కోసం ఎగబడే ఆ పిల్లలకు, తనకు తేడా ఏమిటి? వాళ్ళమీద తను జాలి పడ్డాడు. ఇప్పుడు తనమీద జాలిపడే వాళ్ళు ఎక్కడ? అందరూ అన్నార్తులే. కానీ ఏరుకునే స్థలాలే వేరు!

"డబ్బు కోసం ఆలోచించొద్దు. నచ్చితే మా నాయకుడు నిన్ను నెత్తిన పెట్టుకుంటాడు. నీ పేరు బయటకు రాదు. నాదీ హామీ!" మధ్యలో రామలింగం సన్నాయి నొక్కుడు.

"నీ పాటలోని మాటలు ప్రజల గుండెలను కదిలించి, మాటకో ఓటు మాకు పడాలి. మాకు అధికారం వచ్చిన తరువాత తెలుగు భాషా సంఘానికి ఛైర్మను నీవే అవుతావు. ఆలోచించు!" బిస్కెటు వేశాడు శంభునాథుడు.

'ఆదర్శాలకు పోయి పేదరికపు సాలెగూడులో బ్రతకాలా! అభిమానాన్ని అమ్ముకుని అందలం ఎక్కాలా!' తిరువేది మనసులో తర్జనభర్జన. వెంటనే తేల్చుకోలేక పోయాడు.

"ఉన్నపళంగా అంగీకారాన్ని తెలియజేయలేను సర్. నాకు కొంచెం సమయం కావాలి..." దాటవేసే ప్రయత్నం చేశాడు.

"సరే... ఒత్తిడి చేయము. అది నీ ఇష్టం! ఒక్క షరతు. నువ్వు రాస్తే మా పార్టీకి మాత్రమే రాయాలి. అవతల పార్టీతో ఒడంబడిక చేసుకున్నావో, రాయడానికి చేతులు, చెప్పడానికి నోరు ఉండదు!" శంభునాథుడి గర్జన.

"నా కలం మీద ఆన... అలా చెయ్యను!" తిరువేది ప్రమాణం. బయటకు వచ్చి గాలి పీల్చుకున్నాడు.

తిన్నగా తనకు ప్రియమైన పార్కుకు చేరుకున్నాడు. చుట్టూ మూగారు అతని అభిమానులు. అంతా చేతికి, నోటికి, నుదుటి రాతకు సంకెళ్ళు వేసుకున్నవారే.

"తమ్ముడూ... ఎలచ్చన్లు వత్తున్నాయి. ఈసారి నీ మాట మీద నమ్మకమెట్టి పైసలు తీసుకోకుండా ఓటేత్తాము. ఎవురు మంచోళ్లో సెప్పు!" కాస్త తల నెరసిన దరిద్రుడి అభ్యర్థన.

ఇంతలో ఫోను మ్రోగింది. తీసి "హలో" అన్నాడు తిరువేది.

"ఎవరు కవిగారేనా?"

"అవును"

"ఆ పార్టీ దగ్గర బేరం ఎంతకు కుదిరిందో, దానికి రెట్టింపు ఇస్తాము. మా పార్టీకి పాటలు రాయి. మూడోకంటికి తెలియకుండా మేము చూసుకుంటాము. ఇక నీ జీవితాంతం మా పార్టీలో ఉండిపోవచ్చు. మమ్మల్ని గెలిపిస్తే, నీకు శాసనమండలిలో బెర్తు ఖాయం. ఆలోచించుకో. ఈసారి అధికారం మాకే రావాల. మళ్ళీ ఫోను చేస్తా. నీ నిర్ణయం చెప్పు!" విషయం చెప్పి ఫోను పెట్టేశాడతను. ప్రతిపక్షపార్టీ వ్యక్తేమో...

"ఏం అన్నా పలకవు? ఎలచ్చన్లు వత్తే ఏ జెండా మోసినా రోజుకు అయిదొందలొచ్చి, ఆ పూట గడిచిపోద్ది. రెండు పార్టీలోల్లు ఓటింగు నాడు పైసలిత్తరు. ఆ నెల గడిచిపోద్ది. అయినా అయన్నీ వద్దన్నా... నువ్వు సెప్పినావు గంద. ఓటమ్ముకోడం తప్పని! అందుకే మేము నువ్వు ఎవురికెయ్యమంటే ఆల్లకత్తాం. మా బతుకులు ఎవుడు బాగుసేత్తాడంటే ఆల్లకేత్తాం!" పాతికేళ్ళ వాడి పలుకులు.

"ఓరి ఎర్రి సచ్చినోడా... మా అయ్యల తరాల నుంచి ఓటేత్తన్నాం. ఈడికి మార్చి ఆడికి, ఆడికి మార్చి ఈడికి ఏత్తానే ఉన్నాం. 'ఎవుడైనా వచ్చి మా చిప్పలు ఇసిరేయించి, పనిముట్టు సేతికియ్యకపోతాడా అని'. ఏది... ఓటు కొడతానే ఉన్నాం, బొొచ్చె పడతానే ఉన్నాం! మీ పిచ్చిగానీ, రాజకీయమంటేనే రొచ్చుగుంట. ఆ పంది పొర్లికింతలకి మనకు గబ్బుగొడతదే తప్ప, ఆళ్ళు బయటికి రారు. సామంటే కయితలు రాసేటోడు. ఏదో సెయ్యాలనే తపన తప్ప, ఏమీ సెయ్యలేదని తెలుసుకోలేనోడు. పాపం... మనల పైకి తేవాలనుకుంటున్నడు. అది అయ్యేపని కాదని తెలిసేనాటికి, ఇదిగో ఎలచ్చన్లు అయిపోతయ్. మనకు పైసలు రాకుండాబోతయ్!" పచ్చినిజాన్ని ఇంకా పచ్చిగా చెప్పాడు ఒకతను.

అతని మాటలు తిరువేదికి బాగానే గుచ్చుకున్నాయి. అతని మాటలలో వాస్తవాలు ఉన్నాయి. ఎవరైనా స్వార్థపరులే కానీ, పేదలను పైకెత్తేవారే లేరు. రెండు పెద్ద పార్టీల తత్వమేమిటో తన స్వానుభవం తెలిపింది. తరతరాలుగా వస్తున్న ఆనవాయితీని పక్కన పెట్టి మంచివారిని ఎన్నుకోమని చెప్పడానికి, అసలు మంచిపార్టీ ఏది? అదొక మిలియన్ డాలర్ల ప్రశ్న! నెలకొకసారి జరిగే మీటింగులకు జెండాలు మోసి వారు సంపాదించుకునే డబ్బును, ఎలక్షను సమయంలో వారికి ఉద్దరగా వచ్చే సంపాదనను, తన పిచ్చి ఆదర్శాలతో వాళ్ళకు దక్కకుండా చేయడం మంచిదేనా? తన ఆశయాన్ని తనే మోసుకు పోగలడో, లేదో తెలియని సందిగ్ధత.

తిరువేది ఆలోచన మారింది. పంజరంలో చిలకలను వదిలేశాడు. అందరి ముఖాలలో ఆనందం. మందు, డబ్బు... అవే వారి కళ్ళముందు. అవి ఏరుకోవడంలో వారి సంతోషమే వేరు అనిపించింది తిరువేదికి. అందరూ ఎలక్షన్లలో వచ్చే డబ్బును, తాగే మందును లెక్కలు వేసుకుంటూ వెళ్ళిపోయారు. పేలవంగా నవ్వుకున్నాడు తిరువేది.

★★★

"నా మనసు అందుకు అంగీకరించడం లేదు. పవిత్రమైన అక్షరాలను, వారి కాళ్ళకింద బానిసలను చెయ్యలేను. అది నావల్ల కానిపని!" గోడకు జారిగిలబడి అన్నాడు తిరువేది.

"నువ్వేమన్నా పోతనామాత్యుడివి అనుకున్నావా!" చురక వేసింది తిరువేది భార్య శకుంతల.

"కాకపోవచ్చు. కానీ నేను సరస్వతిని నమ్ముకున్నవాడిని, అమ్ముకునేవాడిని కాదు!"

"నీ తిరిపెంతో నేను బ్రతకలేను!"

"నన్నేం చెయ్యమంటావు. అది తప్ప నాకు వేరే ఏపనీ చేతకాదు!"

"అందుకే ఆ తెలివిని అమ్మకానికి పెట్టమంటాను. ఉద్యోగి తన తెలివితేటలను పణంగా పెట్టి డబ్బు సంపాదిస్తాడు. కార్మికుడు శ్రమను పెట్టుబడిగా పెట్టి కూలీ సంపాదిస్తాడు. అలాంటప్పుడు మీరు పార్టీలకు పాటలు వ్రాస్తే తప్పేమిటి?" లాజిక్ లాగింది శకుంతల.

మరో మాటకు ఆస్కారం లేకుండా పోయింది తిరువేదికి. ఆదర్శాల శృంఖలాలను ఛేదించి పోవడమే మేలనుకున్నాడు. తెగించిన తరువాత ఇంకా బంధనాలెందుకు? దొంగతనానికి తెగబడ్డాక, ఒక ఇల్లయితేనేం, పది ఇళ్ళయితేనేం... మనసు చంపుకుని శరీరాన్ని అమ్ముకున్నాక, విటులు ఎంతమందయితేనేం... ఫోను అందుకున్నాడు.

"హలో... రామలింగం గారా... నేను తిరువేదిని. మీపార్టీకి పాటలు, స్లోగన్లు వ్రాస్తాను. అయితే మీతో పాటు ఏ పార్టీ అడిగినా వ్రాస్తాను. అందుకు మీకు అంగీకారమైతేనే వ్రాస్తాను!" గట్టిగానే చెప్పాడు తిరువేది.

"మీరెక్కడున్నారు? నేను వచ్చి మీతో మాట్లాడుతాను!" అడిగాడు రామలింగం.

"గాంధీపార్కు దగ్గర" అని ఫోను పెట్టేశాడు. అంతకుముందు ప్రతిపక్షపార్టీ వారి వద్ద నుంచి వచ్చిన ఫోను నెంబరుకు ఫోను చేసి అదేవిధంగా చెప్పి, తన వద్దకు నేరుగా వచ్చి మాట్లాడమన్నాడు.

★★★

లోకానికి తెల్లవారింది. కానీ తిరువేదికి మాత్రం తెల్లవారలేదు. వ్రతం చెడ్డా, ఫలం దక్కాలనుకున్నాడు. అవకాశాన్ని వినియోగించుకుని, రెండు పార్టీలను తులనాత్మకత చేయాలనుకున్నాడు. జెండా పట్టుకు తిరిగేవాడికి రాని అభ్యంతరం, తనకు మాత్రం ఎందుకు వస్తుందని భ్రమించాడు తిరువేది. కానీ కలానికి ఉన్న బలం తెలిసిన పార్టీలు మాత్రం అందుకు అంగీకరించలేదు. రెండు పార్టీలు ఎదురుపడ్డాయి. తాము కోరుకున్నది పక్కవాడికి దక్కకూడదనుకున్నాయి. వివాదానికి కేంద్రబిందువు మీదికి కత్తులు రెండూ ఒకేసారి దాడిచేశాయి. 'దుర్మార్గులతో చెలిమి, దుఃఖాల కొలిమి' అని తెలుసుకునేలోపు బేరమాడిన ప్రాణం పంచభూతాలలో కలిసిపోయింది. అప్పటిదాక నూరుకున్న కత్తులు, చేతులు కలిపాయి. శవం రోడ్డు మీదకు చేరింది. పది నిముషాలలో ఒక వ్యాను శవాన్ని తొక్కుకుంటూ వెళ్ళింది.

రేపటి పత్రికలకు ఈ శవమే ఆహారం... పతాక శీర్షిక "ఆకాశానికి అక్షరం"...

# దాంపత్య రహస్యం

**వి. రాజారామ్మోహన రావు**
✆ 9394738805

*భార్యాభర్తలంటే కేవలం కోరికలు, సరసాలు, సరదాలే కాదు... కలిసికట్టుగా సమస్యల్ని ఎదుర్కోవాలి!*
*నాలో అపరిమితమైన కోరికతో పాటు, అంతకుమించిన ఎంతో ఓర్పు ఉంది. ఒక్క ఏడాదే కాదు, అవసరమైతే ఎన్నాళ్ళేనా, ఎప్పుడైనా పూర్తి బ్రహ్మచారిగా ఉండగలను.. ఉంటాను!*
*ఆ విషయంలో నీ బెంగలన్నీ తుడిచెయ్యి. మనిద్దరం ఒకరికి మరొకరు అంతే. మన మధ్యలో ఏ విశిష్టలూ వద్దు. ఎంతమాత్రము అవసరం లేదు!*

రవిచంద్రకి ముప్పై రెండేళ్ళు. కావ్యకి ముప్పై ఏళ్లు. ప్రతి శని, ఆదివారాలు వాళ్లకి ఓ హనీమూన్‌లా ఉంది. మంచి యవ్వన ప్రాయం. ఇద్దరికీ కోరికలు ఎక్కువే. వాటిని తీర్చుకునే కొద్దీ... బావిలో ఊటలా ఇంకా, ఇంకా పుడుతూనే ఉన్నాయి

ఇద్దరిదీ ఒకటే ఆఫీసు. మంచి ఉద్యోగాలు. కొన్నాళ్లు ఇద్దరూ చనువుగా గడిపారు. ఆకర్షణ ఏర్పడింది. ఒకరి అభిరుచులు మరొకరికి నచ్చాయి. ఇద్దరికీ ప్రేమ కలిగింది. మనసులు విప్పి మాట్లాడుకున్నారు. ఏ రహస్యాలు లేకుండా వీలున్నంత ఫ్రీగా ఒక్కళ్ళతో మరొక్కళ్ళు చెప్పుకున్నారు. తమ పెద్దలకి చెప్పారు. వాళ్లు ఇష్టపడ్డారు. ఆరు నెలల్లో పెళ్లి నిశ్చయమైంది.

కానీ ఈ లోపు కావ్యకి ఓ సమస్య ఎదురైంది. అది విశిష్ట!

విశిష్ట రవిచంద్ర వాళ్ళ టీమ్ లీడర్. రవి కన్నా రెండేళ్లు పెద్ద! కావ్యకీ స్నేహితురాలు. కావ్య ముందే రవిచంద్ర గురించి చాలా మోటుగా మాట్లాడేది. చాలా తెగింపు, చొరవ విశిష్టకి.

రవిచంద్ర జాంపండులా ఉంటాడని, కొరుక్కు తినేయాలని బుల్ లాంటివాడని, అలాంటి మగాడు దొరికిన ఆడది లక్కీ అని... అలా ఎన్నెన్నో మాటలు! పైపెచ్చు 'రవీ' అని ఏకవచనంలో పిలిచేది.

విశిష్టకి రవంటే పిచ్చి అని కావ్యకి తెలుసు! రవి 'ఊ' అనాలే కానీ, విశిష్ట దేనికేనా రడీ! ఇంక, వీళ్ల పెళ్ళి నిశ్చయమయ్యాక మనసుని పీడిస్తున్న ఆ శంకని దూరం చేసుకోవాలనుకుంది కావ్య. దానికి సరియైన మార్గం విశిష్టతో సూటిగా మాట్లాడడమే. అందుకే ఓ రోజు విశిష్టని విడిగా కలిసింది. కలిసి తమ పెళ్లి నిశ్చయమైన సంగతి చెప్పింది. చెప్పి...

"నీకు రవీంద్ర అంటే పిచ్చి ఇష్టమని నాకు తెలుసు. నీకు గానీ, తనకు గాని ఉద్దేశం, ఇష్టం ఉంటే పెళ్లి చేసుకోండి. ఇప్పటికీ మించి పోలేదు. నేను తప్పుకుంటాను!" అంది.

అది విని విశిష్ట నవ్వింది. "భలే దానివే. నేను పెళ్లి గిళ్ళీ టైపు కాదు. ఎంజాయింగ్ టైపు. రవిని గోకుదామని చూసా. చెయ్యేస్తే చాలు పారిపోయాడు. ఘోటక బ్రహ్మచారి. అందుకని అన్ని బెంగలు వదిలేసి హాయిగా పెళ్లి చేసుకో!" అంది.

ఆ శంక కూడా తీరిపోవడంతో కావ్య హాయిగా పెళ్లి చేసుకుంది. తొలిరాత్రే ఇద్దరికీ తొలి అనుభవం అని తెలిసొచ్చిన అదనపు సంతోషం.

తేటగా ఉన్న మనసులు, ఉరకలు వేస్తున్న వయస్సు, ఏ సమస్యలు లేని జీవితం... ఇష్టారాజ్యంగా ఉంది వాళ్ళిద్దరికీ. పరగడుపని, మిట్ట మధ్యాహ్నం, అర్ధరాత్రి అని లేదు... తనివి తీరని శృంగారం!

రవిచంద్రని విశిష్ట బుల్ లాంటి మగాడు అనడం గుర్తొచ్చి, నిజంగా అలాంటి వాడేనని, తరచూ హాయిగా నవ్వుకుంటుంది కావ్య! 'ఓ మగాడిలో అంత కోరికా?' అని ఆశ్చర్యం కూడా. దానిమీద వేళాకోళమాడితే రవి గర్వంగా సిగ్గుపట్టం కూడా ఎన్నోసార్లు జరిగింది.

వాళ్ల పడుచుదనం కోరికల బండి హుషారుగా సాగిపోతుంది. ఆరు నెలలు గడిచిపోయాయి. కావ్య నెల తప్పింది. ఇద్దరికీ అదో మురిపెం!



వేవిళ్ళ వల్ల కొంత, ఒంట్లో నలత వలన కొంత... ఇదివరకంత ఉత్సాహంగా శృంగారంలో ఉండలేకపోతోంది కావ్య. సంసారం అన్నాక, దాంపత్యం అన్నాక ఇటువంటి తియ్యటి సమస్యలు మామూలే అని తెలియక కాదు, అయినా కావ్య మనసులో ఓ బెంగ తలెత్తింది. 'తను మామూలు మనిషై, పూర్వపు మనిషిలా, ఆరోగ్యంతో, ఉత్సాహంతో శృంగారంలో ఉండాలంటే కనీసం సంవత్సరం పడుతుంది. అంతవరకు ఇంత కోరిక నిండిన రవిచంద్ర, స్త్రీ సుఖానికి దూరంగా ఉండగలడా... ఖచ్చితంగా ఉండలేడు. అలా ఉండలేక, ఏదో రోజు, ఏ మత్తులోనో, మోహంతోనో చిల్లర ఆడవాళ్ల దగ్గరకి వెళ్లి, తన కోరిక తీర్చుకుంటే... ఆ టైములోనే ఏ రాకూడని జబ్బో అంటుకుంటే... ఇంకేమైనా ఉందా! మొత్తం ఇద్దరి జీవితాలు పాడవుతాయి. అమ్మో! అలా జరగకూడదు!' ఈ బెంగ పెరిగి పెద్దదై, నిత్య మథనగా మారింది కావ్యకి. అది ఆమె మానసిక స్థితి మీదే కాక, శారీరక ఆరోగ్యం మీద ప్రభావం చూపించింది. రోజు రోజుకి బాగా నీరసపడుతోంది. ఇలా కాదు, ఏదో దారి చూడాలని బాగా ఆలోచించింది కావ్య!

అలా ఆలోచించిన కావ్యకి ఓ దారి దొరికింది. ఆ దారి విశిష్ట! ఆ ఆలోచన స్థిరపడిన వెంటనే వెళ్లి విశిష్టని కలిసింది. కలిసి పరిస్థితి అంతా వివరంగా చెప్పి... "ఏ భార్యా కోరని కోరిక, చెయ్యని సాహసం చేస్తున్నాను. నీ సహాయం కావాలి... కాదనకు!" అంది కావ్య.

"అలాగే, ఏమిటో చెప్పు!" అంది విశిష్ట.

"రవి సంగతి నీకు నాకు బాగా తెలుసు. తనో పెద్ద కోరికల పుట్ట. ఏడాది కాలం స్త్రీ సుఖం లేకుండా ఖచ్చితంగా ఉండలేడు.

ఇప్పటి వరకు మీ ఇద్దరి మధ్య శారీరక సంబంధం లేదని నాకు తెలుసు. ఇప్పుడు పెట్టుకోండి. రవితో సంబంధం పెట్టుకుని, తన కోరికకి అడ్డుకట్టవై శారీరకంగా అతన్ని కాపాడు. ఏడాది పాటు నీదే భారం!" అంది.

ఓ క్షణం గడవకముందే.. "అలాగే.. నాకేం అభ్యంతరము లేదు" అంది విశిష్ట నవ్వుతూ.

విశిష్ట వెంటనే అలా ఒప్పుకున్నందుకు కొంచెం ఉక్రోషం వచ్చింది కావ్యకి. అయినా అవసరం తమది అని మనసును సరిపెట్టుకుంది. ఓ ఉద్వేగ చర్యే అయినా, దాని వెనుక భర్త మీద గొప్ప ప్రేమ ఉంది. అందుకే అలా చేయగలిగింది కావ్య.

ఇంక తర్వాతి అధ్యాయం... ఈ విషయం అంత రవికి చెప్పాలి. ఏం ఖర్మో... ఓ భార్య అయ్యుండి, భర్తని మరో ఆడదానితో గడపమని చెప్పవలసి రావడం ఎంత దురదృష్టం అనుకుంది. అయినా తప్పదు... అని మళ్లీ తనని తానే సర్ది చెప్పుకుంది కావ్య.

ఆ రాత్రే, దడ దడలాడుతున్న మనసుతో రవిచంద్రకి చెప్పేసింది కావ్య. అంతా విన్నాడు రవి. విని కాసేపు మౌనంగా ఉండిపోయాడు. ఆ తర్వాత కావ్య రెండు చేతులు తన చేతుల్లోకి ఎంతో ఆప్యాయంగా తీసుకున్నాడు.

"కావ్యా... ఏ భార్య సిద్ధపడని పనికి సిద్ధపడ్డావు. అంతేకాదు, నువ్వే మాట్లాడి అంతా అరేంజ్ చేసావు. థాంక్యూ వెరీ మచ్! కానీ ఒక్క విషయం మర్చిపోయావు. భార్యాభర్తలంటే కేవలం కోరికలు, సరసాలు, సరదాలే కాదు... కలిసికట్టుగా సమస్యల్ని ఎదుర్కోవాలి! నాలో అపరిమితమైన కోరికతో పాటు, అంతకుమించిన ఎంతో ఓర్పు ఉంది. ఒక్క ఏడాదే కాదు, అవసరమైతే ఎన్నాళ్లేనా, ఎప్పుడైనా పూర్తి బ్రహ్మచారిగా ఉండగలను... ఉంటాను! ఆ విషయంలో నీ బెంగలన్నీ తుడిచెయ్యి. మనిద్దరం ఒకరికి మరొకరు అంతే. మన మధ్యలో ఏ విశిష్టలూ వద్దు. ఎంతమాత్రము అవసరం లేదు!" అన్నాడు.

కావ్యకి కళ్ళమ్మట జలజల కన్నీళ్లొచ్చేయి. ఆమె మనసు గాలంత తేలికైపోయింది. తడికళ్ళతో, తేలికపడ్డ నిండు మనసుతో రవిని గట్టిగా కౌగిలించుకుంది. ఆ దంపతులిద్దరూ అలౌకిక ఆనందంలో మునిగిపోయారు.

దాంపత్యమంటే అదే. ఒకరి కోసం ఒకరు చూపించే అనురాగం, ఓర్పు దానికి గొప్ప పునాది.

ఇలాంటి అద్భుత అనురాగం, సమస్థాయి ప్రేమ ఉంటే, ఏ దాంపత్యం విడిపోదు. ఏ సంసారం విచ్ఛిన్నం కాదు.

కావ్య, రవిచంద్రలది అసామాన్య ప్రేమ!!

# హాఫ్ బౌ

## ఎస్వీకె. సంహితానాయుడు

✆ 92472 78740

> ***"హస్బండ్ ఆఫ్ ఫేస్‌బుక్ అడక్టెడ్ వైఫ్..'హాఫ్‌బౌ' అనీ... మనలాంటోళ్ళ కోసం ఓ ఆర్గనైజేషనే ఉంది. ఒకప్పుడు టీవీలో డబ్బింగ్ సీరియళ్ళకి అడక్ట్ అయి, వాటిలోని ఆడవిలన్లను ఆదర్శంగా తీస్కొని మొగుళ్ళని సాధించే భార్యల్లా... ఇప్పుడు ఆడాళ్ళు 'ఫేస్‌బుక్-వాట్సాప్'ల వైపు అట్రాక్టౌతున్నారు. డబ్బింగ్ సీరియళ్ళ కంటే ఇవే డేంజర్!"***

'ట్రింగ్గ్గ్గ్...'

అలారం మోత చెవులగుండా దూరి, గుండెల మీద 'దభీదభీ'మని బాదినట్లు మోగడంతో... అప్పటి వరకూ కలవరింతల పలవరింతలతో గాఢనిద్రలో మునిగిన మంజుల... చివ్వున లేచి కూర్చుని, అలారం ఆఫ్ చేసింది.

కళ్ళు రుద్దుకుంటూ టైమ్ చూసింది... ఉదయం ఐదు గంటలు!

'అమ్మో, అప్పుడే ఐదైందా?' అనుకుంటూ రక్కున దిండుకింది మొబైల్‌ఫోన్ తీసి, గతరాత్రి 'ఫేస్బుక్' లో తను చేసిన పోస్ట్‌కి ఎన్ని లైకులూ, ఇంకెన్ని కామెంట్లూ వచ్చాయో చూస్కుని, తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

అంతలో... సమయం పరిగెడుతోందన్న విషయం గుర్తురాగానే, 'ఇంక క్షణం కూడా వృధా చేయకూడదు!' అనుకుంటూ గబగబా లేచి కిచెన్‌లోకి పరిగెత్తింది.

కాఫీగిన్నె స్టౌమీద పెట్టి, లైటర్‌తో వెలిగించబోతూ యథాలాపంగా తల తిప్పి చూస్తే... సింక్‌లో ముందురోజు రాత్రి మాడిపోయిన తాలింపుతో నల్లగా మారిన బాణలి కనిపించింది కళ్ళకి! వెంటనే మొబైల్‌తో దాన్ని క్లోజప్ ఫోటో తీసి, అంతే స్పీడుగా 'ఫేస్‌బుక్'లోకి తోసేసింది. ''మాడిన బాణలి కడిగితే మెరుస్తుంది... వాడిన హృదయం తడిమితే కురుస్తుంది... శుభోదయం మిత్రులందరికీ!'' అనే కవితా పంక్తుల్ని క్యాప్షన్‌గా తగిలించి!

అంతే... మండుటెండలో నీటిచుక్కకై కాచుకున్న బీడుభూమిలా... ఆమాత్రం 'పల్కరింపు' కోసమే ఎదుర్చూస్తున్న ఆమెగారి 'మగాభిమానులు' ఆగమేఘాలపై దూసుకొచ్చి ''వావ్- సూపర్- ఎక్స్‌లెంట్'' అంటూ వరుసబెట్టి చేస్తున్న రొటీన్ కామెంట్లు చూస్కుని తెగ మురిసిపోయింది.

ఆ తర్వాత, రెండే రెండు నిమిషాల్లో బెడ్‌కాఫీ ప్రిపేర్ చేస్కొచ్చి బెడ్రూమ్‌లోకి రయ్‌న జొరబడింది. నిండా దుప్పటి ముసుగుదన్ని పడుకున్న మొగుడ్ని చూసి, చేతిలోని కప్పు పక్కనబెట్టి, బకెట్‌లో బట్టలు జాడించినట్లు అతగాడ్ని తట్టి(కొట్టి) లేపింది.

"ఏఁ..వండీ... లేవండ్లేవండి! ఆఫీసుకి టైమౌతోంది... లేచి రెడీ అవ్వండీ!" దీర్ఘాలు తీస్తూ కప్పుకున్న దుప్పటిని ఛర్రున లాగేసింది.

నిద్రమత్తో, 'రాత్రి'మత్తో... అదింకా వదల్లేనట్లుందా పురుషపుంగవుడికి! ఇట్నుంచి అటుతిరిగి పడుకుంటూ "ప్లీజ్ మంజూ! రాత్రి బాగా అలసిపోయానుగా... ఈరోజు ఆఫీస్కెళ్లాలన్పించట్లేదు. లీవ్ పెట్టేస్తాలే... కాసేపు పడుకోనీ నన్ను!" అన్నాడు మగతలో ముద్దముద్దగా.

"ఏఁవిటీ... ఆఫీసుకి వెళ్లరా?" కొంపలు మునిగినట్లు గాబరాపడుతూ అరిచింది.

"హబ్బాఁ... అంత గట్టిగా అరవకే... దడుచుకొని ఛస్తాను. వెళ్లి నీ పన్జూసుకో! నా జోలికి రాకు, పడుకోనీ నన్ను!" చిరాగ్గా అన్నాడు.



సంధ్యకి ఏదో గుర్తొచ్చినట్లుగా నెమ్మదిగా అతడి ప్రక్కకి చేరి, గొంతు తగ్గించి అతడి చెవిలో "మా శ్రీనూ బంగారుకొండా... ఆఫీసు కెళ్తారు తొందర్గా..." అంటూ అదేదో సిన్మాలోని పాటని 'పేరడీ' చేస్తూ, రాగం తీస్తూ పాడింది.

"ఊహూఁ... నే వెళ్లను మంజూ... ఉహుహు!" మారాం చేస్తున్నట్లు గారాలుపోయాడు.

"అలాగంటే ఎలాగండీ? ఒంట్లో బానే ఉందిగా! నా మాట వినండీ! రేపెట్లాగూ ఆదివారమే... ఇంటిపట్టునే ఉండొచ్చు. మా శ్రీవారు మంచోరు కదా, నా మాట వింటారు కదా, ప్లీజ్ లేవండీ!" అతడి గడ్డం పట్టుకొని బుజ్జగించే ధోరణిలో అంది.

"ఆదివారమైతే మాత్రమేం ప్రయోజనం? రోజంతా ఆ దిక్కుమాలిన మొబైల్ఫోన్లోకే రెప్పలార్పకుండా చూస్కుంటూ, ఏంటేంటో టైప్ చేస్కుంటూ కూర్చుంటావ్... కనీసం తల తిప్పి చూసే తీరికే నీకు దొరకదాయె, నేను చెప్పేది విన్పించుకునే ఓపికే నీకు ఉండదాయె! ఏంటో... మొగుడూ పెళ్ళాలుగా ఒకే గూటి కింద కాపురం చేస్తున్నామే కానీ, మనం మనసు విప్పి మాట్లాడుకునే టైమే దొరకడం లేదు. ఏదేమైనా సరే... ఈరోజు ఆఫీసు కెళ్లను. పగలంతా నీతోనే గడుపుతాను... సాయంత్రం ఏ సినిమాకో, షికారుకో వెళ్దాం... సరేనా? ప్లీజ్... నా ముద్దుల మంజువి కదూ! వెళ్లనీయకూ... నను వెళ్లనీయకూ!" తనూ ప్రాధేయపూర్వకంగా అడిగాడు లేచి కూర్చుని.

మంజులలో కంగారూ, గాబరా, దిగులూ, ఆరాటం, ఆత్రుతా, టెన్షన్... లాంటి ఫీలింగ్స్ పెట్రోల్, డీజిల్ రేట్లలా క్షణక్షణానికీ పెరిగిపోతున్నాయి! 'వంట చెయ్యాలి, ఇల్లూడవాలి, బట్టలుతకాలి, ఆపై... అమ్మో! ఈయన ఆఫీసుకి వెళ్లకపోతే ఎలా?

కుదర్దు... కుదరదు గాక కుదర్దు!'

"ఏవండేవండేవండీ... మనసు విప్పి మాట్లాడేదేదో మీరు ఆఫీసు నుంచొచ్చాక మొత్తం విప్పి చెబ్దురు గానీ! రాత్రి నిద్రపోయే ముందు మీరు చెప్పేవన్నీ వింటూ పడుకుంటాన్లెండి! ప్లీ..జ్... ముందు మీరు మంచం దిగి బాత్రూమ్‌లోకి దూరండీ... అవతల టైమైపోతోందీ!" బలవంతంగా అతడి భుజాలు పట్టుకుని లేపింది.

"ఛీ... ఛీ... కట్టుకున్న భార్యతో కనీసం ఒక్కరోజైనా తృప్తిగా గడిపే భాగ్యానిక్కూడా నోచుకోని బతుకైపోయింది నాది!" విసుగ్గా గొణుక్కుంటూ అయిష్టంగానే బాత్రూమ్‌లోకి దూరాడు.

విజయగర్వంతో ఉప్పొంగిపోతూ జింకపిల్లలా కిచెన్‌లోకి పరుగుతీసింది... మంజుల!

పావుగంటకోసారి టైమ్ చూసుకుంటూ, పనులన్నీ యమస్పీడ్‌గా పూర్తిచేయసాగింది. భర్తని ఆఫీసుకి పంపించ(నెట్టేయ) గానే తలుపులు బిగించి లోపల గడియ పెట్టేసుకుంది.

తర్వాత గబగబా ల్యాప్‌ట్యాప్ తీస్కుని 'ఇంటర్నెట్' ఆన్ చేసి, సోఫాలో జారగిలబడి, కాలేజీ అమ్మాయి వాట్సాప్‌లో మెసేజ్ టైప్ చేసినంత స్పీడ్‌గా కీబోర్డ్‌పై వేళ్లను కదిలిస్తూ తన ఫేవరెట్ సైట్ 'ఫేస్‌బుక్' ఓపెన్ చేసి, పరిసరాల ధ్యాసే మర్చిపోయి, అందులో సీరియస్‌గా విహరించసాగింది.

★★★

లంచ్ టైమ్...

అప్పటివరకూ ఆఫీస్ వర్క్‌తో అలసిపోయి, టేబుల్ పైనున్న ఫైల్సన్నీ ఓ ప్రక్కకి సర్ది రిలాక్స్‌డ్‌గా సీట్లో వెనక్కి జారగిలబడి కూలబడ్డాడు శ్రీనివాస్! కొలీగ్స్‌లో కొందరు క్యాంటీన్‌కి వెళ్తుంటే... లంచ్‌బాక్స్ తెచ్చుకున్నవాళ్ళు తమ టేబుళ్ల వద్ద కూర్చొని లంచ్‌కి పూనుకుంటున్నారు.

శ్రీనివాస్ కూడా తన బాక్స్ ముందర పెట్టుకున్నాడు. అలసటగా అన్పించి కొద్దిసేపు అలాగే కూర్చుండిపోయాడు. తర్వాత 'మంజుతో కాస్త సరదాగా మాట్లాడ్తే ఉల్లాసంగా ఉంటుంది' అన్పించి, మొబైల్‌ఫోన్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

ప్రైవసీ కోసం సీట్లోంచి లేచి, గది మూలకి నడిచి, భార్య నంబర్ డయల్ చేసి, ఫోన్‌ని చెవి దగ్గరుంచుకుంటూ అవతల్నుంచి విన్పించే రిప్లయ్ కోసం ఆత్రంగా ఎదురు చూడసాగాడు.

వారంరోజుల క్రితం కొన్న 'ఫైవ్–జీ' మొబైల్ ఫోనది! భారద్దేశపు భారీ సంస్థ 'కియో' కంపెనీ నుంచి 'మరో' (చచ్చిపో) పేరుతో మొన్నీమధ్యే మార్కెట్లోకి 'లాంచ్' అయిన కొత్తరకం సర్వీసుతో పనిచేసే ఫోనది! అది కొంటే "అపరిమిత కాల్సూ– అన్‌లిమిటెడ్ నెట్టూ... ఫ్రీ– ఫ్రీ– ఫ్రీ!" అంటూ ప్రింట్... విజువల్ మీడియాల్లో ఊదరగొట్టే 'కవరేజీలు' చూడ్డమేగాక, తన ఫ్రెండ్స్‌లో కూడా తొంభైశాతం 'పోలో'మంటూ ఆ 'మరో' ఫోన్లనే కొనడం చూసి కాస్త 'డిస్టర్బ్' అయ్యాడు శ్రీనివాస్. దాంతోపాటు తనవైపు, మంజు వైపు బంధువుల్లో తమతో మాట్లాడే ప్రతివొక్కరూ 'మిస్డ్‌కాల్స్ మహాశయులే' కాబట్టి, ఫోన్ బిల్ తగ్గించుకోవాలన్న తపనతో, టెంప్ట్ అయిన శ్రీనివాస్, ఆ కంపెనీ మొబైల్‌ఫోన్ కొనకుండా ఆగలేకపోయాడు.

అంతేకాదు... అంతకుమునుపు తను ఆఫీసుకి వచ్చేయగానే, టీవీ ఆన్ చేస్కుని, హిందీ, తమిళాల్లోంచి 'డబ్' అయిన

తెలుగు సీరియళ్ళకి అడక్టై పోయి, డిప్రెషన్‌కిలోనై వారంపాటు కోమాలోకి కూడా వెళ్లొచ్చిన మంజుని, కాస్త డైవర్ట్ చేయడం కోసం ఆమెకి ఓ ల్యాప్‌ట్యాప్ కొనిచ్చి, దానికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ పెట్టించి, సోషల్ మీడియాలతో టైమ్‌పాస్ చేసుకోమన్నాడు శ్రీను. ప్రతినెలా నెట్ బిల్ తడిసి మోపెడవడంతో, తన కాల్సుకీ, ఇంట్లోని ఇంటర్నెట్టుకీ వెసులు బాటుగా ఉంటుందని, 'చచ్చిపో' ఫోన్లని ఒకటి కాదు, రెండు కొన్నాడు. ఇంట్లోని ఫోన్‌తో మంజు ఇంటర్నెట్ వాడుకుంటుంది, తన దగ్గరున్న ఫోన్‌తో అన్‌లిమిటెడ్ కాల్స్ చేసుకుంటూ, మంజుతో సరదాగా, ఎంతసేపైనా ఫ్రీగా మాట్లాడొచ్చు... అని శ్రీనివాస్ 'ఐడియా'!

కానీ, విచిత్రం... వారంక్రితం ఆ ఫోన్లు కొన్నప్పట్నుంచీ అతడు బయటినుంచి ఇంట్లో ఉన్న మంజులకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా... అతడు అడిగినవాటికామె ఒకట్రెండు ముక్కల్లో ముక్తసరిగా బదులిచ్చి కాల్ కట్ చేస్తుందే కాని, అతడాశించినట్లు సరదాగానో, సరసంగానో మాట్లాడట్లేదామె! అతడు ఆ ఫోన్లు కొన్న 'పర్పస్'కీ, మంజుల 'బిహేవియర్'కీ ఏమాత్రంపొంతన ఉండటం లేదు!

ఇప్పుడైతే... అట్నుంచి బదులే లేదు. ఎన్నిసార్లు లైన్ కలిసినా, అవతలి వైపు ఫోన్ రింగవుతున్న చప్పుడు తప్ప, ఫోన్ మాత్రం లిఫ్ట్ కావడం లేదు.

ఆఫీస్ రూమ్‌లో ఓ మూలన చేరి మాటిమాటికీ ఫోన్ చేస్తూ అతడు వ్యక్తం చేస్తున్న అసహనపు నిట్టూర్పులు వింటున్న మిగతా స్టాఫంతా అతడి వంక వింతగా, ప్రశ్నార్థకంగా చూడసాగారు. వాళ్ళ చూపుల బాణాలకి శ్రీనివాస్‌లో కలిగే ఇరిటేషన్, సమ్మర్‌లో టెంపరేచర్‌లా క్షణక్షణానికీ పెరిగిపోసాగింది. 'ఇక ఇదే ఆఖరిసారి!' అని గట్టిగా అనేస్కుని, మంజుల నంబర్‌కి రింగ్ చేశాడు. చిత్రం... ఈసారి అవతలివైపు ఫోన్ లిఫ్టయ్యింది!

అంతే... చుట్టూ అందరూ తననే చూస్తూ, తన మాటలే వింటున్నారన్న ఆలోచన కూడా రాలేదతనికి...

"ఏయ్... ఏమైంది నీకు? బుద్ధుందా అసలు? ఎంతసేపట్నుంచి ఫోన్ చేస్తున్నానో తెలుసా? ఏమైపోయావ్... ఏం చేస్తున్నావింతసేపూ? ఒక్కసారైనా..." అంటూ సునామీలో దూసుకొచ్చే సముద్రపు కెరటంలా అతడిలోని కోపం, అసహనాలు ఆ రకంగా పొంగుకొచ్చాయి.

అయినా... వాటికి అడ్డుకట్ట వేసేందుకు అట్నుంచి ఏమాత్రం ప్రయత్నించలేదామె. అతడి వాక్ప్రవాహమంతా ఆగిపోయి, అతడికే ఆయాసమొచ్చి సొమ్మసిల్లాక, తాపీగా బదులిచ్చింది...

"ఎందుకండీ అంత కోపం? ఈ టైమ్‌లో మా ఫేస్బుక్ ఫ్రెండ్స్ అందరం ఆన్‌లైన్ ఛాటింగ్‌లో బిజీగా ఉంటాం... క్షణం కూడా ఛాటింగ్లోంచి బయటకొచ్చే ఛాన్సే ఉండదనుకోండీ! రోజూ మీరిదే టైమ్‌కి ఫోన్ చేసి డిస్టర్బ్ చేస్తున్నారని, ఈరోజు ఫోన్‌ని వైబ్రేషన్ మోడ్‌లో ఉంచేశాను. అందుకే రింగైన చప్పుడు విన్పించలేదు... అంతే! ఇందాకే అందరం అన్నాలు తినొద్దామని కాస్త బ్రేక్ తీస్కుని ఛాటింగ్‌లోంచి ఇవతలికొచ్చాం. ఇప్పుడు ఫోన్ లిఫ్ట్ చేశానుగా... ఇంతలో కొంపలు కాలిపోతున్నట్లు అంత కోపమెందుకండీ? కాస్త ఓపిక ఉండొద్దూ?"

చుట్టూవున్న అందరూ తననే చూస్తున్నారని తెల్సుకోవడం వల్లో, లేక భార్యతో సరదాగా మాట్లాడాలనుకొని, తనకు తెలీకుండానే మూడ్ పాడుచేసుకున్నానన్న జ్ఞానోదయం కలగడం వల్లో... వెంటనే తనను తాను కంట్రోల్ చేసుకుంటూ...

“అదికాదు మంజూ… అసలూ…” అంటూ మామూలుగా మాట్లాడ్తూ కబుర్లలోకి దిగబోయాడు.

కానీ, అతడి మాటలకి అడ్డుపడి ‘‘ఔనూం… నిన్నరాత్రి నేను కూర మాడ్చేశానని చిర్రుబుర్రులాడ్తూ, మొహమంతా మాడ్చేస్కుని, నాపై కస్సుబుస్సుమని ఇంతెత్తున ఎగిరారుగా!’’ అంది నిలదీస్తూ.

“ఔను! మాడ్చావు… నాక్కోపం వచ్చింది… నిన్నో మాటన్నాను… అయితే ఏంటటా?”

“ఏంటటా… అని అంత నిదానంగా అడుగుతారేంటీ? ఆ మాడిన మూకుడిని అట్లాగే ఫోటో తీసి, ఫేస్‌బుక్కులో పెడితే, గంటసేపట్లో ఎన్ని లైకులొచ్చాయో తెల్సా… ఎనిమిది వందల ముప్ఫయ్‌రెండు! నన్నూ, నా నిజాయితీని మెచ్చుకుంటూ, నన్ను ఓదారుస్తూ ఇంకెన్ని కామెంట్లొచ్చాయో చెప్పనా… ఏడువందలా అరవైమూడు!” అంది సంధ్య విసురుగా.

శ్రీనివాస్‌కి అర్థం కాలేదు. “అయితే ఏంటటా?” అన్నాడు విసుగ్గా.

“ఫేస్బుక్‌లో నాకు ఐదువేలమంది ఫ్రెండ్సున్నారు. మరో పాతికవేల దాకా ఫాలోయర్స్ ఉన్నారు. నేనొక పోస్ట్ పెట్టానంటే… అరగంటలో ఆరొందల పైనే లైకులూ, కామెంట్లూ, ఇలా ఇలా వర్షంలా వచ్చి కురుస్తాయ్!” అంది మంజుల… అదేదో సిన్మాలో హీరో ‘కత్తులతో కాదురా.. కంటిచూపుతో చంపేస్తా!’ అనే పంచ్‌డైలాగ్‌లోని తీవ్రతని తన కంఠంలో పలికిస్తూ!

శ్రీనివాస్‌కి ఏమనాలో తెలియలేదు. “చూడూ… నీకెంతమంది ఫ్రెండ్సూ, ఫాలోయర్స్ ఉంటే నాకెందుకు? నీ పోస్టులకొచ్చే లైకులూ, కామెంట్లతో నాకేం పని? నువ్వు చేసిన కూర తినాల్సింది నేను… తిన్నది నేను.. మాడ్చింది నువ్వు… మండింది నాకు!’’ అని, మళ్లీ అన్నాడు “అయినా, ఐటీ ఆఫీసర్లకి ఆదాయం ఖర్చు అప్పచెప్పినట్లు వాళ్ళందరి గురించీ నాకెందుకు లెక్కలు చూపిస్తున్నావ్?’’

“ఇకపై నన్నొకమాట అనేముందు నాకెంత ‘సీనూ… సినిమా’ ఉందో గుర్తుంచుకుంటారనీ!”

ఈ మాటల అంతరార్థం అతడికేమాత్రం అర్థం కాలేదు కానీ, ఆమె స్వరంలోని తీవ్రతని బట్టి మంజులకి తనపై కినుకగా ఉందని అర్థమైంది. అందుకే “అది కాదు మంజూ…” అంటూ ఏదో చెప్పబోయాడు. కానీ…

“సరే… లంచ్ ముగించి ఒక్కొక్కరూ మళ్లీ ఆన్‌లైన్లోకి వచ్చేస్తున్నారు. నేను ఫోన్ పెట్టేస్తున్నాను. మధ్యలో మళ్లీ ఫోన్ చేయకండి. ఏదైనా అర్జెంట్‌గా మాట్లాడాల్సింది ఉంటే మీరు ఆఫీసు నుంచొచ్చాక మాట్లాడుకుందాం… బై!” అతడి రెస్పాన్స్ కూడా వినిపించుకోకుండా అవతలివైపు లైన్ కట్టయ్యింది.

శ్రీనివాస్‌లో అసహనం, కోపం తిరిగి నషాళానికి చేరుకున్నాయి. ‘ఏదైనా అర్జెంట్‌గా మాట్లాడాల్సింది ఉంటే నేను ఆఫీసు నుంచొచ్చాక మాట్లాడుకోవాలా… ఛీ!’ అనుకుంటూ చేతిలోని ఫోన్‌ని నేలకేసి విసిరికొట్టబోయేవాడే! కాని, ఆఖరి నిమిషంలో ఆ ఫోన్‌కి సంబంధించిన వెసులుబాట్లలో తను కక్కుర్తి పడిన అంశాలు గుర్తొచ్చి ఆగిపోయాడు. ‘ఛీ… పెళ్ళాంతో కనీసం సరదాగా మాట్లాడే అదృష్టానికి కూడా నోచుకోని దిక్కుమాలిన బతుకైపోయింది నాది!’ అని గొణుక్కుంటూ వచ్చి తన సీట్లో కూలబడ్డాడు శ్రీనివాస్.

లంచ్ కూడా చేయాలన్పించలేదు. అయిష్టంగానే తిరిగి ఆఫీసు వర్క్‌లో తలదూర్చాడు.

★★★

"ఇది నీ ఒక్కడి సమస్యే కాదు శ్రీనూ... మాలో చాలామంది 'హాఫ్‌బౌ'లమే!"

"హాఫ్‌బౌ'? అంటే ఏంటీ?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనివాస్.

"హస్బండ్ ఆఫ్ ఫేస్‌బుక్ ఎడిక్టెడ్ వైఫ్... 'హాఫ్‌బౌ' అనీ... మనలాంటోళ్ళ కోసం ఓ ఆర్గనైజేషనే ఉంది. ఒకప్పుడు టీవీలో డబ్బింగ్ సీరియళ్ళకి అడిక్ట్ అయి, వాటిలోని ఆడవిలన్లను ఆదర్శంగా తీస్కొని మొగుళ్ళని సాధించే భార్యల్లా... ఇప్పుడు ఆడాళ్ళు 'ఫేస్‌బుక్-వాట్సాప్'ల వైపు అట్రాక్టౌతున్నారు. డబ్బింగ్ సీరియళ్ళ కంటే ఇవే డేంజర్!" అన్నాడు.. సీనియర్ బాధితుడైన సదానందం!

శ్రీనివాస్ కూడా 'ఫేస్బుక్ ఎడిక్టెడ్ భార్యాబాధితుడే!' అన్న విషయం తెలిసి, అతడి కోసమే ఆరోజు ఆఫీసైపోగానే క్యాంటీన్‌లో ఓ గంటసేపు స్పెషల్‌గా మీటయ్యారు అతడి కొలీగ్స్.

"మరి దీని విరుగుడికి ఏమిటి మార్గం?" అయోమయం నుంచి తేరుకొని అన్నాడు శ్రీనివాస్.

"యాంటీ-ఫేస్బుక్ క్యాప్సూల్స్ పూటకొకటి చొప్పున మూడ్నెల్లపాటు భార్యల చేత మింగించాలి. నేను మాయావిడకి అదే వాడాను!" చెప్పాడు నవనీతరావ్.

"నో ఫేస్బుక్ ఎడిక్షన్ పౌడర్' అనీ... అర్ధరాత్రిళ్ళు టీవీల్లో 'టెలీషాపింగ్' అడ్వర్టైజ్మెంట్ వస్తుంది. మాయావిడ దీన్ని వాడాక, ఇప్పుడు తను ఫేస్బుక్ ఓపెన్ చెయ్యట్లేదు, పోస్టులు చెయ్యట్లేదు, లైకులూ కొట్టట్లేదు!" అన్న చిదానందం మాటల్తో... 'తన తక్షణ కర్తవ్యం తెలిసింది' శ్రీనివాస్‌కి!

# స్వారోచిష విలంబిత

భాగవతుల భారతి
✆ 8121712950

***"మీ పట్నం పిల్లల కన్నా, మా పల్లెటూరి పడుచుల్లోనే, ప్రకృతి మీద అవగాహన ఎక్కువ! మేమూ చదువుకున్నాం! మా వాళ్ళంతా మీకు సంస్కృతంలో సమఉజ్జీలే. నా పేరు చూస్తే తెలుస్తూనే ఉందిగా! చదివింది పల్లెటూరి ఇంగ్లీష్ చదువులైనా, పెళ్ళి అనగానే, మీకుండే భయాలు మాకూ ఉంటాయి.***

"స్వాధీనపతికా చైవ తథా వాసకసజ్జికా
విరహోత్కంఠితా ప్రోక్తా విప్రలబ్ధా చ ఖండితా|
కలహాంతరితా చైవ తథా ప్రోషితభర్తృకా
తథాభిసారికా చైవ మష్టథా నాయికా మతా:|"

ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడతను.

"అంటే?" అడిగిందామె.

"వీళ్ళంతా అష్టవిధ నాయికలు!"

"అంటే?" మళ్ళీ అడిగిందామె.

"సందర్భానుసారముగా, నాయకుని వియోగ సంయోగములననుసరించి, నాయికలు అంటే నీలాంటి ఆడువారు, ఎనిమిది శృంగార అవస్థలు అనుభవిస్తారు. వీరినే అష్టవిధనాయికలు అంటారు!"

"అవస్థ అంటే?"

"వామ్మో! ఇన్ని చెప్పినా నీబుఱ్ఱకి ఎక్కట్లేదా?"

"ఏం ఎక్కాలీ?" అడిగింది మళ్ళీ.

అంతే! పూలపాన్పుమీది నుండి దిగ్గున లేచిపోయాడు. తలుపు తీసుకుని బయటికి నడిచాడు. పుచ్చపూ కాంతుల వెండివెన్నెల వెక్కిరించినట్లుంది. తను స్వయంగా వ్రాసిన తేటగీతి పద్యం మదిలో మెదిలింది.

"కాచె జలతారు వెన్నెల కాంతులీన
చూచె కన్నులు గాయగ కమలనయన
పూచె బుగ్గన సిగ్గులు పులకరించి
వేచె రాధిక విరహాన వెన్నుకొరకు!"

'బుగ్గన సిగ్గులేవీ? విరహాలేగా? ప్చ్' నిట్టూర్చాడతను! గతంలోకి జారిపోవాలనుకున్నాడు. కానీ ఇంత కమ్మని రాత్రి గతం ఎందుకు? అని అనుకున్నా, మనసు ఊరుకోలేదు.

స్వరోచికి శృంగారం మీద కొన్ని ఆశలూ, కలలూ ఉన్నాయి. ఊహలు వేరు వాస్తవాలు వేరు అని, పెళ్ళయి ఈ మొదటి రోజు, అనబడే ఫస్ట్ నైట్ రోజున తెలిసింది.

తనే కాదూ! తరతరాలుగా తాతలూ తండ్రులూ... సంస్కృత పండితులే!



తనకు 'స్వరోచి' అనే పేరు తనకు పెట్టటంలోనే తెలిసిపోతోంది వాళ్ళ అభిరుచి. దానికి తగినట్లుగానే, పెరిగాడు స్వరోచి.

ఓ వయసువచ్చేసరికి శృంగారం మీద కూడా, ప్రబంధాల ప్రభావంతో.... తను కంప్యూటర్ సాఫ్టవేర్ అయినప్పటికీ, రసజ్ఞతలో తేలిపోతూ ఉంటాడు. కాలేజీలోనూ, బయట ఎంతోమంది అమ్మాయిలను చూసాడు. ఏ ఒక్కరూ, తన కళ్ళకు శృంగారపు మేజువాణిలా కనబడలా!

"నిజానికి ఈకాలపు అమ్మాయిలు చక్కని మోడ్రన్ లుక్కుతో, షార్ట్స్, రకారకాల డ్రస్సులలో మెరిసిపోతున్నారు. జీవితాన్ని

చక్కగా ఎంజాయీ చేస్తున్నారు." అని ఎవరైనా మెచ్చుకుంటే, "ఇదంతా విచ్చలవిడితనం" అంటాడు స్వరోచి.

"అవునా? ఎక్కడ ఎప్పుడు ఏదీ?" అనడిగితే....

"నాన్సెన్స్ ఈ సెల్‌ఫోన్‌లు వచ్చాకే, మనుషులంతా చెడిపోయారు" అంటాడు.

"పోనీ నువ్వు చెడిపోరాదూ! నిన్ను చెడగొడతాం పద" అని స్నేహితులు రెచ్చగొడితే ...

"నో! నేను నా భార్యకే అంకితం!" అంటాడు.

'యుక్తవయసు వచ్చేసింది. పెళ్ళిచేసేస్తాం!' అని తండ్రి వసువు, తల్లి గిరిక ప్రయత్నాలు మొదలుపెట్టి,

"ఏరా! నీ మనసులో ఎవరైనా ఉన్నారా?" అనడిగారు.

"ఎవరికీ చోటులేదు. ప్రబంధనాయకికి తప్ప!" అన్నాడు.

"నీ కావ్యాల్లో వర్ణించిన ఓ ప్రబంధనాయిక గురించి వర్ణించి చెప్పు బొమ్మగీసి, నీకు చూపిస్తాం!" అన్నారు స్నేహితులు.

వర్ణించాడు స్వరోచి.

"నువ్వు వర్ణించిన విధంగా ఐతే ఇలా ఉంటుంది!" ఇని ఓ దెయ్యంబొమ్మ గీసి ఆట పట్టించారు స్నేహితులు.

తండ్రి దగ్గర కూర్చోబెట్టుకుని... "బాబూ.. స్వరోచీ! నాకు, వసువు అని పేరు పెట్టినా, నీకు స్వరోచి అని నేను పేరు పెట్టినా... అవన్నీ అప్పటి రోజులు! కాలం మారుతోంది. పరిస్థితులూ మారుతున్నాయి. నిన్ను ఇలా పెంచి నేను తప్పుచేసానా... అనిపిస్తోంది! జీవితమంటే కాంప్రమైజ్! అవతలివాళ్ళు సర్దుకోటం కాదు, నువ్వు మారటానికి పెళ్ళి చేసుకోవాలి. మార్చుకో!" అని నచ్చచెప్పాడు.

స్నేహితులు కూడా "ఈరోజుల్లో ఆడవాళ్లూ... "అంటూ గాసిప్స్ చెప్పేసి అతని మనసులో అనవసరమైన అనుమానపు బీజాలు నాటారు.

చూసినవాటి కన్నా చెప్పుడు మాటలు చేటని... మనసును చెడగొట్టారు స్నేహితులు.

ఇక ఆడవాళ్ళను అనుమానించటం మొదలుపెట్టాడు.

ఓ పెళ్ళిచూపులకు తీసుకువెళ్ళారు.

వాళ్ళతో "మీ అమ్మాయి, కన్య అవునో, కాదో... టెస్ట్ రిపోర్ట్స్ కావాలి!" అని నోరు జారాడు.

అంతే! తన్నినంత పని చేసి పంపారు.

కానీ మన్మథుని, జయంతుని తలదన్నేఅందగాడు, ఆరంకెల జీతగాడు అయిన స్వరోచి... "అందమంతా ఇలా అడవి కాచిన వెన్నెలై పోతోందే!" అని స్నేహితులూ బాధపడుతూనే ఉన్నారు.

ఓ స్నేహితుడి పెళ్ళికి ఆత్రేయపురం వెళ్ళి, అమాయకత్వంతో కనిపించిన, విలంభితను చూసి మనసు పారేసుకుని, అమ్మానాన్నలకు చెప్పాడు.

వాళ్ళూ 'హమ్మయ్య! మెచ్చాడోచ్' అని మురిసిపోయి, మళ్లీ మనసెక్కడ మార్చుకుంటాడో అని, అటు పెద్దలతో మాట్లాడి, పెళ్ళి జరిపించేసారు.

జ్ఞాపకాలను వదిలించుకుని, వెనుదిరిగి చూసాడు. గది తలుపు దగ్గర వయ్యారంగా నిలబడ్డ విలంభితను చూసాడు.

పనసపండు రంగులాంటి శరీరఛాయతో, ఆరోగ్యవంతమైన, చక్కని శరీరాకృతితో తెల్లనిచీర, ఎఱ్ఱని లోనెక్ జాకెట్, మెరిసే నగలతో వెలిగిపోతోంది. అన్నీ సవ్యంగానే ఉన్నాయి. కానీ ఏదో అసంతృప్తి! తనకేం కావాలో తనకే తెలీట్లా... ఇవాళ మూడోరోజు... శోభనం మాత్రం జరగలేదు. కారణం?

శృంగారం ఓ మొక్కుబడిగా గాక, అనుభూతి గానో... ఓ ప్రేమ కావ్యంగానో మలుచుకోవాలనే తాపత్రయం!

ప్రబంధనాయికల గురించి, అష్టవిధనాయికల గురించీ చర్చించాలని, ఆమెకు ఏదో తెలియబరచాలనీ, అతని

తహతహ! కానీ ఆమెకు అర్థం కావట్లేదు. ఈ పల్లెటూరి బైతును చేసుకుని తను తప్పు చేసాడా? ఈమె గురించి ఏమీ తెలుసుకోలేకపోయాడే?

"ఏమాలోచిస్తున్నారూ?" వచ్చి భుజం మీద చేయి వేసింది. ఆ చేతి మీద తనూ చేయివేసి, "విలంభిత అంటే అర్థం తెలుసా? విలంబిత అంటే... ఓ అర్థం... విలంభిత అంటే ఓ అర్థం!" అన్నాడతను ఏదో వివరించాలని ప్రయత్నంలో....

"అంటే ఏంటీ?"

తల గోడకేసి బాదుకున్నంత పనిచేసి, వచ్చిమంచం మీద పడుకున్నాడు.

మల్లెలవాసన గుప్పుమని మనసు సుడులు తిరిగి గిలిగింతలు పెట్టింది. మనసు మూలిగింది. శృంగారానికి స్థాయీ భావం రతి. అది ఎంతో సేపు పట్టదు.

సరస సంభాషణ, ఏకవచన ప్రయోగాలూ, కొసరింతలు, ఒకరి వెనక ఒకరి కౌగిలింతలు, నఖక్షతముల గిలిగింతలు... ఇవన్నీ లేని శృంగారం ఊహించలేకపోతున్నాడు! రుచించట్లేదు!

"ఏమండీ! నేనేమైనా తప్పుచేసానా?"

"తప్పునీది కాదు నాది! సిటీలోని ఆడపిల్లలు, అన్నీ తెలిసిపోయి, అన్నీ జరిగిపోయి, శృంగారభావం మీద మోజుపోయి ఉంటారనీ..." మాటలు మింగేసి ఆలోచిస్తున్నాడు.

పెళ్ళిచూపుల్లోనూ, పెళ్ళిలోనూ మౌనంగానే ఉన్న విలంభిత 'పల్లెటూరిపిల్ల అణకువగా ఉంటుందిలే భలే ఉందిలే' అనుకున్నాడు.

కానీ తన ఆలోచనలు సరైనవి కావనీ, అణకువ అన్ని సమయాలలో ముఖ్యంగా శృంగారంలో పనికిరాదనీ తెలిసి...

ఇరువైపూ భార్యాభర్తల పాత్రలకు తనే చొరవ చూపడమంటే... కష్టమే! కాస్త తనూ సహకరించవచ్చుగా?' అనుకున్నాడు.

శృంగారమనేది రెండువైపులా, మనసులకూ, శరీరాలకు సంబంధించినదని, అవతల స్త్రీకి కూడా, ఆసక్తి ఉండాలనీ, అది బరితెగింపు కానేకాదనీ, స్త్రీల పట్ల తన ఆలోచనలు తప్పని, ఇప్పుడప్పుడే తెలిసివస్తోంది. అతడి ఆలోచనలు పసిగట్టినట్లుగా....

"నిజంగా మీ ఊహ తప్పండీ!" మొదటిసారి గొంతు విప్పింది ఆమె.

తిరిగి చూసాడు. ఇంతలోనే మార్చేసిందా? తెల్లచీరను, ఒంటిచుట్టూ, ఆచ్ఛాదనలా చుట్టుకుంది.

ముంజేతికి మల్లెపూలు చుట్టుకుంది. మరో పూచెండు పాపిడిబిళ్ళలా పెట్టుకుంది. పలుచని తెల్లచీరెలోంచి, అందాలు కనువిందు చేస్తుంటే, గుటకవేయటం మరిచిపోయి, చూస్తున్నాడు.

"విలంభిత అంటే విడుపరి, విసర్జించినది" అంటూ చెవిలో "అన్నీ విడిచేసాగా!" అంది.

అంతే స్వరోచిలోని మదనదాహంతో గొంతు తడారిపోయింది.

ఓ కాలు కిందపెట్టి, ఓ కాలులేపి, మంచం మీద పెట్టి, మన్మథభంగిమలో, "తాను చెప్పినట్లు విని, కోరినట్లు చేయు పతిని స్వాధీనమందుంచుకుని, సంతోషించునది స్వాధీనపతిక!" వంగి చెవిలో ముద్దు పెట్టింది.

"ప్రియుడు వచ్చు సమయమునకు రతిసంభోగ లాలసయై, తానలంకరించుకుని, పడకటింటిని శృంగారించి, తానునుభవించు సురస సామాగ్రిని సన్నాహము చేసి, అతని రాకకై ఎదురుచూచునది వాసకసజ్జిక ఇలా..." అంటూ గుప్పెడు మల్లెపూలు స్వరోచి మీదికి విసిరి పూలచెండుతో దగ్గరకు లాగింది.

"ఇక అభిసారిక మూడురకాలు... జోత్స్నాభిసారిక, తమోభిసారిక, దివసాభిసారిక!" ఇలా అంటూ బయటికి తీసుకుపోయి, వెన్నెలను చూపిస్తూ, మూడు ముద్దులు పెట్టింది.

"విరహోత్కంఠిత అంటే రావలసిన సమయమున మగడు రాలేదని, విరహము చేత చింతించుచు, అతనికి రాయబారము పంపునది... ఇలా!" అంటూ పాలగ్లాసు నోటికి అందించింది.

"దూతిని పంపి, సంకేతము చెప్పినప్పటికీ ఏదేని కారణము చేత మగడు తన వద్దకు రాకపోవుట వల్ల, వ్యాకులపడునది, విప్రలబ్ద... ఇలా" అంటూ స్వరోచిని మంచం మీదకి తోసి, పాములా అతని మీదికి పాకింది.

"పతిని అనుమానించి, తిరిగి పశ్చాత్తాపపడునది... కలహాంతరిత!" నుదుటిపై, ముద్దుపెట్టి చెప్పింది.

"ఇంకా..." అంటుండగానే...

"మిగతాది నేను చెబుతాగా!" అంటూ, స్వరోచి ఆమె పెదవులతో పాటు తలుపులూ మూసాడు.

"హమ్మో! గడుసుదానివే! ఎంత అమాయకంగా నటించావు? " అలసిసొలసిన వేళ, ఆమె కళ్ళల్లోకి, కొంటెగా చూస్తూ అన్నాడు స్వరోచి.

"మీ పట్నం పిల్లల కన్నా, మా పల్లెటూరి పడుచుల్లోనే, ప్రకృతి మీద అవగాహన ఎక్కువ! మేమూ చదువుకున్నాం! మా వాళ్ళంతా మీకు సంస్కృతంలో సమఉజ్జీలే. నా పేరు చూస్తే తెలుస్తూనే ఉందిగా! చదివింది పల్లెటూరి ఇంగ్లీష్ చదువులైనా, పెళ్ళి అనగానే, మీకుండే భయాలు మాకూ ఉంటాయి. కామశాస్త్రం చదవాలనే ఇంట్రస్ట్ ఉంటుంది. మీ గురించి విన్నాక, ఇంకా భయం ఎక్కువయి, పగలూ రాత్రీ, దొంగతనంగా,

యూట్యూబ్‌లో కామశాస్త్రం చదివా..."

"నా గురించా? ఏం విన్నావు?"

"మిమ్మల్ని మీరు తరిచి చూసుకున్నారా? ఆడవాళ్లు, చనువు తీసుకోకపోతే, అసంతృప్తి, తీసుకుంటే తెగించిందని అనుమానం మీలో! కోరిక ఇద్దరికీ ఒకటేగా! ఆడవాళ్లలో బరితెగింపు ఏం ఉండదండీ! అవి మీ మగాళ్ళలోని అనుమానపు ఛాయలు మాత్రమే! నిజంగా మేం తప్పు చేయదలుచుకుంటే మీ మగాళ్ళు ఆపగలరా?"

"నిజమే! మగాడికి, ఆడదాని మీద ఎప్పుడూ అనుమానమే! కానీ మీరు చెప్పే విధంగా చెబితే, మేం మీ దాసానుదాసులమేగా! స్త్రీల గురించిన నా ఆలోచన తప్పని తెలుసుకుంటున్నాను. నన్ను నేను మార్చుకుంటున్నాను!" పక్కకు తిరుగుతూ అన్నాడు స్వరోచి.

"కానీ! ఈరోజుల్లో కూడా శృంగారం మొక్కుబడిగా గాక, ఓ తపస్సులా భావించి నాతో ఓర్పుగా ఉన్నారే! మీరు గొప్పవారే!" అంది, ఆమె కూడా అతనిని మురిపెంగా చూస్తూ!

మంచానికి కట్టిన పూలచెండు తెగి ఇద్దరి మీదా పడి ఫక్కున నవ్వింది.

# జ్ఞానప్రదాత

ఎం. ఏ. పద్మనాభరావు
9848607127

***పూలదండ వేసాడు. పట్టుశాలువ కప్పాడు. కొంత డబ్బు ఆయన చేతిలో పెట్టాడు. చేతిలో పెట్టిన డబ్బును చిత్రంగా చూసారు. పాదాభివందనం చేస్తున్న ఈశ్వరరావుని వారించారు. దీంతో నాకేం పనన్నట్టుగా... ఆ డబ్బును తిరిగి అతని చేతులో పెట్టి, తన రిక్తహస్తాలను చూపించారు.***

ఉదయం తొమ్మిది గంటలు. ఈశ్వరరావు బాల్కనీలో కూర్చున్నాడు. అతని ఇంటి ఎదురుగానున్న స్కూలు గంట గణగణమని మోగింది. పిల్లలందరూ బిలబిలలాడుతూ లోపలికి వెళ్తున్నారు. స్కూలు కళకళ లాడుతోంది పిట్టలు వాలిన పచ్చని చెట్టులా.

బోయవాడి వలలో చిక్కుకున్న పావురం మల్లే అతని మనసు గతించిన స్మృతులలో చిక్కుకుంది. అతని మనోఫలకంపై బాల్యం ఓ పచ్చని చిగురై విరిసింది.

★★★

ఉదయం తొమ్మిది గంటలు. స్కూలుగేటు బార్లా తెరిచారు. గంట గణగణమని మోగింది. పిల్లలందరూ బిలబిలలాడుతూ లోపలికి వెళ్తున్నారు. కొంతమంది అమ్మానాన్నల చేయి పట్టుకుని మొదటిసారి స్కూల్లో అడుగు పెడ్తున్నారు. కొంతమందిని తండ్రులు, మరి కొంతమందిని తల్లులు దింపుతున్నారు. ఇంకొంతమంది వాళ్ళంతట వాళ్ళే వెడుతున్నారు.

ఆ రమణీయ దృశ్యాన్ని రెప్ప వేయకుండా చూస్తున్నాడు గేటు పక్కనే ఒదిగి నిల్చున్న ఈరిగాడు. చింపిరి జుట్టు, చిరిగిపోయిన బట్టలతో వాడిపోయిన పువ్వులా ఉన్నాడు. కానీ, వాడి కళ్ళల్లో ఒక ఆశ, గాలికి రెపరెపలాడుతున్న దీపంలా! రోజూ ఆ సమయంలో స్కూలు దగ్గర నిలబడి మెరిసే కళ్ళతో విరిసిన పువ్వుల్లా ఉన్న పిల్లల్ని చూస్తూ ఆనందం పొందుతాడు. వాడి అంతరంగంలో పైకి కనిపించని వేదన. ఆ చిన్ని బుర్రలో పొడుచుకొస్తున్న ఎన్నో ఆలోచనలు మట్టిలో మొలకెత్తుకొస్తున్న చిన్న చిన్న మొక్కల్లా!

“అయ్యా! నే ఇస్కూలు కెల్తానే. సదువుకుంతానే. మనం ఓపాలి ఆ ఇస్కూలు గేటు దాటి లోని కెల్దామే. అయ్యా... అయ్యా నన్నీస్కూల్లో సదివించు. నువ్వు సదూకున్నావా? నేదుగా? నాకేనా సదువు సెప్పించొచ్చుగా? యా పని సెయ్యడానికి నీకు ఇయ్య రాట్లేదెందుకు?” అయ్యతో అనాలనుకున్న మాటలు, గతుకుల రోడ్డు మీద గులకరాళ్లల్లా గొంతులోనే దిగబడి ఉండిపోతాయి. అవి బయటకొస్తే వాడి వీపు గతుకులు రోడ్డవుతుంది. వాడిని నాన్న కూలిపనులకు తీసుకుపోతాడు. స్కూలుకు వెళ్ళాలన్న వాడి ఆశ, వాడిని ఆ టైముకి రోజూ స్కూలు దగ్గరకు తీసుకొస్తుంది. అందరూ లోపలికి వెళ్ళేవరకు అక్కడే ఉంటాడు. కాసేపటికి అక్కడ నిశ్శబ్దం! అయ్యవార్లు చెప్పే పాఠాలు మాత్రం మెల్లిగా వినిపిస్తాయి. ఇక వాడు అక్కడి నుంచి కదలక తప్పదు. లేకపోతే నాన్న చేతిలో దెబ్బలు తినవలసిందే.

ఓ రోజు...

"ఒరేయ్ ఈరిగా! బేగే లెగు. లెగరా.... ఈ దినాం జల్దీ పోవాలె పనికి." ఈరిగాడిని లేపుతూ వాడి నాన్న వెంకటయ్య గదిమాడు.

ఇంకా తెలతెలవారుతోంది. ఈరిగాడికి కాసేపు నిద్రపోవాలనుంది. రోజూ తొమ్మిది దాటితే గాని పనికి పోని నాన్న ఈ రోజెందుకో కంగారు పడిపోతున్నాడు. ఇంకా గంట ఆరు అవుతుందేమో? "అప్పుడే పన్లోకా? ఏందయ్యా ఇంత జల్దీగా మనమెప్పుడు పోనేదుగా?" బద్ధకంగా అన్నాడు.

"ఎదవ పెస్నలేయమాకు! ఇయ్యాల ఇస్కూల్లో పనుంది. ఇస్కూలు పిల్లలు రాకుండా పని సేసేయ్యాల. బేగి లెగిసి తయారుగా!" ఆ మాటకు ఉరుక్కుని లేచాడు ఈరిగాడు. ఇస్కూల్లో పని. తన కోరిక ఈ రోజు ఈడేరుతోంది. లోకం తెలిసింకాడి నుంచి ఇస్కూల్లో ఏముంటాదో సూడాలని ఆశ వాడికి! తొందర తొందరగా తెమిలిపోయి నాన్న కోసం ఎదురు చూస్తున్నాడు ఈరిగాడు.

★★★

స్కూలు గేటును కొంచెం కొంచెం తీస్తూ అదిరే గుండెలతో లోపలికి అడుగెట్టాడు ఈరిగాడు వాడి నాన్న చేయి పట్టుకుని. లోపల తరగతి గదులను కళ్ళతో తనివితీరా చూసుకుంటూ అడుగులో అడుగేస్తున్నాడు. మొదటిసారిగా స్కూల్లోకి రావడం తన అదృష్టంగా మురిసిపోతున్నాడు.




"ఒరేయ్ ఈరిగా! ఏటా బిత్తరి సూపులు! నువ్వేం సదుకోడానికి రాలేదిక్కడకి... కూలి పని సేయడాని కొచ్చావు! ఆ గంప తీసుకుని అదిగో ఆ విసుక పట్రా." వెంకటయ్య అదిలింపుకు ఈరిగాడు బెదిరి, గంప కోసం ముందుకు పోబోయి ఆగిపోయాడు.

తెల్లని ధోవతి, మోచేతుల చొక్కా ధరించిన ఓ పెద్దాయన వాడికి ఎదురుపడ్డారు. నుదుట వీభూతి రేకలు, వాటి మధ్య ఎర్రని సూరీడులా వెలిగి పోతున్న కుంకుం బొట్టుతో బ్రహ్మత్వం ఉట్టిపడుతున్న ఆ పెద్దాయన ఆ క్షణంలో ఈరిగాడికి దేముడిలా అనిపించారు. వెనకనుంచి

ఎవరో తోసినట్టు గభాల్న ఆయన కాళ్ళమీద పడి సాష్టాంగ నమస్కారం చేసాడు. నిజానికి ఈరిగాడికి దేముడెలా ఉంటాడో తెలియదు.

'ఏంటీడు ఇట్టా సేసాడు?!' బిత్తరపోయిన వెంకటయ్య రెండు చేతులు జోడించి ఆయనతో, "సెమించండి బాబయ్యా, ఆడు తెలీక సేసిన పనికి సెమించండి." ప్రాధేయపడుతున్నట్టుగా అన్నాడు.

ఆయన ఈరిగాడిని పైకి లేపారు. తనని తాకిన ఆ చేతులు అమృతహస్తాలుగా తోచాయి వాడికి. కానీ, అవి జ్ఞానహస్తాలని వాడిని జ్ఞానమార్గంలోకి నడిపించడానికి అక్కడ వేచి ఉన్నాయని వాడికి తెలీదు. 'ఎవరీ పెద్దాయన? కొత్త సింతపండేసి తోమిన సెంబులా తళతళలాడి పోతున్నాడు. ఈ ఇస్కూలుకి పెద్ద పంతులేమో? వెంకటయ్య కూసింత తికమకలాడాడు. దైవనిర్ణయమో ఏమో కాని అతను అప్రయత్నంగా కొడుకును ఓ జ్ఞానసంపదకు చేరువుగా తీసుకొచ్చాడు. ఈరిగాడ్ని పట్టుకున్నాయన వెంకటయ్యను తీక్షణంగా చూసాడు.

"ఈ పిల్లాడిచే పనులు చేయిస్తున్నావా? బలపం పట్టుకోవాల్సిన చేతులు గునపం పట్టుకునేలా చేస్తావా? వీడిని

చదువుకు దూరం చేస్తున్నావా? అసలు నీకు బుద్ధుందా? విద్య లేనివాడు వింత పశువు. వీడిని బడికి పంపి, ఓ మనిషిని చెయ్యి. ఈ రోజు నుంచి వీడు చదువుకుంటాడు. వీడి బాధ్యత నాది!" గంభీరంగా అంటున్న ఆ పెద్దాయన ముఖంలోకి ధైర్యంగా చూడలేక "తమరిట్టమండి" చేతులు జోడించాడు వెంకటయ్య.

మట్టిపనులతో రాటుదేలిన ఆ పసిచేతులను తన గుప్పిట్లోకి తీసుకుని వర్ణక్రమాన్ని క్రమం తప్పకుండా దిద్దించారు ఆయన. అది ఈరిగాడి జ్ఞానసముపార్జనకు తొలి మెట్టు! ఆయన వాడి ఆదిగురువు.

ఈరిగాడి కష్టాలకు కత్తెర పడింది. కాలం రేపటి కోసం పరుగులు తీస్తూనే ఉంది. ఈరిగాడులాంటి వాళ్ళు ఎంతోమంది ఎదగడానికి నిచ్చెనలా ఉపయోగపడిన గురువు జీవితం, విద్యావ్యవస్థ పాలకుల నిర్లక్ష్య వైఖరికి గురై ఏమాత్రం ఎదుగుదల లేకుండా ఉండిపోయాయి.

★★★

విద్యావ్యవస్థను అవస్థలు పాలుచేస్తున్న పరిస్థితులు. స్కూల్లో ముగ్గురు పనిని ఒక్కరే చేస్తున్న గురువు, అలసిపోయి ఇంటికి చేరారు. వాకిట్లోనే అమ్మ ఆయాసం... ఆలి నీరసం... ఆయనను పలకరించాయి. పిల్లల ఆకలి చూపులు ఆయనను ఆపాదమస్తకం తడిమాయి. ఎందరి చేతనో అక్షరాల దిద్దించిన ఆ చేతులు భుజానున్న సంచిలో దూరి 'అ' ని దిద్దాయి పిల్లల తాయిలాల కోసం! ఉద్యోగ బాధ్యతా, జీవితపు బరువుల కింద వెతికితే దొరికాయి రెండు పిప్పరమెంట్లు, ఆయన చిన్నతల్లికి, బుజ్జి నాన్నకు. నిత్యం ఎంతో మందికి ఓనమాలు నేర్పి... తన ఆనవాలు మర్చిపోతాడాయన అప్పుడప్పుడు... నిశబ్దంగా చొక్కా విప్పి కొక్కేనికి తగిలించారు. నల్లబోర్డుకు అతుక్కున్న తెల్లసుద్దలా చొక్కాకు అతుక్కునున్న జేబు బరువులేక ఇంటిల్లిపాది ఆశలను తనలో దాచుకుంది. జీతమందుకుని వారమే అయింది. ఈ బక్కప్రాణి మళ్ళీ ఇంకో మూడు, నాలుగు నెలల వరకు జీతంరాళ్ళ కోసం ఎదురు చూడక తప్పదన్నట్టు గోడకి వ్రేలాడుతున్న కేలండర్ ఆయనను జాలిగా చూసింది. కష్టాలెన్ని ఉన్నా కాలం ఆగిపోతుందా ఏమిటి? రేపటి కోసం పరుగులు తీస్తూనే ఉంటుంది. రేపటి ఆశ... ఆయన చేత జీవనచక్రాన్ని దొర్లిస్తూనే ఉంటుంది. అలా ఒకరి తర్వాత ఒకరు అవిశ్రాంతంగా ఆయన సహకారాన్ని

ఆశిస్తూనే ఉంటారు! ఆయనెప్పుడూ ఇంకొకరి ఉన్నతిని కోరుకుంటారు. ఆయన జీవితం, జీతం మాత్రం ఎటువంటి మార్పుకు నోచుకోదు. ఈరిగాడు ఇప్పుడు ఈశ్వరరావు అయ్యాడు. పట్టుదలతో విద్యనభ్యసించాడు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు. తన గురువుకి దూరమయ్యాడు. మారుతున్న లోకరీతి కనుగుణంగా మానాభిమానాలను పరిత్యజించి జీవితంలో పైపైకెదిగాడు.

★★★

మళ్ళీ గంట గణగణ మంది. తీయని గతం దూరమైంది. ఈశ్వరరావు వాస్తవంలోకి మారాడు. 'విలువలను తాకట్టు పెట్టి జీవితంలో ఎదిగాను. డబ్బు... డబ్బు. డబ్బే లోకంగా బ్రతికాను. సౌఖ్యాలను అనుభవించాను. బాధ్యతల నుంచి విముక్తి పొందాను. సంపాదనే ధ్యేయంగా శ్రమించిన నాకు విశ్రాంతి దొరకలేదు. సంపాదించిన సొమ్ము సుఖాన్నిచ్చింది కాని, మనశ్శాంతిని ఇయ్యలేకపోయింది. మనుష్యులను, మమతలను దూరం చేసింది. ఇప్పుడు డబ్బు తప్ప మరెవరూ లేని ఒంటరిని. అశాంతి అలుముకున్న నిర్భాగ్యుడిని.' ఈశ్వరరావు ఆవేదనతో కుమిలిపోతున్నాడు.

'దైవ స్వరూపులు, జ్ఞానదాతలు గురువులకు మా వందనం. వారికి గురుదినోత్సవ శుభాకాంక్షలు.' స్కూలు గేటుకు బేనర్లు రెపరెప లాడుతున్నాయి. "జీవితంలో అంత్యంత విలువైన వ్యక్తులకు ఒక రోజు కేటాయించి గౌరవించుకునే వారికి గురువు విలువ ఎలా తెలుస్తుంది...? గురువంటే శిష్యులను ఉన్నతంగా తీర్చి దిద్దడానికి తన జీవితకాలాన్ని వెచ్చించేవారు. గురువంటే అత్యున్నత స్థానంలో ఉండి అనునిత్యం స్మరణ కొచ్చేవారు. గురువే దైవం. ప్రతి ఒక్కరి జీవనయానంలో ఎంతోమంది గురువులుంటారు. కాని, గురుస్థానం మాత్రం ఒక్కరికే! అక్షరాలూ దిద్దించిన మహానీయునికే ఆ స్థానం. 'నన్ను తీర్చి దిద్దిన ఆయన ఇప్పుడెక్కడున్నారో? ఎలా ఉన్నారో? ఆయనను కలుసుకోవాలి... నేనెంత ఎదిగానో ఆయనకు చెప్పాలి. నా డబ్బుతో ఆయన్ని సత్కరించాలి, సన్మానించాలి, గౌరవించాలి. తనలో రగులుతున్న అశాంతి జ్వాలలకు పరిష్కారం తెల్సుకోవాలి.' అనుకున్నదే తడవుగా ఆయన ఆచూకీ తెల్సుకున్నాడు ఈశ్వరరావు. ఆ జ్ఞానప్రదాత దర్శనానికి తహతహలాడుతూ వెళ్ళాడు. గురుదర్శనం ప్రాప్తించింది ఈశ్వరరావుకి.

'అదే ఇల్లు... అదే రూపం. ఆయనలో మార్పు లేదు. మార్పంతా నాలోనే... ఆయన అలాగే అణుకువగా, వయోభారంతో వంగిపోయి...!' స్వగతంలో చింతించాడు. పూలదండ వేసాడు. పట్టుశాలువ కప్పాడు. కొంత డబ్బు ఆయన చేతిలో పెట్టాడు. చేతిలో పెట్టిన డబ్బును చిత్రంగా చూసారు. పాదాభివందనం చేస్తున్న ఈశ్వరరావుని వారించారు. దీంతో నాకేం పనన్నట్టుగా... ఆ డబ్బును తిరిగి అతని చేతులో పెట్టి, తన రిక్తహస్తాలను చూపించారు. నిశ్చేష్టుడయిన ఈశ్వరరావు చేతిలోకి చేరిన డబ్బు అతని అహంకారానికి, అవివేకానికి ప్రతిరూపంగా రెపరెపలాడుతోంది. రిక్తహస్తాలను చూపిస్తున్న ఆయన వదనంలో జ్ఞానం, నిర్మలత్వం తళతళలాడుతున్నాయి. ఈశ్వరరావులో అలుముకున్న అజ్ఞానం అతని ఎదుట నిలిచి వికటాట్టహాసం చేస్తోంది. ఆయన ప్రశాంతంగా నవ్వారు. నిన్ను కలవరపెడ్తున్న అశాంతికి కారణం తెలిసిందా అన్నట్టుగా ఉందా నవ్వు...! తనకు మరోసారి జ్ఞానాన్ని ప్రసాదించిన ఆ జ్ఞానహస్తాలను వినయంగా స్పృశిస్తూ ఆయన పాదాలకు ప్రణమిల్లాడు ఈశ్వరరావు.

# వెలుతురు దారి

**శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు**
✆ 9912848738

***ఈ బ్రతుకు ప్రయాణంలో అందరకూ అన్నీ దొరకవు. దొరికిన దాంతో సంతృప్తిపడుతూ, కావలసిన దానికోసం త్రికరణశుద్ధిగా ప్రయత్నించాలి. కచ్చితంగా సత్ఫలితం సిద్ధిస్తుంది, కాస్త ఆలస్యంగానైనా!***

నెలరోజుల క్రితమే వసంతకు వివాహం జరిగింది. ఆమెకు తన ప్రాణస్నేహితురాలు ఆరాధ్య జ్ఞాపకం వచ్చింది. ఆమె ఆరాధ్యను తన పెళ్లిరోజు తర్వాత చూసిందీ లేదూ, మాట్లాడిందీ లేదు.

ఆరోజు వసంతకు కాసింత వెసులుబాటు దొరకడంతో ఆరాధ్యకు కాల్ చేసింది. ఆరాధ్యకు ఆరోజు ఆఫీసు లేకపోవడంతో ఇంట్లోని సామానులను ఓ పద్ధతిగా సర్దుకుంటోంది. అప్పుడే ఆమె సెల్ ఫోన్ మోగటంతో స్క్రీన్ వైపు నిరాసక్తిగా చూసింది. ఆ కాల్ వసంత నుండి కావడంతో ఆరాధ్యలో ఒక్కసారిగా ఆనందం వెల్లువలా ఉరకలేసింది.

ఆరాధ్య ఉత్సాహంగా వసంత కాల్ లిఫ్ట్ చేస్తూ "హాయ్, కొత్త పెళ్లికూతురా... ఎలా ఉన్నావు? కొత్త కాపురం ఎలా ఉందేంటి? కొత్త కాపురంలో పడి నన్ను పూర్తిగా మర్చిపోయావా?" అంటూ ఎంతో ఆరాటంగా ప్రశ్నల వర్షం కురిపించింది.

ఆరాధ్య ప్రశ్నలకు వసంత, చిన్నగా నిట్టూరుస్తూ "ఏదోలే అలా సాగిపోతోంది! అది సరే నేను కాల్ చేస్తే గానీ మాట్లాడవా? పాపం తనకి కొత్తగా పెళ్లయింది, ఏ ఇబ్బందులు పడుతోందోనన్న ఆలోచన ఏమైనా నీకుందా?" చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ అంది.

"అదేం లేదు, వసూ! ఆఫీస్ పనులు, ఇంటి పనుల ఒత్తిడిలో పడిపోయి అస్సలు వీలు కుదరడం లేదు. కొత్తకాపురం మోజులో పడి, నన్ను సొంతం మర్చిపోయింటావు అనుకున్నాను. అదీగాక కొత్తగా పెళ్లయింది కదా, కాల్ చేసి మిమ్మల్ని డిస్టర్బ్ చేయడం ఎందుకని! ఈరోజో, రేపో నేనే కాల్ చేద్దామనుకున్నాను. నా మనసులోని ఆరాటాన్ని ఇట్టే పసిగట్టినట్టుగా నువ్వే చేసావు. అదిసరే 'ఏదో సాగిపోతోంది...' అంటూ అంత నిరాసక్తంగా మాట్లాడుతున్నావు. ఏదైనా సమస్యా..." వసంతకు కాస్త వివరణ ఇస్తున్నట్టుగా చెపుతూ, ఆమె కొత్త జీవితం గూర్చి ఆరాతీస్తూ అడిగింది ఆరాధ్య, కాస్త అనుమానంగా.

"చెప్పాలంటే చాలా వున్నాయి. అవన్నీ ఫోన్లో చెప్పేవి కావు. చాలా మాట్లాడాలి. బైట కలుద్దామా? నీకు వీలవుతుందా?" అడిగింది వసంత.

తనలాగే తన స్నేహితురాలు కూడా ఖచ్చితంగా ఏవో సంసార సమస్యలతో సతమతమవుతోందని ఆరాధ్యకు స్పష్టంగా అర్థమైంది. మరో ఆలోచనకి తావులేకుండా వెంటనే వసంతను కలుసుకోవడానికి సరేనంది.

వసంత, ఆరాధ్య... ఇంటర్ నుంచి డిగ్రీ వరకూ ఒకే కాలేజీ, ఒకే తరగతి, ఒకే సెక్షనల్లో కలిసిమెలిసి చదువుకున్నారు. ఇద్దరూ తమ మధ్య ఎటువంటి అరమరికలు లేకుండా ఒకరికొకరు అన్ని విషయాలు షేర్ చేసుకుంటు ఉండేవారు. ఇద్దరిది ఎటువంటి పొరపొచ్చాలులేని మంచి స్నేహబంధం!

తమ డిగ్రీలు పూర్తిచేసుకున్న కొంత కాలానికి ఇద్దరికీ మంచి సంబంధాలు రావడంతో ఆరునెలల వ్యవధిలో వారి వివాహాలు జరిగిపోయాయి. ఆరాధ్యకు వివాహం జరిగి అరునెలలు అయితే, వసంతకు ఓ నెల రోజుల క్రితమే పెళ్లయింది. అదృష్టవశాత్తూ ఇద్దరూ ఒకే సిటీలోనే కాపురాలు చేసుకుంటున్నారు.

★★★

ఉదయం పదిగంటలు కావస్తోంది.

ఆరోజు పబ్లిక్ హాలిడే కావడంతో ఆ సాగరతీరం జనసాంద్రతతో కాస్త కలివిడిగానూ, సందడిగానూ వుంది. వసంత, ఆరాధ్యలూ అక్కడి ఇసుకతిన్నెలపై పక్కపక్కనే కూర్చున్నారు. ఇద్దరూ కొద్దిసేపు నిర్వికారంగా సముద్రం వైపు చూస్తూండిపోయారు. ఇద్దరిలోనూ తమ జీవితాల్లో విలువైందేదో కోల్పోయిన అనిర్వచనీయమైన భావన. వేదనతో బరువెక్కిన హృదయాలను వారిమొహాలు కొట్టొచ్చినట్టుగా ప్రస్ఫుటింపజేస్తోన్నాయి.

ఆరాధ్య ముందుగా తన గొంతు విప్పుతూ "ఏమయ్యింది వసూ? ఇప్పుడైనా చెప్తావా... లేదా?" ఆరాధ్య అసహనంగా ప్రశ్నించింది.



ఆరాధ్య అడిగినదానికి వసంత ఏమీ మాట్లాడకుండా చలనం లేని శిలలా మౌనంగా ఉండి పోయింది.

వసంత నిశబ్దం ఆరాధ్యను మరింత ఆందోళనకు గురిచేసింది. "ఏదైనా నోరు తెరిచి చెప్తే కదా తెలిసేది! మౌనం సమస్యను నిరోదించలేదు. కమాన్ స్పీకౌట్..." అంటూ వసంతపై విరుసుకుపడింది.

స్నేహితురాలి సహనానికి పరీక్ష పెట్టడం ఇష్టంలేనట్టు వసంత నెమ్మదిగా తన గొంతు చిన్నగా పెగుల్చుకుంది. "అదే ఆరాధ్యా, సాగర్ చాలా చిత్రంగా మాట్లాడుతున్నాడు..." అంటూ కొన్ని క్షణాలుఆగి, మళ్ళీ నెమ్మదిగా చెప్పడం కొనసాగించింది.

"జీవితంలో ప్రేమ అనేది ఒక ముసుగూ, వట్టి బూటకం... అంటూ విపరీత ధోరణితో మాట్లాడుతున్నాడు. ప్రేమ కంటే బాధ్యత గొప్పదంటాడు. నువ్వే చెప్పు భార్యాభర్తల అనుబంధానికి 'ప్రేమ' అనే అపురూపమైన భావన, బంధం... లేకుండా

అన్యోన్యమైన దాంపత్యానికి ఎక్కడైనా చోటుంటుందా!” అంటూ వసంత, తన సమస్యను ఆరాధ్య ముందు నెమ్మదిగా బయటబెట్టింది.

వసంత చెప్పినదానికి ఆరాధ్య కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దంగా ఉండిపోయింది. కొద్దిసేపటి తర్వాత తేరుకుని “నిన్ను అతను ప్రేమగా చూసుకుంటున్నాడు కదా!” కళ్ళు పెద్దవిగా చేసుకుని కాస్త అనుమానంగా అడిగింది.

“ఆ... బాగానే చూసుకుంటున్నాడు. నేను ఏది కోరినా గుర్తు పెట్టుకుని క్షణాల్లో కాకపోయినా, వీలుచేసుకుని తప్పకుండా తెచ్చిపెడ్తాడు. ఎక్కడకు తీసుకెళ్లమంటే అక్కడకు తీసుకెళ్తాడు. కాకపోతే ప్రతీదానికి ఒక సమయం, తేదీ అంటూ నిర్ణయిస్తాడు. పద్ధతీ, టైమ్‌టేబుల్ ప్రకారం అన్నీ అమలు పరుస్తుంటాడు. కాకపోతే దేనికీ లోటుచేయడు! కాకపోతే ఇదంతా ‘ప్రేమ’ కాదు. కేవలం ‘బాధ్యత’ మాత్రమే అంటాడు. అంతే కాదు... ప్రేమ కంటే చాలా బాధ్యత గొప్పదంటాడు. వాడు మనుషుల కంటే బాధ్యతలను ప్రేమిస్తుంటాడు. బాధ్యతలంటే అంతగా ప్రాణం పెడతాడు! వెరసి ప్రేమ అనేది ఒక ముసుగూ, డ్రామా అంటుంటాడు. డివోర్స్ తీసుకుందామని అనుకుంటున్నాను!” అంటూ వసంత, ఆరాధ్య సమాధానం కోసం ఆమెకేసి బేలగా చూసింది.

వసంత చెప్పినదంతా విన్న ఆరాధ్య, కాసేపు ఏమి మాట్లాడాలో అర్థంకాక, ఆలోచనల్లో గాఢంగా కూరుకుపోయింది.

ఆరాధ్య మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్న వసంత “ఇప్పుడు అర్థమైందా, నా సమస్య ఎంత క్లిష్టమైందో? వింటేనే విచిత్రంగా అనిపిస్తోంది కదూ?” ఆరాధ్యని గట్టిగా ప్రశ్నించింది.

వసంత అడిగినదానికి ఆరాధ్య కించిత్తైనా స్పందన లేకుండా చాలాసేపూ అలాగే స్తబ్దుగా ఉండిపోయింది. “నిశ్శబ్దం సమస్యకు పరిష్కారం కాదని చెప్పి, నువ్వలా నోరు మెదపకుండా ఉంటే ఎలా?” అంటూ వసంత స్నేహితురాలి భుజాన్ని గట్టిగా తట్టింది కాస్త భయంగా.

వసంత కుదుపుతో ఒక్కసారిగా ఆలోచనల్లోంచి బయటపడ్డ ఆరాధ్య, చిన్నగా నిట్టూర్పు వదుల్తూ, నిస్తేజంగా నవ్వింది. ఆమె నవ్వులో అర్థం కాని ఎన్నెన్నో అర్థాలు స్ఫురిస్తున్నాయి.

ఆరాధ్య ఆ కాస్త నవ్వడంతో వసంత హాయిగా ఊపిరి పీల్చుకుంది, ఉపశమనంగా! కానీ ఆరాధ్య అలా ఎందుకు నవ్విందో వసంతకు కించిత్ కూడా అర్థం కాలేదు.

“వసూ...నువ్వు చెప్పింది వింటుంటే, వ్యతిరేక దిశలో నీ జీవితపు అద్దంలో నన్నునేను చూసుకున్నట్టు చాలా విభిన్నంగానూ, విచిత్రంగానూ అనిపిస్తోంది!” అంది ఆరాధ్య.

“ఆరాధ్యా, నా టెన్షన్ నీకు చెప్పుకుందామని వస్తే, అర్థం కాని విధంగా ఏదేదో చెప్తూ నన్ను మరింత టెన్షన్ పెడతావేంటి! స్పష్టంగా కాస్త అర్థమయ్యేటట్టు సూటిగా చెప్పు!” అంటూ వసంత స్నేహితురాలిపై చిటపటలాడుతూ చిరుకోపాన్ని ప్రదర్శించింది.

“సారీ వసూ! నిన్ను చేసుకున్నవాడు అలా మాట్లాడితే, నా భర్త అందుకు పూర్తి విరుద్ధం! అవును, నా భర్త మిన్ను వచ్చి మీద పడ్డా దేనికి స్పందించడు! చలించడు! అనునిత్యమూ ప్రేమ, కేరింగ్... అంటూ నా వెంటే పడుతూ, పిచ్చిపిచ్చిగా

ఆరాధిస్తుంటాడు.'' అంటూ ఆగి, వసంత వైపు చూసింది ఆరాధ్య.

''మరింకేమి? హ్యాపీగా ఎంజాయ్ చేయకుండా అలా మాడిపోయిన ముఖం పెడతావేమి?'' అంటూ వసంత ఆశ్చర్యంగా అడిగింది.

స్నేహితురాలి మాటలకు ఆరాధ్య చిన్నగా నిట్టూరుస్తూ ''నీకు నేను చెప్పింది ఒక పక్కే అర్థమైంది. పూర్తిగా చెబుతా విను…'' అంటూ మళ్ళీ చెప్పబోతుండగా–

వసంత, ఆమె మాటలకు అడ్డంపడుతూ– ''అర్థమయింది, నీ పేరు ఆరాధ్య కదా! అందుకే మీ ఆయన నిన్ను అంతగా ఆరాధిస్తున్నాడేమో!'' అంది ఛలోక్తిగా ముసిముసి నవ్వులు చిందిస్తూ, తమమధ్య నెలకొన్న ఆ బరువైన వాతావరణాన్ని కాస్త తేలికపరుస్తున్నట్టుగా.

''ఏమి ఆరాధించటమేమో గానీ, అతను ఏ విషయాన్ని సీరియస్ తీసుకోడు. దేని గురించి బాధ్యతగా ఆలోచన చేయడు! ప్రతీ విషయంపట్ల విపరీతమైన నిర్లక్ష్యం. ఏదెలా జరగాలని ఉంటే అలా జరుగుతుందంటాడు. మొత్తానికి అన్ని విషయాలపట్ల చెప్పలేనంత ఉదాసీనంగా వ్యవహరిస్తుంటాడు! ఎల్లప్పుడూ నేనంటే అంతులేని 'ప్రేమ.., ఇష్టం…' అంటూ లెక్కలకుకందని కబుర్లు చెబుతుంటాడు. అతను చేస్తోన్న ఆ చిన్న ప్రయివేటు ఉద్యోగానికి సంపాదించే జీతం మొత్తం, అతని ఖర్చులకే సరిపోదు. ఎప్పుడూ సినిమాలూ, షికార్లూ, వీకెండ్ ఔటింట్స్, మల్లెపూల పరిమళాలూ, వెన్నెలమాసం, తొలకరి జల్లులూ… అంటూ ఏవేవో తీపిమాటలు చెబుతూ, నా శాలరీలో సగానికి మించి డబ్బుని వృధా చేయిస్తుంటాడు! అప్పటికీ నేను.. 'రేపు అనే దాని గురించే ఆలోచించాలి కదా' అంటే, రేపు అనేది నిజం కాదు. మన కళ్ళముందున్న 'నేడు మాత్రమే యథార్థం' అంటూ కల్లబొల్లి నిర్వచనాలు వల్లె వేస్తుంటాడు. నాకూ నీలాగే డివోర్స్ దిశగా ఆలోచనలు పోతున్నాయి!'' అంటూ ఆగి, ఆరాధ్య నిస్సహాయిత నిండిన నిర్వేదంతో చిన్నగా నిట్టూర్చింది.

''అయితే మన ఇద్దరి బ్రతుకులు, అర్థం కాని వ్యర్థజీవితాలు అన్నమాట! నీకు దక్కింది నాకు లేదు. నాకు కలిగింది నీకు దక్కడం లేదు!'' అంది నిర్వేదంగా కఠోర జీవనసత్యాన్ని వెల్లడిచేస్తున్నట్టుగా.

''అవును, నువు అంటున్నది నూటికి నూరుశాతం వాస్తవం! ఇద్దరివీ పరిపూర్ణవంతమైన జీవితాలు కావు! మనవి శాపగ్రస్త బ్రతుకులు!'' అంది ఆరాధ్య, వసంత మాటలకు మరింత మద్దతును ప్రకటిస్తున్నట్టుగా.

తమ జీవితాలు అలా అసంపూర్ణంగా, నిస్సారంగా మారిపోయినందుకు విచారవదనాలతో దీనంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అప్పటికే ఇద్దరు కళ్ళల్లోంచి నీళ్లు తన్నుకొస్తున్నాయి. భారమైన బాధాతప్త హృదయాలతో ఒకరినొకరూ ఓదార్చుకున్నారు.

ఆ బీచ్‌లో వారిరువురూ మినహాయించి, అందరూ ఆనందంతో కేరింతలు కొడుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా కనిపిస్తున్నారు.

ఇద్దరూ చాలా సేపు ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. వారి గుండెలు వేదనతో భారంగా మారిపోయాయి.

కొన్నినిమిషాల అనంతరం ఆరాధ్య గాఢంగా ఘనీభవించిన స్తబ్దతను ఛేదిస్తూ, "మనం మన జీవితాలను మార్చుకోవాలి. అర్జంటుగా మన భర్తలను ఎవరైనా మంచి సైకియాట్రిస్ట్‌కు చూపించి, మనకు నచ్చిన విధంగా వారిలో మానసిక మార్పు తీసుకువచ్చి, మన జీవితాలను మనమే సరిదిద్దుకోవాలి!" అంది దృఢంగా.

"అవును, నువ్వు చెప్తున్నది అక్షరసత్యం! మన భర్తలను మనమే దారిలో పెట్టుకోవాలి! నీకు గుర్తుందా... మన ఫ్రెండ్ రాజేష్ మన కాలేజీ ప్రోగ్రామ్స్ కి అప్పుడప్పుడు తన అక్కయ్యని తీసుకువచ్చేవాడు. వాడితో పాటే మనమూ తనని 'అక్కా' అంటూ పిలిచేవాళ్ళం. అప్పుడు తను హైదరాబాద్ ఉస్మానియాలో సైకాలజీలో ఎమ్మెస్సీ చేస్తోందని చెప్పాడు. గుర్తొచ్చిందా! వాడి ఫోన్ నెంబరు నీ దగ్గర వుందా?" అంటూ ఆసక్తిగా అడిగింది వసంత, తమ సమస్యకు పరిష్కారమార్గం దొరికేసినట్టుగా.

"వాడి నెంబరు నా దగ్గర ఉంటుంది. వాడిని అడిగితే సునీతక్క గురించి ఏమైనా తెలుస్తుందేమో?" అంటూ ఆరాధ్య తన సెల్ ఫోన్లో రాజేష్ నెంబరు కోసం వెదకసాగింది. రాజేష్ ఫోన్ నెంబరు కనిపించగానే "వసూ, కాల్ చేసి వాడితో మాట్లాడనా ?" అంటూ ఆరాధ్య కాస్త సంశయంగా అడిగింది వసంతని.

"డాక్టర్ మనకు తెలిసిన వారయితే బాగుంటుంది. అన్ని విషయాలు స్వేచ్ఛగా క్లారిఫై చేసుకోవచ్చు. ఆ సునీతక్క ఇప్పుడెక్కడుందో...ఏమిచేస్తోందో...ముఖ్యంగా తన ఫోన్ నెంబరు అడుగు!" అంటూ వసంత, ఆరాధ్యని ఉత్సాహపరిచింది.

వసంత చెప్పినట్టుగానే ఆరాధ్య, రాజేష్‌కు కాల్ చేసి, సునీత గురించి పూర్తి వివరాలు అడిగింది. సునీతక్క సైకియాట్రిస్ట్‌గా కొంతకాలం హైదరాబాద్ లోనే ప్రాక్టీస్ చేసి, గత ఆరునెలలుగా విశాఖపట్నంలోనే ఆమె స్వంతంగా ఓ క్లినిక్ నడుపుకుంటోందని, ఆ హాస్పిటల్ లొకేషన్, ఆమె ఫోన్ నెంబరు షేర్ చేస్తానంటూ రాజేష్... వసంత, ఆరాధ్యలకు అంతులేని ఉపశమనాన్ని కలిగించాడు.

ఉన్నపళంగా ఇద్దరూ రాజేష్ పంపించిన ఫోన్ నెంబరుకు కాల్ చేసి, "హాయ్ సునీతక్కా..." అంటూ తమ పూర్వపరిచయాన్ని డాక్టర్ సునీతకు వివరంగా చెప్పి, గుర్తు చేసారు. సునీత వెంటనే వారిని తనుండే క్లినిక్‌కి వచ్చేయమంది. పదినిముషాల్లో అక్కడుంటామని చెప్పి, క్లినిక్‌కి బయలుదేరారు.

కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, ఎమ్మెస్సీ, ఎమ్.డి., ఇంకా మరో రెండు డిజిగ్నేషన్స్ ఇంగ్లీష్ అక్షరాలతో అందంగా రాసిన పెద్ద గ్లోసైన్ బోర్డు చూసి, ఇద్దరు లోపలికి అడుగు పెట్టారు.

వారికోసమే ఎదురుచూస్తున్న డాక్టర్ సునీత ఇద్దరినీ ఆనందంగా ఆహ్వానించింది. చాలాకాలం తరువాత వాళ్ళని కలుసుకోవడం... సునీతతో పాటూ వసంత, ఆరాధ్యలు ఎంతో ఆనందానుభూతులకి లోనయ్యారు. కాసేపు తమ పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్న అనంతరం, "ఇప్పుడు చెప్పండి. ఇందాక ఏదో చెప్పారు. మీకొచ్చిన సమస్యలు ఏంటి?" తనదైన బాణీలో సునీత మృదువుగా అడిగింది.

ఇద్దరు తమ సమస్యని ఏకరువు పెట్టారు. వారు చెప్పినదంతా విన్న సునీత వారిద్దరినీ కాసేపు అభావంగా చూస్తూ ఉండిపోయింది. ఆమె ముఖంలో క్రమక్రమంగా రంగులు మారిపోయాయి.

"మీరిద్దరిదీ చిత్రవిచిత్రమైన ఒకటే సమస్య! తప్పకుండా దీనిగురించి కౌన్సెలింగ్ అవసరం ఎంతైనా వుంది" అంటూ సునీత వారిద్దరినీ తేరిపార చూసింది.

“అలాగే, సునీత అక్కా... మా భర్తలను ఎప్పుడిక్కడకూ తీసుకురమ్మంటావు?” అడిగింది వసంత ఆత్రుతగా.

“వాళ్ళు రావక్కర్లేదు. కౌన్సిలింగ్ అవసరం వాళ్లకు కాదు, మీకు!” వాళ్లకు తెలియని రహస్యాన్ని వెల్లడి చేస్తున్నట్టుగా అంది సునీత.

సునీత మాటలకు ఇద్దరూ తెల్లమొహాలు వేసుకుని, ఒక్కసారిగా నివ్వెరపోయారు. తాము వింటున్నది నిజమా, అబద్ధమా అన్నట్టుగా ఏమిమాట్లాడాలో అర్థంకాక సునీత వైపు ఆశ్చర్యంగా చూశారు.

అప్పటికే వారి అవస్థను గమనించిన ఆమె చిన్నగా నవ్వుతూ చెప్పసాగింది “అవును, మీరు విన్నది పచ్చినిజం. ఈ సృష్టిలో ఏ ప్రాణికీ కష్టం లేకుండా మనుగడ సాగదు. అలాగే ప్రతిమనిషికీ తను కోరుకున్న ప్రతీది దొరకదు. దొరికినదానితో రాజీపడి బ్రతకమని చెప్పడం ఉద్దేశ్యం కాదు! అజ్ఞానంతో చేతికి అంది వచ్చిన బంగారంలాంటి జీవితాల్ని చేజార్చుకోవద్దన్నదే నా అభిమతం! మీరు మీ భర్తలను కాస్త సంయమనంతో ఇంకాస్త ప్రేమను పంచి మీకు నచ్చినట్టుగా మలుచుకోవడానికి చాలా అవకాశముంది. అంతేగానీ జీవితమే పోయిందన్నట్టుగా, మీపై మీరు సానుభూతిని ప్రకటించుకుంటూ, ఇతరుల సానుభూతి కోసం వెంపర్లాడ్డం అంతకన్నా హేయం మరొకటి ఉండదు!” అంటూ సునీత ఇద్దరి వైపు చూసి, “అన్నట్టు... నా గురించి మీకనిపించింది ఓ నాలుగు ముక్కల్లో చెప్పండి!” అంది.

“నీ గురించి చెప్పడానికేముందక్కా... విలాసవంతమైన దర్జా జీవితం! మీ భార్యాభర్తలిద్దరూ రెండు చేతులా దండిగా సంపాదిస్తున్నారు. నీ లైఫ్ మూడు కార్లు, ఆరు బంగ్లాలుగా సాగిపోతోంది!” అంది ఆరాధ్య.

“నా గురించి మీరే కాదు ఎవ్వరైనా ఇలాగే అనుకుంటారు. నా జీవితానికి ఆవలితీరాన లోతైన అగాధం దాగివుంది. మా వారు ధనార్జనే ధ్యేయంగా బ్రతుకుతుంటారు. మాకు కావలసిన దానికన్నా ఎక్కువే వుంది.

ఆయనకు నాతో రోజులో రెండు నిముషాలు కూడా మాట్లాడానికి టైమ్ దొరకదు. ఇద్దరమూ ఒకే ఇంట్లో ఉన్నా, ఏ రెండుమూడు రోజులకొకసారి మాత్రమే కనిపిస్తుంటారు. అనునిత్యం కేసులు, సర్జరీలు... ఉరుకులూ, పరుగులూ పెడుతుంటారు! డబ్బు వ్యామోహంలో పడి నాతో ఇక్కడ ఈ హాస్పిటల్‌ను తెరిపించారు. నిత్యం అనుబంధాలూ, ఆప్యాయతల కోసం పరితపించే నేను, నా వాళ్లంతా ఇక్కడే ఉన్నారని నేనూ సరేనన్నాను. నేనిక్కడ విశాఖపట్నంలో... అతనక్కడ హైదరాబాదులో! మనకున్నది చాలు అనీ, అందమైన జీవితాన్ని అనుభూతులతో నింపుకుందామని ఎన్నోసార్లు మొత్తుకున్నాను. నా మాటని లక్ష్యపెట్టకుండా ‘ట్వంటీ ఫోర్ ఇంటూ సెవెన్’ డబ్బు కోసమే వెంపర్లాడుతుంటారు. అందరికీ బంధాలు, అనుబంధాలు గురించి అపురూపంగా చెప్పే నాకు... అవేవీ ఆయనవల్ల నా జీవితానికి దరిచేరలేదు. ప్రతీదానికి ఒక ద్వారం మూసుకుపోయినా, మరొక ద్వారం తెరిచే ఉంటుంది. సరియైన సానుకూల దృక్పథంతో దాన్ని గుర్తించగలగాలి. మీ భర్తల ద్వారా మీకు లభిస్తున్న ప్రేమగానీ, బాధ్యతగానీ నేను నా భర్త నుండి ఏ కోశానా పొందలేకపోయినా, కావాల్సినంత డబ్బు, హోదా... నాకు సంతృప్తిని ఇవ్వకపోయినా సంతృప్తిగానే, నా జీవితాన్ని కొనసాగిస్తున్నాను! ఈ బ్రతుకు ప్రయాణంలో అందరకూ అన్నీ దొరకవు. దొరికిన దాంతో సంతృప్తిపడుతూ, కావలసిన దానికోసం త్రికరణశుద్ధిగా ప్రయత్నించాలి. కచ్చితంగా సత్ఫలితం సిద్ధిస్తుంది, కాస్త ఆలస్యంగానైనా! అప్పటికీ మీ భర్తల్లో మార్పు సిద్ధించకపోతే, అప్పుడు వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ఓ ప్రయత్నం చేద్దాం. అంతేగానీ విడాకులు, విస్తరాకులనీ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు! నాకు కావాల్సిన అనుభూతులూ, అనురాగాలూ అన్నీ... నా కూతురూ,

అమ్మానాన్నలూ, బంధుమిత్రులు ద్వారా పొందుతూనే వున్నాను. నా వంతు సమాజసేవగా కొన్ని ఆర్గనైజషన్స్ ద్వారా ఉచిత వైద్యాన్ని అందిస్తూ, అంతులేని ఆత్మతృప్తినీ, ఆనందాన్నీ పొందగలుగుతున్నాను. అతన్ని నా మనసుకి దగ్గరగా చేర్చుకునే నా ప్రయత్నాన్ని ఎప్పటికీ వదులుకోను. ఏదొకరోజు అతను కచ్చితంగా నా కోసం మారితీరుతారు! కాస్త ఓపిక పట్టాలంతే!" నిశ్చలంగా అంది సునీత.

ఆమె ఆర్ద్రతతో తడిదేరిన తన కళ్ళను కర్చీఫ్‌తో తుడుచుకుంది. వసంత, ఆరాధ్యలు నిర్ఘాంతపోయి, కొన్ని క్షణాలపాటు ఆమెనే విస్తుపోయి చూస్తూండిపోయారు.

ముగ్గురి నడుమ గాఢమైన మౌనం చోటుచేసుకుంది. ఆరాధ్య, వసంతలూ తమ మధ్య నెలకొన్న నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ, "థాంక్స్, సునీతక్క! ఆవేశంతోనూ, అనాలోచితంతోనూ మకిలిపట్టిన మా మస్తిష్కాలకూ, జీవితాలకూ ఒక వెలుగుని చూపించావు. జీవితానికిగల రెండవ పార్శ్వాన్ని పరిచయం చేసావు!" అంటూ ఇద్దరూ తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

డాక్టర్ సునీత నుండి సెలవు తీసుకుని, తేలికపడిన హృదయాలతో అవాజ్యమైన నూతనోత్తేజాన్ని నింపుకున్న వసంత, ఆరాధ్యలు... తమ ఇళ్లకు ఉత్సాహంగా బయల్దేరారు, చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో!

# ఆకర్షణల వలలో...

**డా. మజ్జి భారతి**
✆ 9440615206

***తల్లులు చెప్పినా అమ్మాయిలు వినరా? లేకపోతే ప్రతిరోజు ప్రేమ పేరుతో మోసపోతున్న యువతుల గురించో, ప్రేమకోసం ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ల గురించో వార్తలెందుకుంటాయి? ఈ విషయంలో సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి. ప్రేమనేది జీవితంలో ఒక భాగమే కాని, అదే జీవితం కాకూడదని, ఆ పేరుతో మోసపోకూడదని అమ్మాయిలకి అవగాహన కల్పించాలి!***

ఇరవయ్యేళ్లు నిండి, సివిల్ సర్వీసెస్ నా లక్ష్యమని డిగ్రీ పూర్తిచేసి, సంవత్సరమై యూనివర్సిటీలో అడుగు పెట్టిన కూతురు, ఇప్పుడు ఎవరినో ప్రేమిస్తున్నానని చెప్తే, యూనివర్సిటీలోనే ఉద్యోగాలు చేస్తున్న విద్యాధికులైన ఆ తల్లిదండ్రులిద్దరూ, కూతురు వివేకవంతురాలన్న నమ్మకంతో ఏమీ అనలేదు. "ప్రేమ పేరుతో నీ లక్ష్యాన్ని మర్చిపోకూడదు" అన్న ఒకే ఒక్కమాట అన్నారు.

అలాగే అన్న కూతురు రెండు నెలలు తిరగకుండానే, 'పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం' అన్నప్పుడు అర్థమైంది... కూతురి ఆలోచనలలో పరిపక్వత లేదని, ఆకర్షణ వలలో పడిందని... జీవితమంటే ఏమిటో చెప్పవలసిన పరిస్థితి వచ్చిందని!

"చూడమ్మా నువ్వొకతనిని ఇష్టపడ్డావు. అతనూ నిన్నిష్టపడ్డాడు. దానికి మీరు ప్రేమని పేరు పెట్టారు. అంతవరకు ఫరవాలేదు! కానీ ఇప్పుడు చదువు మధ్యలో మీరు పెళ్లి చేసుకోవాలనుకుంటేనే సమస్య మొదలవుతుంది. ప్రేమనేది ఇద్దరు వ్యక్తులతో ముడిపడి ఉంటుంది. కాని పెళ్లనేది అలా కాదు. రెండు కుటుంబాలతో ముడిపడాలి. అప్పుడే ఆ పెళ్లి చేసుకున్న వ్యక్తులు జీవితంలో సుఖంగా ఉండగలరు. అలాగే... అటు అతని కుటుంబం గాని, ఇటు మేము గాని చదువు మధ్యలో మీరు పెళ్లి చేసుకుంటామంటే మిమ్మల్ని ప్రోత్సహించలేము. చదువయ్యాక, మీ లక్ష్యాలను సాధించాక, పెళ్లి చేసుకుంటామంటే, మీ నిర్ణయాన్ని హర్షించగలం!" అన్న తల్లిదండ్రుల మాటలు నిజమేననిపించాయి అనన్యకు.

"పెళ్లి చేసుకొని మన లక్ష్యాలను సాధించలేమా? పెళ్లి చేసుకుంటే ఒకరికొకరు తోడుగా ఉంటూ, జీవితాన్ననుభవిస్తూ మన లక్ష్యానికి తొందరగా చేరుకుంటామనిపిస్తుంది. లక్ష్యాలను సాధించాకే పెళ్లి చేసుకోవాలంటే అదెప్పుడు జరిగేనో! అన్నాళ్ళూ మనం దూరంగా ఉండాల్సిందేనా? అన్ని సంవత్సరాలూ, ఒకరికొకరం దూరంగా ఉండి, జీవితంలో ఆనందాన్ని కోల్పోవల్సిందేనా? నీ మీద నమ్మకం లేదా వాళ్ళకి? మన ప్రేమకు అభ్యంతరం చెప్పని మీ అమ్మానాన్నలు, పెళ్లికి చెప్తున్నారంటే మన పెళ్లి జరగడం ఇష్టం లేనట్టుంది మీ అమ్మానాన్నలకు!" అన్న సందీప్ మాటలు వింటే అవే నిజమనిపిస్తున్నాయి అనన్యకు.

"ముందు పెళ్లి చేసుకుంటాం. అలాగని మా చదువులను విస్మరించం, లక్ష్యాలను మర్చిపోం!" అన్న అనన్యను నమ్మలేనట్టుగా చూశాడు తండ్రి సోమసుందర్. పిల్లలను క్రమశిక్షణలో, మంచి చెడు తెలుసుకునేటట్టుగా పెంచామనుకుంటున్న తమ నమ్మకానికి తూట్లు పడేటట్లుగా ఉన్నాయి అనన్య ఆలోచనలు.

పాతికేళ్ల క్రిందట తమదీ ప్రేమపెళ్లే. కాని తామప్పుడు లక్ష్యాలను చేరుకున్నాకే, తమ ఇష్టాన్ని ఒకరికొకరితో చెప్పుకున్నారు, పెద్దలతో చెప్పారు. అంతవరకూ తమ ఇష్టాన్ని మనసులోనే దాచుకున్నారు! అటువంటిది తమ కూతురు ఈ వయసులోనే యిష్టాన్ని పెంచుకోవడం... దానిని పంచుకోవడమే కాదు, ఇంకొక అడుగు ముందుకేసి జీవితంలోకీ అడుగు పెడతానంటున్నది. ఇప్పుడేమి చెయ్యాలి?' ఆలోచనలో పడ్డ సోమసుందర్, "నువ్వింకా చిన్నపిల్లవి అనూ!" నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు.

"నేను మేజర్‌ని అయి మూడేళ్లు దాటుతుంది డాడీ"



"అది కాదమ్మా. 'వివాహాయ విద్య నాశనాయ!' అన్నారు మన పెద్దలు!"

"అలా జరగనివ్వం డాడీ. మా మీద మాకా నమ్మకముంది. ఎంతమంది పెళ్లిళ్లయ్యాక చదువుకోవడం లేదు?" తిరిగి ప్రశ్నించింది అనన్య.

"తప్పక, పెళ్ళి చేసుకుని, తర్వాత వాళ్లు కోరినదాన్ని సాధించారంటే, అది వాళ్ళ దృఢ మనస్తత్వాన్ని తెలుపుతుంది. నీ విషయంలో పెళ్లి తప్పనిసరి కాదిప్పుడు. అది అర్థం చేసుకో!" కాస్త గట్టిగానే చెప్పాడు సోమసుందర్.

"అయినా నాకు తెలియక అడుగుతున్నాను. ఆ కాలంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న మీరు... నా పెళ్ళికి అడ్డు చెప్తున్నారంటేనే అర్థమవుతుంది, ఈ పెళ్లి మీకిష్టం లేదని! అందుకే మా ప్రేమను బ్రతికించుకోవాలంటే, మేము పెళ్లి చేసుకోకతప్పదు!" తనూ గట్టిగానే చెప్పింది అనన్య.

ఇన్నాళ్లూ ముద్దుగా పెంచుకున్న కూతురు, తమ ప్రేమనే శంకిస్తుందంటే, అనన్య మనసును ఆ అబ్బాయి ఎంతగా నియంత్రిస్తున్నాడో అర్థమౌతుంది.

"నీ భవిష్యత్తు గురించే మా ఆలోచన!" కోపాన్ని అదుపు చేసుకుంటూ అన్నాడు.

"నా భవిష్యత్తు గురించి ఆలోచించే ఈ నిర్ణయం తీసుకుంటున్నాను!" వాడిగా అంది అను.

నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తుంటే, కూతురు మాటకు మాట చెప్తున్నా, భార్య శ్రావణి నోరు మెదపకపోయేసరికి కోపమొచ్చి "మాకిష్టం లేకుండా ఈ పెళ్లిచేసుకుంటే నీకూ, మాకూ సంబంధముండదు!" అనేశాడు సోమసుందర్.

అంతవరకు వాళ్ల సంభాషణను పట్టించుకోనట్టు కనిపించిన శ్రావణి "అనూ! ఎప్పుడూ పెద్దమ్మ వాళ్ళ జీవితాలకి, మన జీవితాలకి ఇంత వ్యత్యాసం ఎందుకుందమ్మా అనడుగుతావు కదా! చెప్తాను వింటావా..." అంటూ మొదలు పెట్టింది.

★★★

"ఎస్. పి. సార్ ఈ ఫైల్ మీకిమ్మన్నారు" అంటూ కానిస్టేబుల్ తెచ్చిన ఫైలును తిరగేస్తూ అందులోని వివరాలను చూసి ఉలిక్కిపడింది అనన్య. డబ్బున్న అమ్మాయిని ప్రేమించి, పెళ్లిచేసుకుని, పుట్టింటి నుండి డబ్బు తెమ్మని భర్త సాధిస్తుంటే, తల్లిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్లిచేసుకొని వాళ్ళను డబ్బడగలేక, డబ్బు తేలేదని భర్త చేసే చిత్రహింసలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న యువతి గురించిన వివరాలు. అందులోని ప్రేమికుడు ఎవరో కాదు.... ఐదేళ్లక్రితం తను ప్రేమించాననుకున్నవాడు... ప్రేమించుకున్నాం, పెళ్లి చేసుకుందామని తనను నమ్మించినవాడు... అమ్మ మాటలతో, చదువయ్యాక పెళ్లిచేసుకోవాలని నిర్ణయం తీసుకున్న తనను, "నిన్ను విడిచి క్షణం కూడా ఉండలేను. ఇప్పుడే పెళ్లి చేసుకుందాము" అని ముందు మంచి మాటలతో, తను ఒప్పుకోకపోతే, వేరెన్నో రకాలుగా బెదిరించినవాడు... వాడే సందీప్. ఐదేళ్ల క్రితం అమ్మ చెప్పిన మాటలతో తన నిర్ణయం మారకపోయుంటే, ఆ అమ్మాయి స్థానంలో తనుండేదేమో ఈనాడు!

ఆరోజు నాన్న, నేను ఎంత గట్టిగా మాట్లాడుకున్నా మధ్యలో కల్పించుకోని అమ్మ, ఆఖర్లో "నేను చెప్పింది విన్నాక నీకేదనిపిస్తే అదే చెయ్యి. నేనభ్యంతరం పెట్టను" అంటూ చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి తనకు. ఆరోజు అమ్మ ఏం చెప్పింది? గతంలో మునిగిపోయింది అనన్య.

★★★

"పల్లెటూర్లే దేశానికి పట్టుగొమ్మలన్న కాలంలో పుట్టాము మేము. అప్పట్లో పల్లెటూర్లలో తలసరి ఆదాయం తక్కువే. అయినా అభిమానాలు, ఆత్మీయతలు ఎక్కువ. ఆర్థిక వ్యత్యాసాలు కాని, కులాల వ్యత్యాసాలు కాని కనిపించేవి కావు. ఒకరినొకరు వరసలతో తప్పించి, పేర్లతో పిలుచుకోవడమనేది ఉండేది కాదు. ఊరంతా ఒక కుటుంబంలా కలిసుండేది. మంచైనా చెడ్డైనా ఊరంతా నిలబడేది.

ఆ కాలంలో అమ్మాయి పుట్టగానే, దగ్గరి బంధువుల్లో వరసైన అబ్బాయి ఉంటే... వాడి పెళ్ళాం పుట్టిందనేవాళ్ళు! అలాగ అక్కకు, నాకు మా మేనత్తల కొడుకులతో సంబంధం కలిపారు. మేనత్తల పిల్లలే కదా, ఎప్పుడూ ఇంటికి వస్తూ, పోతూ ఉండేవాళ్ళు. అందరం కలిసే పెరిగాం! ఆ కాలంలో అమ్మాయి వ్యక్తురాలైందంటే పెళ్లి చేసేసేవాళ్లు! మా నాన్నకు చదువు లేకపోయినా, మేము చదువుకోవాలన్న కోరికతో మమ్మల్ని చదివించేవాడు. మా ఊరికి దగ్గరున్న టౌనులో ఇంటర్మీడియట్ వరకు ఉండేది. అక్కడికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న యింకో టౌనులో డిగ్రీ కాలేజ్ ఉండేది. అందుకని ఆ చుట్టుపక్కల పది కిలోమీటర్ల వ్యాసార్ధంలో ఉన్నఊర్లలోని పిల్లలందరూ ఆ కాలేజీలకే వెళ్లేవాళ్లు!

ఇప్పటిలా అప్పుడు బస్సులవీ ఎక్కువ ఉండేవి కావు. స్కూలుకో కాలేజీకో వెళ్లాలంటే నడిచే వెళ్లేవాళ్లు. సుమారు ఐదారు కిలోమీటర్లైనా నడిచేవాళ్ళు. కాస్త ఉన్నవాళ్లైతే సైకిల్ ఉండేది. కాలేజీకి వెళ్లాలంటే మాత్రం బస్సెక్కాల్సిందే. బస్సులు కూడా ఉదయం, సాయంత్రం మాత్రమే ఉండేవి. అప్పట్లో ప్రైవేటు బస్సులే! అందుకని కాలేజీలకు దగ్గర ఊర్లలో బంధువులుంటే,

పిల్లలను అక్కడ ఉంచి చదివించేవాళ్ళు. అలా మా బావలిద్దరు కూడా మా ఇంట్లోనే ఎక్కువగా ఉండేవాళ్ళు. పెద్దబావ అందరితో హాస్యాలాడుతూ, సరదాగా ఉండేవాడు. కాబోయే భార్యభర్తలమనేమో... అక్క, పెద్దబావ ఒకరితో ఒకరు చనువుగా ఉండేవాళ్ళు. నేనలా చిన్నబావతో ఉండలేకపోయేదానిని! ఎవరైనా 'నీ కాబోయే మొగుడంటే' నాకు చాలా కోపం వచ్చేది. నా దృష్టి ఎంతసేపూ చదువు మీదే ఉండేది.

'పెళ్లయ్యాక ఇద్దరూ కలిసి చదువుకుంటారులే' అని అత్త అంటే, అక్క ఇంటర్మీడియట్ పూర్తి కాకుండానే, డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న బావతో పెళ్లైపోయింది. పెళ్లికి అక్క అభ్యంతరం కూడా చెప్పలేదు. సంతోషంగా ఒప్పుకుంది. అప్పటికి నేను పదవ తరగతి చదువుతున్నాను.

"చదువుకోకుండా, అప్పుడే పెళ్లేమిటి? పెళ్లయ్యాక చదువుకోవడం కష్టం. ఇప్పుడే పెళ్లి చేసుకోనని చెప్పక్కా! నువ్వు చెప్తే నాన్న కాదనరు!" అన్న నాతో "ఎప్పటికైనా పెళ్లి చేసుకోవాల్సిందే కదా! ముందే చేసుకుంటున్నాం. జీవితాన్ని ఎంజాయ్ చేస్తాం. అయినా చదివి ఉద్యోగాలు చెయ్యాలా! ఊర్లేలాలా!" అని తేలిగ్గా తీసుకుంది.

అప్పట్లో పల్లెటూర్లలో ఉద్యోగం చేసేవాళ్లు చాలా తక్కువ. ఒకళ్ళిద్దరుంటే గొప్పే. అదీ స్కూళ్లలో టీచర్లుగానే! పదెకరాల భూముంటే... వాడికేమిటి కాళ్ళమీద కాలేసుకుని దర్జాగా బ్రతుకుతాడనేవాళ్ళు. అందుకని చదువుకి, ఉద్యోగాలకి పెద్దగా ప్రాధాన్యత ఉండేది కాదా కాలంలో!

బావ... ఒక్కడే కొడుకు. పదిహేనెకరాల మాగాణికి సొంతదారు. ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదనేది అందరి అభిప్రాయం. నిజంగానే ఆ రెండు మూడేళ్లు జీవితాన్ని ఎంజాయ్ చేశారు. ఫలితం బావ పరీక్ష తప్పాడు. అక్క ఒక పిల్లకు తల్లయ్యింది. అక్కడితో ఇద్దరి చదువులూ ఉట్టికెక్కాయి. గడిచిన ముప్పయ్యేళ్లలో వ్యవసాయం చెయ్యడమనేది భారంగా మారింది. మదుపు ఎక్కువ. రాబడి తక్కువ. ఫలితం ఒకప్పుడు దర్జాగా బ్రతికినవాళ్ళు, అలాగే బ్రతకాలంటే భూమిని అమ్ముకోక తప్పడంలేదు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వచ్చి భూములకు విలువ పెరిగింది కాని, పది పదిహేనేళ్ల క్రిందట భూములకు విలువ తక్కువ! ఆ కాలంలో అమ్ముకున్నవాళ్ళు చాలా నష్టపోయారు. అలాంటి కుటుంబాలలో మీ పెద్దమ్మ కుటుంబం ఒకటి!

ఇక నా విషయానికొస్తే... నా ఇంటర్మీడియట్‌లో పెళ్లి చేసేద్దామని మా అత్త అడిగితే, నేనొప్పుకోలేదు. నాకిష్టం లేకుండా నా పెళ్లి చెయ్యననేశాడు మా నాన్న! 'పోనీ నిశ్చితార్థం చేసుకుందామంది' అత్త. రేపటి నా ఆలోచనలు ఎలా ఉంటాయో! అందుకే నిశ్చితార్థానికి కూడా నేనొప్పుకోలేదు. అలా, అప్పుడు నా పెళ్లి తప్పింది. నేను కాలేజీ మెట్లు ఎక్కాను. నా డిగ్రీ అవగానే, మరలా అత్త నా పెళ్లి గురించి ప్రస్తావించింది. అప్పటికి బావ డిగ్రీ అయి ఖాళీగా ఉన్నాడు. పెళ్లి చేసుకున్న మా అక్క, బావల పరిస్థితి చూసి, నాకప్పుడే పెళ్లి చేసుకోవాలనిపించలేదు. నా ఆలోచనలకు మా నాన్నకూడా మద్దతు తెలిపాడు. అలా నా పెళ్లి మా బావతో తప్పింది!

నేను యూనివర్సిటీ మెట్లు ఎక్కాను. అప్పటికే పీహెచ్డీ చేస్తున్న మీ నాన్న... మాకు పాఠాలు చెప్తుంటే, తొలిసారిగా క్లాసురూములో చూశాను! మొదట ఒక గురువుగా మీ నాన్నను ఇష్టపడేదానిని. క్లాసులో మొదటి పదిమందిలో నేనూ ఒక దానిని! అలా మీ నాన్న కూడా నన్ను అభిమానించేవాళ్ళు. మీ నాన్న పి.హెచ్.డి పూర్తిచేసి అదే యూనివర్సిటీలో ఉద్యోగంలో చేరడం, నేను స్కాలర్‌గా చేరడం జరిగాయి. కాలక్రమంలో మీ నాన్నపై నాకు వేరే రకమైన ఇష్టం కలగడం... అయినా ఆ

ఇష్టాన్ని నేను బయటకు చెప్పలేదు. ఎందుకంటే ఇష్టపడడమనేది మన చేతిలో ఉంటుంది. కానీ పెళ్లనేది రెండు కుటుంబాల మధ్య వ్యవహారం! దానికి తోడు మీ నాన్నవాళ్లు బాగా ఉన్నవాళ్లు, చదువుకున్నవాళ్ళు! వాళ్లతో పోలిస్తే, అన్ని విషయాలలో మేము వెనకబడి ఉన్నాము. అందుకని నా ఇష్టాన్ని మనసులోనే దాచుకున్నాను!

కాని నా థీసిస్ సబ్మిట్ చేశాక, మీ నాన్న తన ఇష్టాన్ని వ్యక్తపరచడం... పెద్దలను ఒప్పించడం... పెళ్లి చేసుకోవడం... తర్వాత ఇక్కడే నాకు ఉద్యోగం రావడం... మీరు పుట్టడం!

ఇప్పుడు అర్థమైందనుకుంటాను నీకు.... పెద్దమ్మకు, నాకు జీవన విధానాలలో ఎందుకంత వ్యత్యాసం ఉందో?

చదువుని నమ్ముకుని చివరి వరకు కొనసాగి, ఉన్నత చదువులతో వచ్చిన ఫలాలను అనుభవిస్తున్నాను నేను! చదువుకన్నా, వయసుతో వచ్చే ఆకర్షణలకు ప్రాముఖ్యతనిచ్చి, వివాహబంధాన్ని యెంచుకుని... తర్వాత తప్పు తెలుసుకున్నా కాలాన్ని వెనక్కి తేలేక, జీవితంలో ఎదురీదుతోంది పెద్దమ్మ! నా జీవితానుభవాలను నీకు చెప్పాను.

చదువుకుంటున్న కాలంలో ఆకర్షణలవలలో పడి, చదువుని నిర్లక్ష్యంచేసి నీ ఉన్నతిని ఇక్కడితో ఆపుకుంటావో, ఆ ఆకర్షణ నుండి బయటపడి నీ జీవితలక్ష్యాన్ని చేరుకున్నాక ప్రేమైక జీవితాన్ని సాధించుకుంటావో నీ చేతుల్లో ఉంది! కన్నవాళ్ళుగా నీకు మంచి సలహా ఇవ్వగలం. కాని, అది పాటించాలా, వద్దా అనేది నీ వివేకానికే వదిలేస్తాం. ఎందుకంటే నీ జీవితం నీ చేతుల్లో, చేతలలో ఉంటుంది!" నెమ్మదిగానే, ఐనా సూటిగా, స్పష్టంగా చెప్పింది అమ్మ.

తన తల్లి తనకు వివరంగా చెప్పినట్టు, మిగిలిన తల్లులు చెప్పరా? తల్లులు చెప్పినా అమ్మాయిలు వినరా? లేకపోతే ప్రతిరోజు ప్రేమ పేరుతో మోసపోతున్న యువతుల గురించో, ప్రేమకోసం ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ల గురించో వార్తలెందుకుంటాయి? ఈ విషయంలో సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి. ప్రేమనేది జీవితంలో ఒక భాగమే కాని, అదే జీవితం కాకూడదని, ఆ పేరుతో మోసపోకూడదని అమ్మాయిలకి అవగాహన కల్పించాలి!

ఈ ఆలోచన రావడం తడవు ఎస్.ఐ. ని పిలిచి "ఈ సిటీలో ఉన్న కాలేజీల జాబితా తయారుచేసి, ఆ ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడండి. ప్రేమపేరుతో జరిగే మోసాల గురించి ప్రతి అమ్మాయి తెలుసుకునేటట్లుగా, సైకాలజిస్టుల సాయం తీసుకుని 'అవగాహనా వారోత్సవాలని' మన పోలీసుసిబ్బంది అన్ని కాలేజీలను సందర్శించే విధంగా ఏర్పాటు చెయ్యండి. వీలైనన్ని ఎక్కువ కాలేజీలకు స్వయంగా వెళ్లి, నా అనుభవాన్ని అమ్మాయిలతో పంచుకుంటాను. కొద్దిమంది మారినా, మన శ్రమకు తగిన ఫలితం చేకూరుతుంది!"

"అలాగే, ఈ కేసుకు సంబంధించిన సందీప్ గురించి ప్రతి చిన్న వివరం నాకు కావాలి. ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు ఐపిసి సెక్షన్ 306 ప్రకారం ఆ వ్యక్తికి గరిష్టంగా శిక్ష పడేటట్టుగా తగిన ఆధారాలను సేకరించి, న్యాయస్థానానికి అందించాలి!" అంటూ కేసు పరిశోధనకు బయలుదేరింది సంవత్సరం క్రితమే డి.ఎస్.పి. గా చేరిన అనన్య!

వల్లూరి విజయకుమార్
✆ 8885511950

> ***"అయ్యగారూ ఇవి మనూళ్లు కాదండీ... అలాగే ఈళ్ళు కూడా మనతరం కాదు కదండీ! అంతా ఫాస్టే... పోయినోళ్ల గురించి వాట్సాప్‌లో మెసేజ్‌లు పడిపోతాయి. అంతే కదండీ! మరి మనిషి పోయాక విలువేంటండీ?!***
> ***నాన్న 'పెద్దయ్య' ఆఖరిమాటలు సుందరం చెవిలో ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి.***

నాన్న చదివించాడో, లేకపోతే తానే చదువుకుని డిగ్రీ పాసయ్యాడో తెలీదుకానీ, సుందరం చదువు పూర్తయ్యాక తెలిసిందేవిటంటే, ఊళ్ళో తాతలనాటి ఇల్లు ఆ పుణ్యం కట్టుకుంది.

ఆ ఇల్లే సుందరం చెల్లి పెళ్లి కూడా చేయించింది.

సుందరం బాల్యం ఆ ఇంట్లోనే గడిచిపోయింది.

ఇల్లు... తోట... మండువా... వసారా... వీధి అరుగు...

ఇప్పుడు తలుచుకుంటే అనిపిస్తుంది 'ఎంత హుందాగా' ఉండేదో ఆ ఇల్లు !

సుందరాన్నీ, చెల్లిని పెంచిన ఆ ఇల్లు, వాళ్ళ తాతయ్యనీ, బామ్మనీ తన వసారలో ప్రశాంతంగా పడుకో పెట్టుకుని, సాగనంపడం ఇంకా గుర్తే.

'ఎంతదృష్టం కట్టుకున్న ఇంట్లోనే పోయాడు మహానుభావుడు'

తాతయ్య పోయినప్పుడు వీడ్కోలు పలకడానికి వచ్చిన జనం మాటలు సుందరానికేం అర్థం అవుతాయి?

అప్పుడు సుందరం దృష్టి , ఇంటి ఆవరణలో పాడె దగ్గర శంఖం ఊదుతున్న మాణిక్యం మీదే!

మాణిక్యం బుగ్గలు పూరించి శంఖం ఊదుతోంటే 'బూ' అంటూ... సుందరానికీ ఒక్కసారి ఊదాలనిపించేది... కానీ పడనిస్తేగా!

అత్తా మామ్మల్ని సాగనంపుతూ పెద్దయ్య దంపతులు కళ్ళు తుడుచుకున్నారు!

మళ్ళీ కూతురికి పెళ్లిచేసి సారెతో అత్తింటికి పంపుతున్నప్పుడు కూడా!

సుందరం చదువుకి తాకట్టుపెట్టిన ఇంటిని విడిపించుకోలేక, అయినకాడికి అమ్మేసి, పట్నంలో కొడుకు దగ్గరకి వెళ్లే రోజున మరోసారి కళ్ళు తుడుచుకున్నారు, ఇంటి ఋణం తీర్చుకోలేక !

★★★

సుందరం చేస్తున్న ఉద్యోగం 'సహజీవన' కమ్యూనిటీ లో మూడు గదుల అపార్ట్‌మెంట్ ని అద్దెకి ఇప్పించింది.

ఠంచనుగా నెల అయేసరికి అద్దె వసూలుకి ఓనరు రావడం, కుశల ప్రశ్నలు, కాఫీ తాగడం, అద్దె డబ్బులు జేబులోకి వెళ్లడం జరిగిపోయేది.

ఇంత బతుకు బతికి అద్దె ఇంట్లో ఉండటం... అదీ కొడుక్కి దూరంగా కాకుండా భారంగా ఉండటం, పెద్దయ్యకి బాధగా ఉండదూ!



'సొంతిల్లుదేవుందిలే నాన్నా! ఇంటిపన్ను, మున్సిపాలిటీ టాక్సులు, కట్టుకోవాలి... రిపేర్లు వస్తే తడిసి మోపెడు... ఎందుకొచ్చిన బాధ... ఆ తిప్పలేవో ఇంటి ఓనరు పడతాడు! ఉన్నన్నాళ్లు ఉంటాం, నచ్చకపోతే మరో ఇల్లు మారచ్చు హాయిగా! మనం ఉండటానికి రెండు మూడు గదుల ఇల్లు చాలదూ... ఇల్లు కొనాలంటే బోలెడు పెట్టుబడి. వడ్డీ డబ్బులు ఎవరు తిన్నట్టు!' అనే సుందరానికి ఇప్పుడు నాన్న ఆఖరి మాటలు గుర్తుకొస్తున్నాయ్.

★★★

ఊరి మధ్య వాళ్ళుంటున్న 'సహజీవన' అపార్ట్‌మెంట్ ఎందుకో పెద్దయ్యకి నచ్చలేదు.

ఎవరి ధోరణి వాళ్ళది... పెద్దా లేదు, చిన్నా లేదు మాటా లేదు, మంతీ లేదు. ఎవరిళ్లలో వాళ్ళు.... కాదు కాదు... ఎవరి గూళ్ళలో వాళ్ళు!

ఉదయాన్నే లేవడం, అపార్ట్‌మెంట్ ఆవరణలో అటూ ఇటూ తిరగడం, కాఫీ తాగాక కింద లైబ్రరీ గదిలో పేపర్లు తిరగెయ్యడం... ఇదీ పెద్దయ్య రివాజు!

అలాటప్పుడే పెద్దయ్యకి పరిచయమయాడు శాంతారాం! ఆయనకి తెలుగు బొటాబొటీ. ఈయనకా హిందీ రాదు.

మరి వాళ్ళని గమ్మత్తుగా కలిపింది ఏమిటీ? వృద్ధాప్యం!

ఏతావాతా తెలిసిందేవిటంటే, శాంతారాం కూడా పిల్లల చదువు కోసం ఇల్లు త్యాగం చేసినవాడే!

అబ్బాయిది బిజినెస్సు, కోడలు ఉద్యోగం! పిల్లలని చూసుకోటానికి పనికొస్తారని అమ్మ నాన్నలని దగ్గరుంచుకున్నాడు కొడుకు. గుడ్డిలో మెల్లగా, ఉంటున్న నివాసం కొడుకు సొంతం!

"ఒరేయ్ సుందరం, చాన్నాళ్ల బట్టి శాంతారామ్ కనిపించడం లేదురా. ఊరేమైనా వెళ్ళాడేమో కనుక్కోగలవా... ఐనా మాటమాత్రమైనా అనకుండా వెళ్ళడే!"

తండ్రి అప్పుడప్పుడు శాంతారాం అనే పరిచయస్తుడి గురించి చెప్పడమే తప్ప, సుందరం పెద్దగా పట్టించుకునేవాడు కాదు.

"ఇంత పెద్ద అపార్ట్‌మెంట్‌లో శాంతారాం ఎవరో ఎలా తెలుస్తుంది నాన్నా! ఖాయిలా పడుంటాడేమో, వస్తాడ్లే!" అవును కదా! ఇంత ప్రపంచంలో... ఓ మారుమూల దేశంలో, ఒకానొక నగరంలో నడిబొడ్డున ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ... శాంతారాం ఎవరు, అతని ఉనికి ఎవరిక్కావాలి, నిజమే!

పెద్దయ్య బెంగగా చూసాడు కొడుకుని!

"సుందరం నీకు గుర్తుందా? నువ్వు పదోక్లాసు చదువుతుంటే ఓసారి ఊష్టం వచ్చింది. నాలుగైదు రోజులు ఇల్లు కదల్లేదు నువ్వు! 'నీకేమైందా' అని నీ నేస్తగాళ్లు భద్రప్ప, రవీంద్ర, మాధవయ్య మాస్టారూ ఇంటికొచ్చేసారు... గుర్తుందా?"

తండ్రి ఏం చెబుతున్నాడో, ఎందుకు చెబుతున్నాడో సుందరానికి అర్థం కాలేదు. అంత సమయము అవసరం కూడా లేవేమో ఇప్పుడు! సుందరం నోట ఒకే ఒక మాట వచ్చింది "ఐతే?"

పెద్దయ్య నోట ఏ మాటా రాలేదు, ఒక్క "ప్చ్" అన్న నిట్టూర్పు తప్ప!

★★★

సావకాశంగా సొసైటీ మెయిల్స్ చూస్తున్న సుందరాన్ని ఒక మెయిల్ ఆకట్టుకుంది.

"మన సహజీవన అపార్ట్‌మెంట్స్‌లో హీరాలాల్ గారికి కలిగిన పితృ వియోగానికి చింతిస్తూ, వారి తండ్రి శాంతారాం ఆత్మశాంతికి భగవంతుడిని ప్రార్థిస్తున్నాం! హీరాలాల్ గారికి తండ్రి వియోగాన్ని తట్టుకునే శక్తి భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటూ... వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపడమైనది!"

తన పై అంతస్తులో ఉన్న హీరాలాల్‌తో సుందరానికి కాస్త పరిచయమే. లిఫ్ట్ దిగేప్పుడూ, కారిడార్ లోనో కారు పార్కింగ్ లోనో, కనిపించినప్పుడు 'హలో' చెప్పుకునేంత!

కొడుకు చెప్పిన కబురు విని నివ్వెరపోవటం మాత్రమే పెద్దయ్య చేయగలిగింది!

"అరె... నిన్నకాక మొన్న పోయాడా! ఎక్కడా ఒక్క తంతూ లేదు.. ఖబురు లేదు!"

"ఇక్కడ అలాంటివి ఉండవు నాన్నా... అందరికీ డిస్టర్బెన్స్ కదా! చుట్టూ పిల్లలు వాళ్లు ఉంటారు. ఫోన్ చేస్తే, బండి వచ్చి బాడీని పట్టుకుపోతుంది. ఆ చేసే తంతు ఏదో బయటే జరిపించేస్తారు. ఐనా ఎందుకులే నాన్నా ఇప్పుడివన్నీ!"

పెద్దయ్య ఒక్క మాట కూడా మాట్లాడలేదు. 'ఇక్కడ ఎవరి చావు వాళ్ళదన్నమాట' నాన్న గొణుగుడు విని సుందరం మాత్రం ఏంచేస్తాడు, వినపడనట్టు ఉండటం తప్ప!

★★★

ఈ సంఘటన జరిగినప్పటి నుండి పెద్దయ్యలో ఏదో చెప్పలేని బెంగ!

శాంతారాం మరణం అతగాడిని బాధించిందనే చెప్పాలి మరి!

ఏమిటో ఈ అపార్ట్‌మెంట్ బతుకులు, అందరూ ఎవరికి వారే అన్నట్టు ఉంటారు. ఇక్కడి మనుషులు ఓహో అంటే ఓహో అనుకోడమేనా?

మాటల మధ్యలో అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ చంద్రయ్య చెప్పిన మాటలు మరీ బాధించాయి.

శాంతారాం దవాఖానాలో పోతే, అతడి కూతురు రావాలని రెండు రోజులు బాడీని మార్చురీలోనే ఉంచేశారట.

ఆ తల్లి వచ్చాక హాస్పిటల్ నుండి బాడీ తెప్పించి వాళ్ళ కార్ పార్కింగ్‌లో వుంచి అక్కడికక్కడే ఓ దండేసి కార్యక్రమం అయ్యిందనిపించేసారు. మరో పావుగంటలో శ్రద్ధాంజలి వాహనం రావడం, శాంతారాం కొడుకు, ఇద్దరు కావలసిన బంధువులూ వాళ్ళ కారులో వాహనం వెనకే వెళ్లి కార్యక్రమం కానిచ్చేసారు.

"మన ఊళ్లలోలాగా సెపరేటు ఇళ్ళు కావు కదండీ... శవాన్ని లోపల పెట్టడానికి రూల్సు ఒప్పవండీ! చుట్టుపక్కల వాళ్ళకి అసౌకర్యం కదండీ..." చంద్రయ్య ఇంతకన్నా ఏం చెబుతాడు మరి!

"అయ్యగారూ ఇవి మనూళ్లు కాదండీ... అలాగే ఈళ్ళు కూడా మనతరం కాదు కదండీ! అంతా ఫాస్టే... పోయినోళ్ల గురించి వాట్సాప్‌లో మెసేజ్‌లు పడిపోతాయి. అంతే కదండీ! మరి మనిషి పోయాక విలువేంటండీ!"

పెద్దయ్యకి కాస్త అర్థం అయింది... కాస్త కాలేదు!

పట్నం అపార్ట్‌మెంట్స్‌లో మనిషిని పంపించేయడానికి కూడా ఒక పద్ధతుందన్నమాట!

★★★

భార్య, తల్లీ, పిల్లలు చుట్టూ ఉన్నా మొదటిసారిగా సుందరానికి తను ఒంటరి వాడైపోయిన ఫీలింగ్! నాలుగు రోజుల బట్టి, హాస్పిటల్ చుట్టూ తిరగడం, ఈసురోమని ఇంటికి రావడం... తను అపార్ట్‌మెంట్ లోకి వెళ్లేలోగా కనపడినవాళ్లు, 'హా

ఈస్ ఫాదర్' అని, 'విష్ హిమ్ స్పీడీ రికవరీ' అంటూ ఆఫీసు వాళ్ళ వాట్సాప్ మెసేజ్‌లు...

'ఎనీ హెల్ప్!'

'నో థాంక్స్' అంటూ ఓ వెర్రినవ్వు.

ఈ మధ్యలో ఇంటాయన రోజూ ఫోన్లు.

'బాబూ నాన్నగారెలా ఉన్నారు! ఇంకా సీరియస్ గానే వుందా.... ఎంతైనా పెద్దాయన కదా!'

అది బాధలో ఓదార్పో, లేక కుతుహలమో తెలుసుకునేంత జ్ఞానోదయం సుందరానికి ఎక్కడిది!

"అవునండీ... ఐసియులో ఉన్నారు. ఏమీ చెప్పలేమంటున్నారు డాక్టర్లు!"

"సుందరం ఏమీ అనుకోకు మరి... ఏం కాదనుకో... ఆహా... ఐతే ఒకవేళ, బాడీని ఇంట్లోకి తీసుకురాకండి. కింద మీకు పార్కింగ్ ప్లేస్ వుందిగా!"

'ఇల్లు ఆయనది... బతకడానికి అద్దె ఇల్లు చాలదా!'

హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చాడో లేదో సుందరానికి అక్కడి నుండే ఫోన్... "పెద్దయ్యగారి అటెండరు మీరేనా, వెంటనే రండి!"

అంత ట్రాఫిక్ లోనూ హాస్పిటల్‌కి ఎలా చేరుకున్నాడో సుందరానికే తెలీదు.

ఐసియు ముందు డ్యూటీ డాక్టర్, "సారీ అండీ... మీ నాన్నగారు రెస్పాండ్ కావట్లేదు! ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నారు! మీరు ఇంటికి తీసుకెళ్ళిపోండి. డిశ్చార్జ్ సమ్మరి రాయిస్తాను. మీరు లోపలికి వెళ్లి ఆయన్ని చూసిరండి. ఈలోగా బిల్లు..." అని తన పనిలో పడిపోయాడు.

అదుర్దాగా బెడ్డు దగ్గరకి చేరుకున్నాడు సుందరం.

నర్సు యాంత్రికంగా సెలైన్ బాటిల్ , హార్ట్ మానిటర్ కనెక్షన్లు తీసే ప్రయత్నంలో వుంది.

పెద్దయ్య కళ్ళు అంత ఎగ ఊపిరిలోనూ కొడుకుని చూసి మెరిసాయి. ఇలారా అన్నట్టు చెయ్యి ఊపాడు.

"నాన్నా! డాక్టర్ నిన్ను డిశ్చార్జ్ ..." సుందరం మాటలు పూర్తి కాలేదు.

పెద్దయ్య నీరసంగా కొడుకు చెయ్యి పట్టుకున్నాడు.

నాన్న ఏదో చెప్పాలనుకుంటున్నాడని గ్రహించాడు సుందరం! తండ్రికి దగ్గరగా వంగాడు.

"ఒరేయ్! మనిషికి ఇల్లు బతకడానికి కాదురా కావలసింది... చావడానికి!"

ఇవే నాన్న గొంతులోంచి కష్టం మీద వచ్చిన ఆఖరి మాటలు!

తండ్రి ఆఖరి మాటలు సుందరం చెవిలో ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి!!

# గోవు మాలచ్చిమి

**శీలా సుభద్రాదేవి**
✆ 8106883099

**విశిష్ట అతిథి కథ**

*బిడ్డ ఆరోగ్యంగా ఉండేసరికి విదేశీజంట అన్ని ఫార్మాల్టీలు పూర్తిచేసుకొని బిడ్డని వారం పది రోజులకే తీసుకొని వెళ్ళిపోయారు. బిడ్డని తీసుకుపోతుంటే వెంకటలక్ష్మికి గుండెలో ఏమూలో చిన్న కదలిక!
తెంచుకుపోయిన తల్లి పేగు కలుక్కుమంది. కళ్ళు నీళ్ళతో నిండాయి. మాతృప్రేమకేమో గుండెలు భారమయ్యాయి. పాలు యింకిపోటానికి డాక్టరు ఇంజక్షను చేసిన చోట చురుక్కుమంది.*

"ఏం దయ్యా నెల్రోజుల సంది రేత్రీ పొగలూ అదే పనిగా ఆలోసన ఏంది బాద? పన్లేదనేనా?" భర్త నారాయణ భుజం మీద చెయ్యేసి ప్రేమగా అంది వెంకటలక్ష్మి.

దిగులు కొంత, పేదరికం కొంతా పీల్చేసుకుందేమో... పాలిపోయి చిక్కిపోయిన భార్యని చూస్తుంటే జాలి కలిగింది నారాయణకి.

"ఏదో ఉద్ధరించి తలకెత్తుకుంటానని నమ్మి ఉన్న కొంపా గోడూ అరెకరం భూమి అమ్ముకొని నేను గల్ఫ్‌దారి పట్టాను. నగరంలోనైతే ఫోన్లోనైనా కుశలం తెలుసుకోవచ్చనీ, నాలుగిళ్ళల్లోనైనా పని చేసుకోవచ్చనీ, పిల్లలతో సహా నువ్వు పట్నం వచ్చి కాలం గడుపుతున్నావు! నమ్ముకున్న పనిపోయి చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు, నేను ఖాళీ చేతుల్తో ఉన్నపాళాన తిరిగి వస్తిని! నెల్రోజుల నుండి దేవులాడినా ఏ పనీ దొరకట్లేదు. ఆటో అద్దెకి తెచ్చి తిప్పుతుంటే, సంపాదించింది అద్దెకి పోగా ఏం మిగలట్లే! ఎట్టాగో ఎందో తెల్వటంలే?" మోకాళ్ళలో తిరిగి ముఖాన్ని దాచుకున్నాడు. "అప్పుడే గుబులైతే ఎట్లా? కట్టపడేటోళ్ళకి ఏదైనా పని దొరుకుద్ది! దిగులుపడి మనేది పెట్టుకోబాక, దాజరంత బువ్వ తిని పో!" తన దిగుల్ని గుండెల్లో దాచుకొని వెంకటలక్ష్మి భర్త చెయ్యి పట్టుకుని లేవదీసింది.

రెణ్ణెల్లు, మూడు నెల్లూ దాటుతూనే ఉన్నాయి. నారాయణకి దిగులు వదల్లేదు. తనతో పాటు గల్ఫ్ నుండి తిరిగి వచ్చిన మిత్రుల్ని కలుస్తూ, ఆర్థికంగా కూలిపోయిన కుటుంబాన్ని ఏ రకంగా మళ్ళీ పైకి తేవాలో తెలియక, ఆలోచన్ల మీద ఆలోచన్లు సాగిస్తూనే ఉన్నాడు.

ఆలోచన్లతోనే రోజులు గడిచిపోతున్నాయి. గల్ఫ్‌లో సంపాదన బాగానే ఉండేది. కొంత భార్యకు పంపినా, దర్జాగా కాలం గడిచిపోయేది. పాస్‌పోర్టు చెకింగులు జరిగి అక్కడ ఉండటానికి వీలులేదని, పనీ యివ్వక, బలవంతాన ఉన్నపాళాన తిప్పి పంపించేసారు. ఇప్పుడు ఇలా పైసలకి తడుముకొంటూ గడపటం చిరాకుగా ఉంటోంది నారాయణకి. మళ్లీ అంతలోనే భార్యా పిల్లల మీద జాలితో గుండె గుబులౌతోంది!

తీరని ఆర్థిక సమస్యలు, భద్రత లేని పని, తెగని ఆలోచనతోనే రోజులు గడుస్తున్నాయి!

ఆ రోజు చంటిపిల్లకి ఒళ్ళు బాగోక, అద్దెకి ఆటో తెచ్చుకోటానికి పోలేక పోయాడు. బజార్లోకి పోతే ఏదన్నా కూలి పనైనా దొరుకుతుందేమోనని రోడ్డున పడి నడవసాగాడు.

గల్ఫ్‌లో తనతోపాటే పనిచేసి, చివరికి తనతోనే ఇంటిదారి పట్టిన మిత్రుడు మల్లేషు దార్లో కలిసాడు. విషయం అంతా తెలుసుకొని "నారాయణా నేను ఓ నెల్రోజులపాటు ఊరు పోయేది ఉంది. గల్ఫు నుండి వచ్చినప్పటి సంది తమ్ముని ఆటో నడుపుతున్నా! ఈ నెల్రోజులూ ఆ ఆటో నువ్వు నడుపు... ఓనరుకి ఇచ్చినంత ఈయనవసరంలే, కొంత తగ్గించే యివ్వు. ఏమంటావ్ భాయ్!" ప్రేమగా అన్నాడు.

దేవుడు ప్రత్యక్షమైనంత సంతోషం కల్గింది నారాయణకు. సంభ్రమంగా మిత్రుణ్ణి చూస్తూ "నిజమేనా! మరి మల్ల నువ్వు ఎప్పుడు తిరిగొస్తవు? ఏ ఊళ్లోనన్న పని దొరికిందా?" ప్రశ్నల వర్షం కురిపించాడు.



"నాకు దొర్కలే, మా ఆడదాయికి దొరికింది!" మెల్లగా అన్నాడు.

"ఏంది మల్లేషు... పనేంది?" కుతూహలంగా అడిగాడు.

కొంచెంసేపు మాట్లాడకుండా ఊరుకొని ఆలోచన్లో పడ్డాడు మల్లేషు! మిత్రుడికి చెప్పటానికి మొగమాట పడ్డాడు.

"ఏందిభాయ్ నాకాడ దాపరికవా?" అడిగాడు నారాయణ.

"మరేంలే నారాయణా! అయితే ఈ సంగతి ఏడా అనబోకు!" అన్నాడు మెల్లిగా మల్లేషు.

"నేనెవరికి చెప్తా భాయ్!" మల్లేషు చేతిలో చెయ్యేసేడు ప్రేమగా చూస్తూ నారాయణ.

"పరాయి దేశాల్లో బిడ్డలు లేనోళ్ళు గుజరాతులోని ఓ ఊళ్ళో దవాఖానాకి వస్తున్నార్ట! దవాఖానాలో కనటానికి ఇష్టమున్న ఆడోళ్ళ కడుపులోకి ఇంజక్షన్లతో పిండాన్ని పంపి, గర్భం వచ్చేలా చేస్తారట. తొమ్మిది నెలలూ మోసినందుకు పిల్లల్ని కనేందుకు, మస్తు పైసలు ఇస్తరట. నా తమ్ముడు తన పెళ్ళాన్ని అక్కడకి తీసుకెళ్ళాడు. అక్కడే ఏదో ఖార్ఖానాలో

పనిచేసుకొంటూ ఆడే ఉండిపోయాడు. కడుపుతో ఉండి, కనేటంత వరకూ డాక్టర్లు చూసుకుంటార్ట. తిండీ, బట్టాలన్నీ వాళ్ళే ఖర్చు పెట్టుకుంటార్ట. నాకు కూడా చెప్పాడు. ఇది మంచిగ తోచింది! తొమ్మిది నెలలు గర్భాన్ని అద్దికి ఇచ్చినట్లు అనుకోవాలి అంతే!"

"గిదేందిరా మల్లేషు, ఎవడి బిడ్డనో..." ఏమనలేక ఆగిపోయాడు నారాయణ.

"మనం తల తాకట్టు బెట్టుకొని దేశాలు పట్టిపోయి ఎవడెవడికో ఊడిగం చెయ్యలే, గట్లనే అనుకోవాల మల్లా!"

నారాయణ ఏమీ మాట్లాడలేదు.

"బిడ్డని కనేటంత వరకూ తల్లిని కండ్లల్లో పెట్టుకు చూస్తరంట. బిడ్డ ఆరోగ్యంగా పుట్టే వరకూ వాళ్ళదే బాధ్యత. తర్వాత వాళ్ళు బిడ్డని తీసుకుపోతారు. లేకపోతే మరికొన్నాళ్ళు తల్లి దగ్గర ఉంచుతార్ట. అన్నీ మంచిగా అయినంక బిడ్డని మోసికన్నందుకు రెండు లక్షల పైన సొమ్ము యిస్తరట!" మల్లేషు కళ్ళల్లో మెరుపుల్ని నారాయణ ఆశ్చర్యంగా చూసాడు.

"ఎంత?" నమ్మశక్యం కాక రెట్టించాడు.

"రెండు లక్షలు!" నొక్కిచెప్పాడు మల్లేషు

"ఎంతైనా ....." నసిగాడు... "అయినా నాకు సమజుకాక అడుగుతున్నా... ఆ పనికి ఆ దేశాల్లో ఎవరూ దొరకట్లే?" అనుమానంగా అన్నాడు.

"దొరుకుతారు! ఎందుకు దొరకరూ, కానీ ఆడవాళ్ళకి గీడకన్నా ఎన్నో రెట్లు పైన రేటు ఉంటదంట, అందుకని ఈడకి ఎగబడ్తున్నారు~!"

"ఇక్కడోళ్ళు చవగ్గా దొరికిన్రన్న మాట" గొంతులో నిరసన ధ్వనించింది.

"అంతే మరి. అక్కడోళ్ళు అడిగినంత ఇవ్వక్కర్లేదనే ఈడ నుండి ఎగేసుకు పోతున్నరు. సదవుకున్నోళ్ళనీ, మన్లాటి సదువు లేనోళ్ళనీ పిల్చి మరీ చవగ్గా చాకిరీలు చేయించుకుంటున్నరు. గట్లనే ఇదీనూ! మనం గల్ఫ్ పోలా ఏ పని దొరికితే అది చేయనీకి!" నిర్లిప్తంగా అన్నాడు మల్లేషు.

"అదీ నిజమేలే. అయితే ఎప్పుడు పోతున్నావ్?" అడిగాడు నారాయణ

రెండు వారాల క్రిందట, తమ్ముడు ఆడ ఒదిన పేర్ని రిజిష్టరు చేసి ఫాం పంపిండు. ఈ వారంలో రమ్మన్నరు. పరీక్షలన్నీ జేసి, ఆరోగ్యం మంచిగా ఉందని నిర్ణయించుకున్నాక, గర్భం వచ్చేలా చేస్తార్ట! అన్ని దినాలు మాకు ఆడనే వసతి చూపుతారు. అంతా బాగయినంక నేను వచ్చేస్త. తర్వాత ఏ నెల్రోజులకో పోయి చూసిరావచ్చు!" అన్నాడు మల్లేషు.

"మరి నీ పిల్లలు?" ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు నారాయణ.

"మా అమ్మ, అన్నా ఊర్ల ఉన్నారు గందా ఆడకి తోలిస్తున్నా! సర్లే రేపు చీకట్లనే వచ్చి ఆటో తీసుకుపో!" అన్నాడు మల్లేషు. కృతజ్ఞత కళ్ళలో మెరుస్తుండగా ఆత్మీయంగా మల్లేషు చేతులు పట్టుకొని వదిలాడు నారాయణ.

ఆరోజు పని వెతుక్కోవాలనిపించక ఇంటిదారి పట్టాడు నారాయణ.

ఆటో లేకుండా తొందరగా తిరిగి వచ్చిన భర్తని ఆశ్చర్యంగా చూసింది వెంకటలక్ష్మి. ఆమెని పై నుండి కింద వరకూ పరిశీలనగా చూస్తూ లోపలికి నడిచేడు.

మర్నాడు ఉదయమే వెళ్ళి మల్లేషు ఇంటి నుండి ఆటోని తీసుకువచ్చేడు. ఆటో చేతిలో ఉండి, రాత్రీ పగలూ బేరాలు చూసుకొనే సరికి నారాయణకి కొంచెం చేతిలో పైసలు గలగల్లాడాయి. మల్లేషు చెప్పిన విషయం మాత్రం అతన్ని వెంటాడుతూనే ఉంది.

ఆటో సంగతి అడిగిన వెంకటలక్ష్మికి మల్లేషు ఊరెడుతూ తనకి ఆటో కొన్నాళ్ళు అప్పగించినట్లు మాత్రం చెప్పాడు.

ఆలోచించగా ఆలోచించగా మల్లేషు తీసుకొన్న నిర్ణయం సబబుగానే తోచింది నారాయణకి. వెంకటలక్ష్మిని కూడా తీసుకెళ్తేనో అనే ఆలోచన బుర్రని తొలిచేయటం మొదలెట్టింది.

ఆరోజు బస్సుల 'బందు' కావటంతో పైసలు చేతిలో బాగా పడ్డాయి. వస్తూవస్తూ స్వీట్లు, పూలు, కోడికూరా కొనుక్కొని ఇంటికి వచ్చాడు.

"ఏందయ్యో ఉసారు మీదున్నావ్?" అంది వెంకటలక్ష్మి అతను అందించినవి తీసుకొంటూ.

"ఈ రోజు మనకి పండగే వెంకటీ. బస్సుల బందుకదా బేరాల మీద బేరాలు!"నవ్వేడు నారాయణ.

నారాయణ పిల్లలిద్దరూ స్వీటు తీసుకొని వాకిట్లో ఆడుకోవటం మొదలెట్టారు.

కోడికూరకు కావల్సిన గసాలు, కొబ్బరి మసాలాలు తీసుకొచ్చుకొని వెంకటలక్ష్మి సన్నికల్లు దగ్గర కూర్చొని మసాల నూరటం మొదలెట్టింది.

నారాయణ చూపంతా ఆమె మీదే ఉంది. తనని ఒళ్ళంతా తడుముతోన్న భర్త చూపుని గమనించిన వెంకటలక్ష్మి ముసిముసి నవ్వుల్తో పనిచేసుకుపోతోంది.

అన్నాలు తినటం అయ్యాక పిల్లల్ని నిద్రపుచ్చి, వాకిట్లో నులక మంచం మీద వెల్లకిలాపడుకొని చుక్కలు లెక్కెడుతున్నట్లున్న నారాయణని చూసి "ఏందయ్యో అంత ఘనం ఆలోచన" అంటూ వచ్చి ఆ పక్కనే నేల మీద చతికిలపడింది వెంకటలక్ష్మి.

కొంతసేపు ఏమి మాట్లాడకుండా గమ్మునే ఉండి, "వెంకటలక్ష్మి నేనోటి చెప్తా వినుకుంటావా?" ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు నారాయణ.

"గదేందయ్యా నీ మాటనేనెన్నడు కాదన్నాను!" ప్రేమగా అంది.

మల్లేషు చెప్పినదంతా వివరంగా చెప్పాడు నెమ్మదినెమ్మదిగా నారాయణ.

"ఇంతకీ నువ్వనే దేందయ్యా?" అతను చెప్పిన విషయం జీర్ణం కానట్లు ముఖం అదోలా పెట్టి అనుమానంగా చూసింది.

"నువ్వు .... నువ్వు కూడా అందుకు ఒప్పుకుంటే_ _ _ " ఒక్కొక్క మాటనే తడుముకొంటూ అన్నాడు.

“ఛూ .. నువ్వేనా ఆమాటందీ!” గభాలున లేవబోయింది.

“నా మాట ఇనుకోవే వెంకటీ .. ఇంజక్షనుతోనే గర్భం వచ్చేలా చేస్తారంటే, లేకపోతే నేమాత్రం అడుగుతానా... ఒక్క ఏడాది ఓపికపడితే మస్తు పైసలు వస్తాయి. ఇందులో ఏవుంది. రంకుతనమా ఏమన్ననా? వాళ్ళకి పిల్లలు కావాల మనకి పైసలు కావాల్న. ఏళ్ళకి ఏళ్ళు నేను గల్ఫ్‌లో ఉండి ఆడ నానా చాకిర్లూ చేయలే, గట్లనే గిదీ అనుకోయే. తర్వాత ఓ కొంపోగోడో కొనుక్కొని మనం మన పిల్లలూ హాయిగా గడపొచ్చు! ఎంతకాలం కష్టపడితే ఇన్ని పైసలు కళ్ళచూడగలం, జరంత ఆలోచన చేయే!” జాలిగా అడిగాడు.

ఒక నిమిషం ఆగి అంది వెంకటలక్ష్మి “మనకోసమని పిల్లల్ని కనేటందుకే పురుడంటే మరోజల్మని నొప్పులు పడతాం. నెల తప్పిన కాణ్ణుంచి వాంతులూ, తిప్పటం, నీరసం, సోయిలేకపోటం తినలేక తిరగలేక నెలనెలా తిప్పలు పడి గెట్లయితేనేం కంటాం. తర్వాత పెరుగుతున్న పిల్లల ముచ్చట్లు చూస్తూ బాధమరుస్తం. కానీ గిదేంది... తొమ్మిది నెలలు ఎవరి కోసమో... “ మరి ఆలోచించలేక పోయింది.

ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు “తప్పది లక్ష్మి మన పిల్లల్ని బాగా చదివిపించాల్నంటే తప్పది. అందుకోసమే ఆనాడు దేశాలు పట్టిపోతిని. కాని దేవుడు మంచిగా చూళ్లే, నేను ఖాళీ చేతుల్తో తిరిగొచ్చిన ఇప్పుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొందాం. ఆలోచన చేయే వెంకటీ” అర చేతుల్ని నిమురుతూ

ప్రేమగా అన్నాడు.

“ఒకేళ పురిట్లో నాకేమన్న అయితే?” భయం కళ్ళల్లోకి పాకింది.

“ఆ భయం అఖర్లేదే. తొమ్మిది నెలలూ కనేదాకా ఆడ డాక్టర్లు కండ్లల్లో పెట్టుకొని చూస్తరట. మల్లేషు చెప్పిండు... వెంకటలక్ష్మి మెత్తబడటం గమనించి గుండెలకు హత్తుకున్నాడు.

“కానీ పిల్లలు... అన్నిదినాలు అందర్ని వదిలి ఊరుకాని చోట” దుఃఖం ముంచుకొొచ్చి వెక్కుతూ అంది.

“మా యమ్మకి కబురంపుతా, నువ్వు తిరిగొచ్చే వరకూ మంచిగా చూసుకుంట కదా! దిగులు పడకే..”

అయిష్టంగానే పిల్లల భవిష్యత్తుని కళ్ళల్లో కలలుగా అల్లుకొంటూ తల వూపింది వెంకటలక్ష్మి. మరిక వెంకటలక్ష్మికి ఆలోచించే అవకాశం ఇవ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేసేసాడు నారాయణ.

మల్లేషు ఊరి నుండి వచ్చేక వివరాలన్నీ కనుక్కొని తాను కూడా వెంకటలక్ష్మిని ఆ ఊరు తీసుకెళ్ళాలను కుంటున్నట్లు తెలియజేశాడు నారాయణ. సాధ్యమైనంత తొందరలో తమకు కూడా రిజిస్టరు చేయించమని కోరాడు.

గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్ నగరంలో అవసరం ఎక్కువగానే ఉంది. విదేశాల నుండి పిల్లల కోసం వస్తున్న జంటల సంఖ్య పెరుగుతున్నకొద్దీ వాళ్ళ కోసం పిల్లల్ని కనిపెట్టే పేదతల్లుల కోసం ఆ హాస్పటల్ ద్వారాలు తెరిచే ఉంటాయి.

తొందరగానే వెంకటలక్ష్మికి పిలుపు వచ్చింది. ఊళ్ళో వాళ్ళ తమ్ముడి దగ్గర ఉన్న తల్లిని సాయానికి పిలిపించుకొన్నాడు నారాయణ. పిల్లల బాధ్యత అత్తకి అప్పగించి, కళ్ళనిండా నీళ్ళతో, గుండెనిండా బరువుతో, వెంకటలక్ష్మి నారాయణ వెంట బయల్దేరింది.

రైలు దిగగానే ఆ వూర్లోనే ఉన్న మల్లేషు తమ్ముడు, వీళ్ళిద్దరినీ కలుసుకొని ముందు యింటికి తీసుకుపోయి నాస్తా, టీ యిప్పించి తర్వాత హాస్పటల్కి తీసుకువెళ్ళాడు. హాస్పటల్ మెట్లెక్కుతుంటే వెంకటలక్ష్మి గుండె దడదడలాడింది. వెనక్కి పారిపోతేనో అనే ఆలోచన వచ్చి ఆగిపోయింది. నారాయణ వెనక్కి తిరిగి ఆమె చెయ్యి అందుకొని 'మరేం పర్లేదు రాయే' అంటూ ముందుకు నడిచాడు.

స్కూలు డ్రస్సు వేసుకొని ఆటోలో బడికిపోతూ, తనకి టాటా చెప్తున్నట్లు తన పిల్లల్ని కళ్ళ ముందు ఊహల్లోనికి తెచ్చుకొని ధైర్యంగా లోపలికి అడుగెట్టింది.

వెంకటలక్ష్మిని వెంటనే ఆడ్మిట్ చేసుకొని వరస మీద రక్త పరీక్షలు ఎక్సరేలు... ఒకటేమిటి రకరకాల పరీక్షలతో హడావుడి ప్రారంభమయింది. చూలు కడుతుందా లేదా అని పాడి ఆవుని కొనుక్కొనేటపుడు చేసే పరీక్షల్లా తోచి, వెంకటలక్ష్మికి ఇబ్బందిగా అనిపించింది.

ఓ వారం రోజుల పాటు పరీక్షలన్నీ అయ్యి వెంకటలక్ష్మి ఆరోగ్యవంతురాలని నిర్ధారించుకొన్నారు.

వెంకటలక్ష్మికి ప్రత్యేక రూములో గర్భం నిర్ధారణ అయ్యేవరకు ఉంచారు. నారాయణని దగ్గర్లో వసతి గృహానికి వెళ్ళమని తెలిపారు. అప్పుడప్పుడు మాత్రం నారాయణ వచ్చి వెంకటలక్ష్మికి ధైర్యం చెప్పి వెళ్ళేవాడు. తర్వాత హాస్పటల్వారు మేం జాగ్రత్తగా చూసుకొంటామని భరోసాయిచ్చి నారాయణను ఊరికి పంపించేశారు.

రోజూ వచ్చి తన దగ్గర కాసేపు కూర్చొని, తర్వాత డాక్టరుతో మాట్లాడే విదేశీజంటని చూస్తుంటే, వెంకటలక్ష్మికి మొదట్లో చాలా చికాకుగా ఉండేది. చూడి ఆవుని కనిపెట్టుకు చూస్తున్న యజమానుల్లాగే కనిపించేవారు వాళ్ళు! తర్వాత ఆ విదేశీయ వనిత శరీరంలో గల లోపం వల్ల గర్భం ధరించలేదనే విషయం తెలుసుకొని కొంచెం సమాధాన పడింది. కానీ, తన పిల్లల్ని దూరం చేసినందుకు కోపం పోలేదు!

వాంతులూ వికారంతో లేవలేక సతమతమౌతోన్నపుడు, వీళ్ళ కోసం తన శరీరాన్ని, ప్రాణాన్ని ఎందుకు పణంగా పెట్టాలి అనే బాధ ఆమెని వెన్నంటే ఉండేది. హాస్పటల్లో లేవలేని వాళ్ళ ఆలనా పాలనా చూడటం, వంటగదిలో సాయం చేయటం, తోటపనిలాంటి పనులు చేస్తుండటమే తప్ప వెంకటలక్ష్మికి పెద్దగా బరువు పన్లేమీ చేసేది ఉండదు.

నిండు గర్భిణులు బరువుగా తిరగటం చూస్తుంటే... 'పేదరికం వల్లనే కదా తనలాంటి వాళ్ళంతా ఇలా ఇక్కడికి చేరారు' అనే ఆలోచన వచ్చి వారిమీద జాలి కలిగేది. అప్పుడప్పుడు ఒకరినొకరు ఓదార్చుకొనేవారు.

టైము ప్రకారం తిండీ మందులూ వంటపట్టి వెంకటలక్ష్మి చురుకుగా ఆరోగ్యంగా తయారైంది. కానీ మనసులో పిల్లల ధ్యాస వదిలేది కాదు.

ఉదయానే గుడ్డూ, పాలు తీసుకుంటున్నపుడు 'పాలంటే స్వరూపకి ఎంత యిష్టమో, ఎప్పుడన్నా ఒక రూపాయి మిగిలినా ఆ పిల్లకి పాలుకొని తాపిచ్చేదాన్ని! సూరికి మాత్రం గుడ్డంటే ఎంత ప్రాణమో! గుడ్డు ఉడికించి పెడ్తే చిన్నచిన్న ముక్కే కొరికి తింటూ కూర్చునేటోడు. అపుడు వాళ్ళ ముఖాలు ఎంత ఆనందంగా ఉండేవో' పిల్లల్నితలచుకొనీ అట్టాగే కూర్చుండిపోయేది.

"ఏందేలచ్చిమీ: బిడ్డలు యాదికొచ్చిన్రా?" మల్లేషు పెళ్ళాం కనకమో మరొకరో పలకరించేవాళ్ళు.

మూడు నాలుగు నెల్లు పోయాక వచ్చిన నారాయణ భార్య వెంకటలక్ష్మి బుగ్గలు సవరిస్తూ "వెంకటీ తిండి బాగా వంట పట్టింది, దొర్సాని లెక్కగొడ్తున్నవే ఇపుడు!" అంటూ ముఖంలోకి చూస్తూ అట్లాగే మురిసిపోయాడు.

"అవుమల్ల, దొరబిడ్డని మోస్తున్న గందా, గొడ్డుని మేపినట్లు మేపుతున్నరు. మరింకెట ఉంట!" మనసులోనే అనుకొని "బిడ్డలెట్ల ఉన్నారయ్యా? ఇస్కూలుకి పోతున్నారా? మీ యమ్మని గిట్టా సతాయించట్లేదు కదా? ఈపాలి వచ్చినపుడు అల్లని కూడ తోలకరా చూడాల్నుంది!" అంది. నీళ్ళు గిర్రున తిరిగినాయి ఆమె కళ్ళల్లో.

నారాయణ ఆమెని జాలిగా చూస్తూ అన్నాడు "అందరం ఈడకే వచ్చేయాలనుకుంటూన్నానే. ఏడున్నా ఆటో నడపటమో లేకుంటే కూలో నాలో చేస్తేనే కదా జరిగేది మనలాటోల్లకి! ఏడకూడు దొర్కుతే అదే మనూరు. మల్లేషు తమ్ముని కనుక్కున్న ఆడు పని చేసే కార్ఖానాలో పనోళ్ళు కావాల్నంట. అందుకే వచ్చిన! ఇయాల్నో రేపో ఆడకిపోయి పని దొర్కుతే అల్లని తోలుకొస్తా! ఈ లోగా ఏ బస్తీల నన్నా ఇల్లు గిట్టా ఎతుకులాడమని ఆడికే చెప్పినా!"

వెంకటలక్ష్మి ముఖం చాటంత అయింది 'అందరం ఈడనే కలోగంజో తాగి బతకొచ్చు' మనసులోనే అనుకుంది. "పురుడైనంక ఈడనే ఆయా లెక్కని పనిచేయొచ్చునంట! నెలనెలా జీతం లెక్కన ఇస్తరని కనకం చెప్పింది. అట్ల నేను ఈడే పనిచేస్త. పైసలు జమచేసి సూర్నీ, స్వరూపని మంచిగ చదివిపియ్యొచ్చు!" పిల్లల భవిష్యత్తుని కళ్ళల్లోకి తెచ్చుకొంటూ అంది.

"నిజమేనే. బిడ్డపుట్టినంక వచ్చే పైసల్తో గొడ్డూగోదా కొనుక్కొని ఈడే సెటిలైపోదాం!" అన్నాడు.

చూస్తుండగానే నెలలు గడచిపోయాయి. నారాయణ పిల్లల్ని తెచ్చేసాడు. కార్ఖానాలో పనికి కుదిరాడు. వెంకటలక్ష్మి పోరుతో సూరిని, స్వరూపని సర్కారు స్కూల్లో చేర్చాడు. వెంకటలక్ష్మి పురుడయ్యే వరకూ, తల్లిని కూడా తనతో వెంటబెట్టుకు వచ్చాడు.

నెలలు నిండుతున్న కొద్దీ వెంకటలక్ష్మి బరువుగా తిరుగుతూ ఎంత తొందరగా ఈ బరువు దిగుతుందా అని రోజులు లెక్కబెట్టసాగింది. సూరీ, స్వరూపా కడుపుల ఉన్నప్పుడు పొట్టలో బిడ్డ తంతే, ఒకవైపు బాధ కల్గినా కొంత మురిపెంగా కూడా ఉండేది. ఇప్పుడు ఒక్కోసారి విసుగు కలుగుతోంది.

మొత్తం మీద ఎలా అయితేనేం నెలలు నిండి నొప్పులు మొదలయ్యాయి. లేబర్‌రూములోకి వెంకటలక్ష్మిని తీసుకెళ్తుంటే విదేశీజంట ఆతృతగా చూస్తూ నిలబడ్డారు. 'వీళ్ళ కోసం ప్రాణాలకి తెగించి ఈ బరువు మోసి ప్రాణం పోతున్నట్లున్న ఈ నొప్పుల్ని నేనెందుకు భరించాలి' అని చిర్రెత్తు కొచ్చి వాళ్ళ వైపు నిరసనగా చూసింది.

వెంకటలక్ష్మికి పండంటి దొరబిడ్డ పుట్టాడు. ఆ బిడ్డని చూడగానే ఒక నిమిషం ఆమెకి మమకారం కలిగింది.

మళ్ళీ అంతలోనే రేపోద్దుట వీడెక్కడో నేనెక్కడో! ఎందుకు ప్రేమని పెంచుకోటం అని ముఖం తిప్పేసుకొంది. ఆ విదేశీ జంట బిడ్డని అపురూపంగా చూస్తుంటే, 'పోనీ తను పడిన శ్రమ వాళ్ళకి ఆనందం పంచింది' అని, అలసటగా కళ్ళు మూసుకొంది.

బిడ్డ ఆరోగ్యంగా ఉండేసరికి విదేశీజంట అన్ని ఫార్మాల్టీలు పూర్తిచేసుకొని బిడ్డని వారం పది రోజులకే తీసుకొని వెళ్ళిపోయారు.

బిడ్డని తీసుకుపోతుంటే వెంకటలక్ష్మికి గుండెలో ఏమూలో చిన్న కదలిక! తెంచుకుపోయిన తల్లి పేగు కలుక్కుమంది. కళ్ళు నీళ్ళతో నిండాయి. మాతృప్రేమకేమో గుండెలు భారమయ్యాయి. పాలు యింకిపోటానికి డాక్టరు ఇంజక్షను చేసిన చోట చురుక్కుమంది.

నెలరోజులకల్లా వెంకటలక్ష్మి తేలిగ్గా తిరగటంతో, ఆమె హాస్పటల్లోనే ఇతర కాబోయే తల్లుల ఆలనాపాలనా చూసేందుకు ఆయాగా జీతానికి కుదిరింది.

ఒక్కోసారి బిడ్డ ముఖం కళ్ళల్లో మెదిలినా తన పిల్లల సంరక్షణ, హాస్పటల్లో పనితో మామూలుగా అయిపోయింది వెంకటలక్ష్మి. హాస్పటల్ వారు ఇచ్చిన సొమ్ముతో మేదరబస్తీలో ఒక చిన్న గుడిసె కొనుక్కున్నారు. కార్ఖానా నుండి వచ్చాక బస్తీ మొగలో సాయంత్రం పూట చిన్న కూరగాయల బండి కూడా పెట్టుకున్నాడు నారాయణ.

తాను చేసిన పని కుటుంబాన్ని గట్టుకి చేర్చిందిలే... ఇంక రోజులు ఇలా గడిచిపోతే చాలు అని తృప్తిపడింది వెంకటలక్ష్మి.

ఒక అయిదారు నెలలు గడిచాక హాస్పటల్ హాస్టల్లో పనిచేసుకుంటున్న వెంకటలక్ష్మి దగ్గరికి కనకం వచ్చి "నిన్ను డాక్టరమ్మ హాస్పిటల్‌కి రమ్మని కబురంపారు!" అని చెప్పింది.

"అక్కడ నాకేమి పని ఎందుకు పిలిచారో" అనుకొంటూ ఔటు పేషంటు వార్డుకి వెళ్ళింది. అక్కడ నారాయణని, అతనితో ఉన్న మరో విదేశీ జంటనీ చూడగానే చటుక్కున ఆగిపోయింది. విషయం కొంత అర్ధమయింది వెంకటలక్ష్మికి.

ఆమెని చూడగానే నారాయణ "రా లక్ష్మి. డాక్టరు నీతో మాట్లాడటానికి పిలిచారు" అంటూ దగ్గరికి వచ్చి, దిమ్మెరపోయి నిల్చున్న వెంకట లక్ష్మి చేతిని పట్టుకొని డాక్టరు రూములోకి నడిచాడు.

వెనక్కి ఒక్క పరుగున పారిపోవాలని వెంకటలక్ష్మికి ఉంది. కానీ కాళ్ళు దిమ్మకట్టి పాతిపెట్టేసినట్లుగా అయిపోయాయి. కట్టుకొయ్యకి కట్టిన ఆవు గింగిరాలు పోతున్నట్లు మనసు కింక పెడ్తోంది.

*(నవ్య వారపత్రిక, బ్రౌన్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ–2008 లో ప్రత్యేక బహుమతి పొందిన కథ)*

శ్రీపతి

## కథా మార్గదర్శి కథ

***ఆరోజు కుక్కల వేన్‌వాళ్ళు తీసుకువెళ్లిన కుక్క, అంతకు ముందు ప్రెస్ మేనేజర్ రాజుగారు గారు పెంచిన కుక్కేనట! అది వీధుల్లో తిరిగి ఎవరినో కరవడంతో, తగువుకు వస్తారని బెల్ట్ తీసి విడిచి పెట్టేశారట. అట్లా వీధుల్లో సంవత్సరం నించీ తిరుగుతూందిట. ఆ కుక్క వల్ల ఈ పిల్లలు కలిగాయట. పాపం, ఆ తల్లికుక్కకి తెలీదు గదా.***

"దాన్ని కొట్టకండి" అంది అమ్మ.

అన్నయ్య విరిగిపోయిన క్రికెట్ బేట్ పట్టుకుని ఓపక్కా, నాకు అందుబాటులో దొరికిన రోకలిబండతో నేనింకొక పక్కా, ఆ కుక్కని చుట్టాం!

"ముక్తా, జాగ్రత్త!" అంటున్నాడు అన్నయ్య.

అది అక్కణ్ణించి తప్పించుకొని పారిపోవడానికి చివరి ప్రయత్నాలు చేస్తూంది. కానీ కదిలి వెళ్ళే అవకాశం లేదు. తలమీద కొట్టి చంపేసే ఉద్రేకంలో ఉన్నాడన్నయ్య. వాడి కళ్ళు ఎర్రబడ్డాయి. ఆ కుక్క ఇంతకు పూర్వం నాలుగైదుసార్లు ఇంట్లో పాలు తాగెయ్యడం, వెన్న పెరుగులు తినెయ్యడం, అన్నాన్నీ, పప్పును ఎంగిలి చెయ్యడంలాంటి కష్టాలు చాలా పెట్టింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. సరిగ్గా ఈరోజు అవకాశం దొరికింది.

ఈరోజు...

నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు. ఆయనకి గంటగంటకీ కాఫీ ఇస్తున్నాము. బంధువులు, మిత్రులు చూడడానికి వస్తున్నారు. నిన్న కాఫీలకీ, టీలకీ పాలు రెండు పావులు ఎక్కువ పోయించుకున్నా సరిపోలేదని అమ్మ, ఆ రోజు మరో నాలుగు పావులు ఎక్కువ పోయించుకుంది. మొత్తం పాలు సుమారుగా తాగివేసి, కొన్ని ఒలకబోసి, బయటపడుతూన్న కుక్క కంటబడడంతో అన్నయ్య దాన్ని వంటగదిలోనే ఉంచి, విరిగిపోయిన క్రికెట్ బేట్ అందుకున్నాడు.

తప్పదు... దాన్ని చంపేయ్యాలన్నంత బాధగా ఉంది. కోపంగా ఉంది.


కుక్క పాలు తాగేయ్యడంతో సంఘంలోని గౌరవప్రపత్తులన్నిటినీ నీట ముంచివేసినంత అయింది. సమీపంలో ఎక్కడా దొరకవు. మళ్ళీ హోటల్‌కి పంపించి, కాఫీలు దఫాదఫాలుగా తెప్పించాలి. బాధగా ఉంది. హోటల్ కాఫీ నాన్నగారికి అసలు పడదు. ఏం చెయ్యడమో ఈ పాపిష్టి కుక్కల్ని?

అంతలో... అమ్మ హాల్లో ఎవరితోనో మాట్లాడుతున్నదల్లా, మా సందడి చూసి, "దాన్ని కొట్టకండీ. వద్దురా విఠల్" అని అన్నయ్యని వారించి, "నువ్వు రావే ముక్తా" అని నన్ను పిలిచింది.

"వద్దా? ఎందుకు ఒద్దు?" అని అన్నయ్య అమ్మమీద ఉరిమాడు. ఆ కుక్కని ఈదెబ్బతో ఇంక ఇంటికి రాకుండా చేయ్యాలని అన్నయ్య పట్టుదల.

అమ్మ కేక విని నేను కొంచెం వెనక్కి తగ్గాను. సడలించుకున్నాను నా పట్టుదలని! కానీ, అన్నయ్య మాత్రం "దొంగముండా కుక్క" అని తిట్టాడు. "నీ రోజులు ముగిశాయిలే" అన్నాడు కసిగా.

ఇట్లాంటి సమయాల్లో తిట్లు తినేదాన్ని నేనే! ఇంతవరకూ కాఫీ కాచాను. నాన్నగారితో హెడ్మాస్టరుగారు మాటాడుతూంటే



వింటూ ఆఫీస్ గదిలో నించుండిపోయాను. పాలు కుక్కకి పెట్టినందుకు అమ్మ తిడుతుందేమోనని లోపల్లోపల భయం.

ఈ కుక్క బాధ మా ఒక్క ఇంటికే కాదు... మా కాలనీలో ఉన్న ఇళ్ళలో అందరూ దీని బాధ పడలేకుండా ఉన్నారు. ఆ మధ్య ఓ రెణ్ణెల్ల క్రితం సినిమా హాల్ ప్రొప్రయిటర్ భార్య వేణ్ణీళ్ళు సలసలా కాచి పోసేశారట. దాంతో దాని ఎడంపక్క కాలిపోయి పుండయింది. ఆ పుండు మెల్లిగా ఎలాగో నెలా పదిహేను రోజుల తరవాత తగ్గింది. ఇప్పుడు ఆ మచ్చ కనపడుతూంది.

అమ్మ మళ్ళీ "చూలుతో ఉందిరా" అంది.

దానితో అన్నయ్య ఒక్కసారి తన అభిప్రాయాలన్నీ మార్చుకొని, బేట్ బొగ్గులబస్తా వేపు విసిరేసి "పో" అని విసుగ్గా అరిచి లోపలికి వెళ్లిపోయాడు. అది పోవడానికి దారి ఇచ్చేసి, నేను లోపలికి వెళ్లిపోయాను. ఆ కుక్క పరుగుపరుగున నరకంలోని యమభటులను తప్పించుకున్నట్టు పారిపోయింది.

★★★

రెండు వారాల తరవాత కాలేజీ నుంచి వచ్చేసరికి ఇంట్లో అమ్మలేదు. అన్నయ్యని అడిగితే "డాక్టర్‌గారి గరాజ్ దగ్గర ఉంది. కుక్క పిల్లల్ని కన్నది. అక్కడే ఉదయం నుంచీనూ.." అని విసుక్కున్నాడు.

పుస్తకాలు షెల్ఫులో ఉంచేసి, చూడాలన్న కుతూహలం కొద్దీ వెళ్ళాను. చుట్టూ మూక ఉంది. వీధిలోని పిల్లలంతా అక్కడే గుమిగూడారు. మృణాలిని, శోభ, సత్య, అరుణ, బాలా త్రిపురసుందరీ ఆ వింత చూస్తున్నారు. పిల్లలన్నీ ముద్దుగా ఉన్నాయి. కళ్ళు మూసుకొని ఉన్నాయి.

అలా నిద్రలో పడిఉన్నాయి. తల్లి మాత్రం రాజ్యాన్ని జయించిన గర్వంతో ఉంది. తన గొప్పతనాన్ని చూడ్డానికి ఈ లోకం అంతా తన కాళ్ళ దగ్గరకి వచ్చారనే సంతోషంతో ఉంది. ఏవేవో తెచ్చి పెట్టినట్టున్నారు, రెండు పింగాణీ ప్లేట్లు ఎంగిలితో కనబడుతున్నాయి.

ఆడజాతి అవడంవల్ల కాబోలు... ఆ సానుభూతి మాకు! దాని మాతృత్వవేదన అర్థమైనట్టుంది. చిన్నపిల్లలు తప్పించి, మగవాళ్ళు పెద్దవాళ్ళ, ఎవ్వరూ లేరక్కడ. సుమారు ఓ పదినిమిషాలు నించుని, అమ్మనీ, కరుణనీ తీసుకొని వచ్చేశాను.

ఇంకా జనం అక్కడ మిగిలే ఉన్నారు. డాక్టరుగారి కుటుంబం ప్రస్తుతానికి అక్కడ లేదు. ఆయన కారు కూడా లేదు. ఆయన ఒక్కరే ఉంటున్నారు. అందుచేత సరిపోయింది. ఆ ఇంటావిడ ఉంటే ఇంతమంది వచ్చేవారు కాదు. ఆమె అంటే కొందరికి పడదు. ఆమె హోదా చలాయిస్తుంది. గర్వం ఎక్కువ. ఎవరి బ్రతుకు వాళ్ళు బతుకుతున్నారే గాని, ఆమెను సేవించి బ్రతికే మనుషులు ఎవరూ లేరిక్కడ. అందుచేత ఆమె హోదా ఆమె దగ్గరే ఉంటుంది.

మూడు దినాల వరకూ ఆ కుక్కమీద ప్రత్యేకమైన అభిమానాన్ని కురిపించిన కాలనీ వాళ్ళంతా, తరవాత అంత శ్రద్ధ తీసుకోలేదు. ఆ కుక్కే ఇళ్ళవద్దకి వెళ్ళి ఆకలికళ్ళతో చూసేది. నేను ఇంటి దగ్గర ఉన్న సమయంలో వస్తే ఏదో ఇంత పెట్టేదాన్ని. కానీ, అది ఒకటి రెండుసార్లు తప్పించి నా తీరికకు అందుబాటుగా రాలేదు. పైగా మా అన్నయ్య ఉన్నప్పుడు ఇలాంటి పనులు చెయ్యటానికి పడదు. "మీకు వేస్ట్ చెయ్యడం బాగా అలవాటయిపోయింది. ఒకసారి క్యూలో వెళ్ళి నుంచోండి తెలుస్తుంది!" అని నొచ్చుకుంటాడు.

కరుణ అమ్మతో కుక్కపిల్లని తెచ్చి పెంచుకునే ఆలోచన చేస్తున్నాడు. వాడు మా చిన్నతమ్ముడు. ఏడేళ్లు. మూడవ తరగతిలో ఉన్నాడు. వాడి కోసమన్నా ఓ కుక్కపిల్లని తెచ్చి పెంచుకోవాలనుకుంటూంది అమ్మ. ఆ పిల్లల్లో గోధుమరంగుతో ఒకటి చురుకుగా ఉంది. మరో రెండు తెల్లవి. నల్లమచ్చలతో ఒకటి. మరోటి పూర్తిగా నల్లగా ఉంది. తల్లిపాలు విడిచాక, ఆ గోధుమరంగు పిల్లని తెచ్చి పెంచుకోవాలని అమ్మ నిశ్చయించుకుంది.

నేను ఆరు చదువుతున్న రోజుల్లో ఒక్కపిల్ల ఉండేది. నాన్నగారి ఆంగ్లోఇండియన్ ఫ్రెండ్ ఇచ్చారు. అల్సేషియన్. అమ్మ 'సురేంద్ర' అని పేరు పెట్టింది. అది ఇంట్లో అందరికీ ఒక ఆటవస్తువుగా ఎంత ఆహ్లాదాన్ని కలిగించేదో! ఆ జ్ఞాపకాలు

ఇప్పుడు వేదన కలిగిస్తున్నాయి. సురేంద్ర అకస్మాత్తుగా జ్వరంతో ఒక్కరోజులో చచ్చిపోతే అమ్మ కోలుకోవడానికి ఆరునెలలు పట్టింది. దానితో నాన్నగారికి కుక్కల పెంచడం మీద ఉన్న వ్యామోహం అంతా చచ్చిపోయింది. కావాలనుకుంటే ఇంకా మంచి జాతికుక్కలు దొరికేవి కాని, తెచ్చి అమ్మ మనసు బాధించడం ఇష్టం లేకపోయింది.

మళ్ళీ ఇప్పుడు ఈ కుక్కపిల్లకోసం.....

ఓ సాయంత్రం వంటపని అంతా పూర్తిచేసుకుని, జాకెట్ క్లాత్ శకుంతలాబాయిగారికి కుట్టుకి ఇచ్చి రావాలని వెళుతుండగా, ఆ గరాజ్‌లో చిన్నపిల్లల గొంతులు వినిపించాయి. అంతా తొమ్మిది పదేళ్ళ లోపు వాళ్ళే! హెడ్మాష్టరుగారమ్మాయి, లెక్చరర్‌గారి మేనల్లుడు, సినిమా ప్రొప్రయిటర్ కొడుకూ... మరీ చిన్నపిల్లలు. అందంగా, ఆరోగ్యంగా, వికసించిన చూపులతో, లలితమైన ఆలోచనలతో వినోదిస్తున్నారు.

ఆరోజు నాకు బాగా గుర్తుండిపోయింది. తల్లి శరీరం మీద గెంతులేస్తూ, పిల్లలు పాలు తాగుతున్నాయి. ఆ పిల్లలను ఆకర్షించిన సత్యం అక్కడ ఏమి ఉందో నాకు తెలుసు.

అదేరాత్రి.....

సుమారు తొమ్మిది గంటలకు హెడ్మాస్టారినీ ఎరెస్ట్ చేశారు. కాలనీ అంతా ఆశ్చర్యపోయింది. పాపం, ఆయనకు గంపెడు సంతానం. ఆయన తప్పించి వేరే ఆధారం లేని కుటుంబం. పెద్దపిల్లలు... పదకొండూ, తొమ్మిదీ, ఎనిమిదీ, ఏడూ ... చదువుకుంటున్నారు అందరూ. చిన్నపిల్లలు నాలుగూ, మూడూ, ఒకటీ తరగతుల్లో ఉన్నారు. మూడేళ్ళ చిన్నమ్మాయి. ఆ ఇంట్లో ఆయన మరదలు ఆత్మహత్య చేసుకొని ఇంకా నెల రోజులు కాలేదు. ఈ రోజు మళ్ళీ ఈ విపత్తు ఎదురైంది. చాలా మంచివాడు. సున్నిత హృదయం ఆయనది. దైవసంబంధమైన సంస్థలలో ఆయనకు ఉన్నత పదవులున్నాయి. సిటీలో మతసంబంధమూ, భక్తిసంబంధమూ అయిన కార్యక్రమాలలో ఆయన పేరు పేపర్లలో పెద్దఅక్షరాలలో కనబడుతుంది. స్కూల్లో మంచి పేరు పొందాడు. ఎప్పుడు ఉపన్యాసమిచ్చినా గీత నుంచీ, వేదాల నుంచీ, హోలీ బైబిల్ నుంచీ, ఖురానే షరీఫ్ నుంచీ ఎన్నెన్నో సూక్తులు గుప్పిస్తారాయన! వాళ్ళింట్లో ఏడాదికి రెండుమూడు వ్రతాలు జరుగుతాయి. దేశంలోని పుణ్యతీర్థాలన్నీ తిరిగారు. రోజుకొక్క సాధువుకన్నా భోజనం పెట్టడం ఆ ఇంట్లో అలవాటు. అట్లా 'రామా కృష్ణా' అనుకునే దైవభీతిగల ఆ బ్రాహ్మడు ఏం చేశాడా అని అందరూ ఆశ్చర్యపోయారు.

ఆ రెండోరోజు .....

కథ అంతా స్పష్టంగా తెలిసింది. ఎవ్వరూ నమ్మలేని విధంగా ఉంది. నెలదినాల క్రితం నాటి మరదలు ఆత్మహత్యకీ, ఈ నిర్బంధానికీ సంబంధం ఉందనీ, ఆమె ఆత్మహత్య చేసుకోలేదనీ, ఈయన చంపేశాడనీ కొన్ని బలమైన ఆధారాలు దొరికాయట! శవపరీక్ష చేసిన అధికారుల్లో లంచం తిన్న ఆచూకీలు తెలిశాయట. దానితో చాలా పెద్ద కల్లోలం రేగింది కాలనీ అంతటా.

ఆ రాత్రి అమ్మా, నాన్నగారూ, అన్నయ్యా ఆ విషయాలు మాట్లాడుకుంటూండగా విన్నాను. కాలేజీలో ఆ హెడ్మాష్టరును ఎరగని విద్యార్థులు లేరంటేనే మంచిది. ఆ మాటలన్నీ అయిపోయిన తరవాత, ఏమర్థమయిందో, ఏ ఊహల్లో ఉన్నాడో ఏమిటో కరుణ, "అమ్మా, ఆ కుక్కపిల్లల నాన్న ఏడమ్మా?" అని అడిగాడు. అమ్మ వినిపించుకోనట్టు తన స్వంత పనుల్లో మునిగిపోయింది.

వాడి ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయింది.

కుక్కల్లోనూ, పశువుల్లోనూ కుటుంబవ్యవస్థ లేదనీ, మనుషుల్లోనే ఈ తల్లీ, తండ్రీ, అక్కా, అన్నా, తమ్ముడూ, చెల్లీ, అన్న సంబంధాలున్నాయనీ వాడికి అర్థమయ్యేట్టు ఎలా చెప్పడమో తెలీక ఊరుకున్నాను.

కుక్కపిల్లలని... తల్లిపాలు విడవకుండానే, అందరూ ఎత్తుకుపోయారు. మేము తీసుకురావాలనుకున్న గోధుమరంగు కుక్కపిల్లని ప్రెస్‌మేనేజర్ రాజు తీసుకుపోయాడు. తతిమ్మా పిల్లలు నచ్చలేదు. పైగా లేవు కూడా!

ఇంట్లో కుక్కపిల్ల లేనందుకు అందరికీ ఉన్న గొప్ప ఆనందం, తనకు లేనట్టుగా కరుణ బాధపడిపోతున్నాడు. కుక్కపిల్ల సంపాదన కోసం అహోరాత్రులూ ఊహిస్తున్నాడు. కుక్కపిల్లతో ఆడుకుంటున్న ముచ్చట్లు మిత్రుల వద్దనుంచి వింటున్నాడేమో, మరీ ఉబలాటపడుతున్నాడు.

వాడి బాధపడలేక అమ్మ "అవి మంచి జాతివి కావురా, వాటి గోళ్ళు లెక్కబెట్టాము కదా! పందొమ్మిదీ, పద్దెనిమిదీ ఉన్నాయి. ఇరవై ఉంటేనే కాని మంచిదికాదు. చెడ్డవయితే వీధుల్లో వాళ్లను కరిచి, చాలా తగాదాలు తెస్తాయి. మంచి కుక్కపిల్లని తెచ్చుకుందాంలే!" అని ఓదార్చింది.

వాడికేమయిందో ఏమిటో మరి అప్పట్నుండీ కుక్కపిల్ల మాట ఎత్తలేదు.

సరిగ్గా ఆరోజుల్లోనే హెడ్మాస్టరుగారి కుటుంబం ఆ ఇల్లు ఖాళీ చేసి పాతటౌన్ లోని ఓ చవకబారు ఇంట్లో దిగారు. ఆ పిల్లలూ పెద్దవాళ్లూ రోడ్లమీద అక్కడక్కడా కనిపిస్తున్నారు. వాళ్ళలో ఎంతో మార్పు కనబడింది. దీనంగా మురికిగా ఉన్నారు.

ఈ సంగతి అమ్మతో చెబితే... "తండ్రి చేసిన తప్పుకి ఆ పిల్లలకీ, ఆ తల్లికీ శిక్ష!" అని అమ్మ విచారించింది.

హెడ్మాస్టరు ఖాళీచేసిన ఇంట్లో చక్రవర్తి అనే ఓ బెంగాలీ ఆయన ఉంటున్నాడిపుడు. ఆయనకు స్టేషన్‌రోడ్‌లో పింగాణీ సామానుల షాపు ఉందట!

ప్రెస్‌మేనేజర్ రాజుగారి చిన్నమ్మాయి మృణాళిని పుట్టినరోజు పండుగకు అమ్మ వెళ్లాలని తయారవుతూంది. ఆ రోజు కాలేజీలో 'అమెరికన్ పీస్ కోర్' మెంబర్ ఉపన్యాసం ఉండడం మూలాన, మధ్యాహ్నం క్లాసులు లేవు. తొందరగా ఇంటికి వచ్చేసరికి, అమ్మ తనతో రమ్మని పిలిచింది.

రాజుగారింట్లో, మేము తెచ్చుకోవాలనుకున్న గోధుమరంగు కుక్కపిల్ల కొంచెం పెద్దదయి, అధికారం చలాయిస్తుంది. వచ్చిన కొత్తవాళ్లని చూసి మొరగడం, ఇంట్లోవాళ్లు వారిస్తే గమ్మని ఊరుకోవడం, అలవడ్డాయి. రాజుగారు ఆ కుక్కని రౌడీని చెయ్యాలనుకున్నారని వాళ్ళావిడ నవ్వుతూ చెప్పారు. భార్య మాటవిని, రాజుగారు "పదిమంది రౌడీలకంటే ఒక కుక్క మేలు" అని చెప్పారు. అంతే కాకుండా ఈ రోజుల్లో, ఇలాంటి సిటీల్లో కుక్కలు తప్పకుండా అవసరం అన్నారు.

ఆయన కుక్కపిల్ల గొప్పతనాన్ని చెప్పుకున్నారు. వాళ్ళ ఇంటి కాంపౌండ్ లోకి ఏ కుక్కా, (మనిషి అని కూడా) రాదట. అంత గొప్ప శిక్షణ ఇచ్చారట. పోలీస్ కుక్కలకంటే చురుకయిందని పొగిడారు.

అది మేం పెంచుకోవాలనుకున్న కుక్క!

అమ్మ పెంచితే, దాన్ని మనుషులను చూసి భయపడేదానిగా, పిల్లిని చూసి ఇంట్లో దాక్కునేదానిగా చూసేది. పిరికితనం నూరిపోసేది. ఏమంటే. 'శాంతిరా' అనేది అన్నయ్యతో. నా ఊహాకి నాకే నవ్వు వచ్చి లోలోపల నవ్వుకున్నాను.

ఆ రోజే... రాజుగారు ఢిల్లీలో గవర్నమెంట్ ప్రెస్‌లో దేనిలోనో ప్రయత్నం చేస్తున్నారనీ, వాళ్ళ అన్నయ్య అక్కడ ఉన్నారనీ, ఆ ప్రయత్నాలు ఫలిస్తే రెండుమూడు మాసాల్లో పోవచ్చనీ తెలిసింది. ఆ మాటే వాళ్ళు గొప్పగా చెప్పుకున్నారు 'మేం ఢిల్లీ పోతున్నాం' అన్న ధోరణిలో!

అక్కణ్ణుంచి వచ్చేస్తున్నప్పుడు, మునిసిపాలిటీ కుక్కల వేన్‌వాళ్ళు ఒక మగకుక్క మీదికి తాడుముడి విసిరి, బిగించి పట్టుకొని, వేన్ లోని గజాల బోనులో పడవేసి తీసుకుపోవడం చూశాము.

ఇంటికి వచ్చేసరికి ఆ తల్లికుక్క దొంగల్లే వెతుకుతూంది. తలుపులనీ వేసేయడం వల్ల దొరకలేదు పాపం.

తరవాత కొద్దిక్షణాల్లో మంచంమీద కూర్చున్న అమ్మ కళ్ళనిండా నీళ్ళు. అమ్మ కన్నీరు చూసి, నేను మాట్లాడలేక ఏడ్చాను. అమ్మకి సురేంద్ర గుర్తుకు వచ్చిందో ఏమో అనుకున్నాను.

కొన్నాళ్ళ తరవాత అమ్మే చెప్పింది మాటల సందర్భాన... ఆరోజు కుక్కల వేన్‌వాళ్ళు తీసుకువెళ్లిన కుక్క, అంతకు ముందు ప్రెస్‌మేనేజర్ రాజుగారు గారు పెంచిన కుక్కేనట! అది వీధుల్లో తిరిగి ఎవరినో కరవడంతో, తగువుకు వస్తారని బెల్ట్ తీసి విడిచి పెట్టేశారట. అట్లా వీధుల్లో సంవత్సరం నించీ తిరుగుతూందిట. ఆ కుక్క వల్ల ఈ పిల్లలు కలిగాయట. పాపం, ఆ తల్లికుక్కకి తెలీదు గదా.

అమ్మ, కుక్కల్లో లేనిపోని అనురాగాలున్నాయనుకుని కుటుంబవ్యవస్థ కల్పించి, ఆ వేన్లో తీసుకుపోయిన కుక్కనేమో భర్తగా భావించి, దాని బాధ ఊహించుకొని బాధపడుతుంది.

ఈ కుక్కల కథ.. మనుషుల కథలాగే ఉంది. దానిలో నాకు ఆసక్తి కూడా కలిగింది. రాజుగారి ఈ కుక్కపిల్లను కూడా అట్లాగే చేస్తారేమో.

"అడిగి తీసుకుందామా అమ్మా?" అన్నాను.

"అట్లా ఇవ్వడాయన" అంది అమ్మ.

మేం ఒకప్పుడు దాన్ని పెంచుకుంటే బావుండును అనుకోవడం వల్ల, ఆ కుక్కపిల్ల మీద మరింత జాలితో కూడిన అభిమానం కలిగింది.

హెడ్మాస్టరు గారు ఖాళీ చేసిన ఇంటిలో ఉంటున్న చక్రవర్తిగారితో, రాజుగారికి దోస్తి బాగా కుదిరింది. రాజుగారు చిన్ననాడు, ఏడెనిమిదేళ్లు ఖరగ్‌పూర్లో ఉన్నారట! బెంగాలీ వచ్చుట. దాంతో వాళ్ళ పరిచయం సన్నిహితం అయినట్టుంది.

అనుకున్నట్టుగానే రాజుగారికి ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది.

మళ్ళీ అమ్మతో చెప్పాను ఆ కుక్కపిల్లను అడిగి తెచ్చుకుంటే బాగుంటుందని.

"వద్దులేవే, బాగా కరవడం నేర్పించారు. ఇరుగు పొరుగులతో ఇంక పడలేం!" అంది అమ్మ.

నేను ఊహిస్తునట్టుగానే వెళ్లిపోతూ ఆ కుక్కపిల్లను చక్రవర్తిగారికిచ్చి వెళ్ళిపోయాడాయన. ఆ కుక్కపిల్ల మాత్రం వారం దినాలు బెంగపెట్టుకొని ఒకటే ఏడుపు ఏడ్చింది.

★★★

సుమారు ఆరు మాసాల తరవాత అన్నయ్యా నేను ఒక ఇంగ్లీషు మేట్నీనించి వస్తున్నాము. రోడ్డుపక్కగా తల్లికుక్క నిద్రపోతున్నట్టుగా కనపడింది.

ఇంటికి వచ్చిన తరవాత అమ్మ ఎర్రటికళ్లు కనిపించాయి. "ఏమిటి" అని అడగ్గా కరుణ చెప్పాడు. ఆ తల్లి కుక్కని చక్రవర్తి వాళ్ళ కుక్కచేత కరిపించారనీ, పాలు తాగేసిందని చక్రవర్తి కొట్టాడనీ, తరువాత ఆ దెబ్బతో గిలగిల తన్నుకొని, మొరిగి మొరిగి ప్రాణాలు వదిలేసిందనీను.

ఎంత విషాదకరమైన, దీనమైన బతుకు కుక్కలది?

అమ్మకు ఆ కుక్కల కుటుంబం అంతా పరిచయం. అవి తనకి సంబంధించిన మనుషులయినట్టు, వాటిలో కుటుంబవ్యవస్థని కల్పించి బాధపడుతుంది. కుక్కల వాన్ లోని మగకుక్క భర్త అయినట్టు, ఆ తల్లికుక్క భార్య అయినట్టూ, చక్రవర్తిగారి కుక్క కొడుకు అయినట్టూ, కొడుకే తల్లిని కరిచి చంపినట్టూ... ఇదీ అమ్మ బాధ!

కుటుంబ వ్యవస్థలేని కుక్కల జీవితానికీ, కుటుంబ వ్యవస్థ ఉండి సాంఘిక నీతి నియమాలు పాటించని హెడ్మాస్టరు గారి కుటుంబానికీ నాకు భేదం కనిపించలేదు.

చక్రవర్తిగారి కుక్కకి తెలీదా, తను కరిచినది కన్నతల్లినే అని! తెలియకపోవచ్చు..!!

మనిషికి తెలిసిందా ఏమిటి, జీవితం మీద గంపెడాశతో యౌవనంలో ఉన్న మరదలని!!

*(ఆంధ్రప్రభ వారపత్రిక 25.10.1967 సంచిక నుంచి పునర్ముద్రణ)*



# బాలకథ

జులై నెల సంచిక నుంచి ప్రతీ నెలా కథామంజరిలో, పిల్లల కథలు రెండు ప్రచురింపబడతాయి! ఈ కథల విషయమై చిన్న సూచనలు:

- 10-16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లలు స్వయంగా ఆలోచించి, వారికున్న ఆలోచనలకి అక్షర రూపం ఇవ్వాలి. కథాంశం ఏదైనా వ్రాయవచ్చు. పిల్లలు ఇష్టపడే కథలు, పిల్లలు అర్థం చేసుకునే స్థాయిలో కథారచన ఉండాలి.
- 400 పదాలకు మించకుండా ఇలా వర్డ్‌లో టైపు చేసి పంపాలి!
- కథ ఎలా వ్రాసినా సరే, ప్రచురణకు స్వీకరించే కథలను తగు రీతిలో మార్పులు, చేర్పులు చేసి ప్రచురణ చేయబడతాయి!
- పెద్దవారు కూడా పిల్లల కథలు వ్రాసి పంపవచ్చును. అవి కూడా ప్రచురణకు తీసుకోబడతాయి!
- పెద్దవారు వారి కథలను పిల్లల పేరుతో వ్రాసి పంపడం అనైతికమే కాకుండా, మా ఈ ప్రయత్నాలకు ఆశించిన ఫలితాలు దక్కకుండా చేస్తాయి!
- ప్రచురింపబడే కథలకు తగిన పారితోషికం కూడా ఉంటుంది!
- కథలు పంపవలసిన మా ఇమెయిల్: submit@kathamanjari.in

కథలు వ్రాయగలిగే పిల్లల్ని ప్రోత్సహిస్తూ, వాళ్ళల్లో సృజనాత్మకతకు పదును పెట్టే మా ఈ ప్రయత్నాలలో అందరి సహాయ సహకారాలను అందించ కోరుతున్నాం!



***

కథామంజరి బృందం